కవిత్వం

సుధామ

# కవికాలమ్



**సుధామ (అల్లంరాజు వెంకటరావు)** 25 నవంబర్ 1951లో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎం.ఓ.యల్, ఎం.ఫిల్ చేసి, 'ఇమేజరీ ఇన్ ప్రోగ్రెసివ్ తెలుగు పొయెట్రీ' పై పరిశోధన చేసారు. 1975-1977 కరీంనగర్‌లో బిషప్ సాలమన్ జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా, ఆ తరువాత 1978లో ఆకాశవాణిలో చేరి ముప్ఫై సంవత్సరాలపాటు పనిచేసి, కార్యక్రమ నిర్వహణాధికారిగా 2008 ఆగస్టులో స్వచ్ఛంద పదవీ విరమణ చేసారు. 1967లో వీచికలు, 1974లో 'మేం' (మిత్రుడు డా॥ నాగినేని భాస్కరరావుతో కలిసి) కవితా సంకలనాలు ప్రచురించారు. 1990లో అగ్నిసుధ కవితా సంకలనం ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు, కలహంసి అవార్డు పొందింది. కవిగా, రచయితగా, కార్టూనిస్టుగా, విమర్శకునిగా, సినీ సమీక్షకునిగా, కాలమిస్టుగా, పదప్రహేళికల కూర్పరిగా, వక్తగా తెలుగు సాహిత్య లోకానికి పరిచితులు. ఆంధ్రభూమి దినపత్రికలో 'సం.సా.రాలు' (సంస్కృతి-సాహిత్యం-రాజకీయాలు) కాలమ్‌లోని వ్యాసాలతో 2001లో వెలువడిన గ్రంథానికి తెలుగు విశ్వవిద్యాలయం 2004లో సాహితీ పురస్కారం ఇచ్చింది. ఇప్పటికీ ఆ కాలమ్ కొనసాగుతూ వుంది. ఆకాశవాణి, దూరదర్శన్‌లో ప్రసారమైన సుధామ పాటలు 'మనసు పావనగంగ' పేరిట 2010లో గ్రంథస్థమయ్యాయి. ఇటీవలే 'చిత్రగ్రంథి' కవితా సంపుటి నవంబర్ 2011లో ప్రచురించారు. ఇప్పుడీ 'కవికాలమ్'.

# కవికాలమ్

(సమకాలిక సంఘటనల స్పందనాత్మక కవిత్వం)

(2007 - 2009)

సుధామ

పాలపిట్ట-బుక్స్
హైదరాబాద్

**KAVIKAALAM**

*(Poetry)*

**-SUDHAMA**

Cell: 98492 97958
sudhama60@yahoo.com

© Writer

Inner Drawings : K.N Bhaskar

First Edition : December, 2011

For Copies : Sudhama
G-12, Sadath Towers
Padmavathi Apartments,
Saleemnagar Colony, Malakpet
Hyderabad - 500 036
040- 24545780, 98492 97958

Palapitta Books
# 16-11-20/6/1/1
# 403, Vijayasai Residency
Saleem Nagar, Malakpet
Hyderabad - 500 036
palapittabooks@gmail.com
Cell : 98487 87284

Printed at : Vipla Computer Services
*(Designers & Multicolour Offset Printers)*
Nallakunta, Hyderabad - 500 044
Ph: 040-27677078, 27676910
viplavision@gmail.com

Price : ₹ 90

సాహితీ ప్రియులు

నా ప్రాణ స్నేహితులు

కీర్తిశేషులు

**డాక్టర్ మాడభూషి రంగాచార్య**

**కె.వి.కామేశ్వరరావు**

స్మృతికి–

# కృతజ్ఞతలు

సమకాలిక సంఘటనల స్పందనలుగా కవిత్వ రూపంలో 'కాలమ్' రాయమని అడిగి 'కవికాలమ్' నా చేత రాయించింది ఆంధ్రప్రభ దినపత్రిక సంపాదకులు శ్రీ పి.విజయబాబు. ఆదరించింది దినపత్రిక పాఠకలోకం.

2007 నవంబర్ ఒకటి నుండి, 2010 మార్చి నాలుగు వరకూ గురువారాల్లో 'ఆంధ్రప్రభ'లో వచ్చిన 'కవికాలమ్'లో ఒక ముప్పై తప్ప మిగతావన్నీ కవిత్వ రూపంలో రాసినవే. ఇలా 'కవికాలమ్'కు పుస్తక రూపం ఇవ్వడానికి వాటిల్లోంచి యాభై కవితలను ఎంపికచేసి, తన విశ్లేషణాత్మక 'ముందుమాట'తో, 'పాలపిట్ట బుక్స్'గా ప్రచురిస్తున్నది ప్రముఖ విమర్శకులు, సాహితీవేత్త, పాలపిట్ట సంపాదకులు శ్రీ గుడిపాటి. పుస్తక రూపకల్పనలో సహకరించింది సహసంపాదకులు శ్రీమతి వై.వసంత.

'కాలమ్'గా వస్తున్నప్పుడే కవితలకు చిత్రరచన చేసినది ఆంధ్రప్రభ చిత్రకారులు శ్రీ కె.ఎన్. భాస్కర్.

నా షష్టిపూర్తి వేళకు ఈ పుస్తకం వెలువడాలన్న పూనిక– జీవన సహచరి, ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణాధికారి శ్రీమతి ఉషారాణి, మా బాబు 'ఇన్ఫోసిస్'లో టెక్నాలజీ ఎనలిస్టు చిరజీవి స్నేహిత్‌లది.

కుటుంబ సభ్యుల, స్నేహితుల ఆదరాభిమానాలు ఆనందదాయకాలు. అందరికీ పేరుపేరునా...

నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

సదా మీ

సుధామ

# విలక్షణ పఠనానుభవం 'కవికాలమ్'

సామాజికావసరాలతోపాటు సాహిత్య అవసరాలు మారుతుంటాయి. అందుకు తగ్గట్టుగా సృజన విస్తరిస్తుంది. సంఘటనాత్మక కవిత్వం విరివిగా రావడానికి గల నేపథ్యం మన సమాజ పరిణామ క్రమంలోనే వుంది. మరీ ముఖ్యంగా గత ఇరవయ్యేళ్ళ తెలుగు సాహిత్య ప్రయాణాన్ని గమనిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. ఆయా సంఘటనలకు వెనువెంటనే స్పందిస్తూ కవిత్వం రాస్తున్న తీరు కొన్నాళ్ళుగా చూస్తూనే వున్నాం. కథకులు సైతం ఆయా సంఘటనల నేపథ్యంలో కథలు రాస్తున్నారు.

ఒక సంఘటనని కేంద్రంగా చేసుకొని కథారచన సాగుతుంది. ఇదే పద్ధతి కవిత్వంలో మరింత విరాట్‌రూపంలో ఆవిష్కృతమవుతుంది. ఇతరేతర ప్రక్రియలు ఎంతగా విస్తరించినా కవిత్వం కొత్తరూపు తొడుగుతోంది. ఎప్పటికప్పుడు సమాజ పరిణామాలపై కవితాత్మకమైన వ్యాఖ్యానాలు చేస్తున్నారు కవులు. ఇతర భాషల సంగతి ఎలా వున్నా తెలుగులో ఇప్పటికీ కవిత్వప్రక్రియదే పైచేయి. తమిళం, కన్నడం, మలయాళంలో వచనరచనలు విస్తరించినప్పటికీ తెలుగులో అది జరగలేదు. అంతేగాక తెలుగునేల మీద ఈనాటికీ కవితాత్మకమైన స్పందనలకే సాహిత్య గౌరవం ఎక్కువ. బహుశా ఈ కారణంగానే సామాజిక పరిణామాల మీద, కల్లోలాల మీద కవిత్వం ఎక్కువగా వస్తోంది. ఈ పూర్వరంగంలోంచి చూసినప్పుడు 'కవికాలమ్' పేరుతో సుధామ కవితాత్మకమైన రీతిలో కాలమ్ నడిపించడంలోని ప్రత్యేకత, విశిష్టత అర్థమవుతాయి.

అనుభవంలోనూ, సాహిత్య వ్యాసంగంలోనూ పెద్దవారయిన సుధామ మంచి స్నేహశీలి, ఆత్మీయులు. ఆ స్నేహవాత్సల్యంతోనే ఈ పుస్తకాన్ని చదివి నాలుగు మాటలు రాయమని అడిగారు కానీ సాహిత్యలోకానికి సుపరిచితులయిన సుధామ గారి పుస్తకానికి ప్రత్యేకమైన పీఠిక అక్కర్లేదు. కవికాలమ్ కింద వచ్చిన ఈ కవితాత్మక స్పందనలని చదువుతున్న క్రమాన నాలో కలిగిన ఆలోచనల్ని చెప్పడానికి మాత్రమే ఈ అవకాశాన్ని వినియోగించుకోదలిచాను.

దినపత్రికల ఎడిటోరియల్ పేజీల్లో రెగ్యులర్ కాలమ్స్ వుంటాయి. సమకాలీన సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవహారాలపై ఆ కాలమ్స్‌ని నిర్వహించడం ఆనవాయితీ.

కాలమిస్టులు సామాజిక సంఘటనలపై విశ్లేషణలు, వ్యాఖ్యానాలు చేయడం ఓ సంప్రదాయం. అయితే ఇదే పనిని సుధామ కవితాత్మకంగా చేయడం ఈ 'కవికాలమ్' ప్రత్యేకత.

స్వతహాగా కవి అయిన సుధామ అధ్యయన విస్తృతి కలిగిన సృజనశీలి. రేడియోలో మూడు దశాబ్దాల పాటు పనిచేసిన వారు, సమకాలీన ప్రపంచంలోని సకల పోకడల్ని ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు, అధ్యయనం చేస్తున్నారు. దాదాపు దశాబ్దకాలంగా 'సం.సా.రాలు' (సంస్కృతి–సాహిత్యం–రాజకీయాలు) కాలమ్ నిర్వహిస్తున్నారు. ఈవిధంగా కాలమిస్టుగా అనుభవమున్న రచయిత సుధామ. సమకాలీన సమాజంలోని సంఘటనలపై వారు రెండున్నర సంవత్సరాల పాటు 'కవికాలమ్' నిర్వహించడం ఓ విశేషం. ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రతి గురువారం వచ్చిన ఈ కాలమ్ సుధామ కవిత్వ అభివ్యక్తినీ, నిర్మాణవైచిత్రినీ తెలియజేస్తుంది.

అసలు ఇలాంటి కాలమ్ నిర్వహించాల్సిందిగా కోరడం ఆంధ్రప్రభ సంపాదకులు విజయ్‌బాబు గారికి కవిత్వం పట్ల వున్న గౌరవాన్ని సూచిస్తోంది. ఈ కాలమ్ వస్తున్న రోజుల్లో అప్పుడప్పుడు చదువుతూ వచ్చాను. వాటన్నిటిని ఒకచోట చేర్చినప్పుడు చదవడం వైవిధ్యమైన అనుభవం. కాలమ్ నిర్వహణలో సుధామ ప్రతిభా వుంది, శ్రమా వుంది. స్వతహాగా కవిగా, పదరంగ ప్రహేళికల కూర్పరిగా వారికి తెలుగు భాష, పదజాలం పట్ల మంచి పట్టు వుంది. వాక్యాల, పదాల విరుపు ఎంత అర్థవంతంగా, సారవంతంగా వుండాలో వారికి తెలుసు. కవిత్వ సాంద్రతని ఇనుమడింపజేసే పదప్రయోగం చేయడం ఎలానో ఈ కవికాలమ్ ద్వారా నిరూపించారు. అసలు శీర్షికల్లోనే వారి చతురత, విన్యాసం గోచరిస్తాయి. ఉదాహరణకు ఈ శీర్షికలు చూడండి: ప్రమోద జనకులు, గ్యాసు ఫూల్స్ పేరడీ, స్వదేహీ మారక ద్రవం, 'అణు' గుణంగా..., ఆ'లయ'మేలా!?, భిక్షాందేహిభ(గ)వద్గీత, సమ్ డాగ్ కలియనీరు, జన ప్రాణ హరణ జలం, శ్రీమద్ 'మూరాయ'ణం. ఇలా చాలా శీర్షికల్లో వైవిధ్యం, పదగుంభన శైలి కనిపిస్తాయి. ఈవిధమైన శీర్షికలు చూడగానే వాటిని చదవాలనిపిస్తాయి. చదివించే గుణాన్ని శీర్షికల నుంచే సంతరించుకున్నారు ఈ కాలమిస్టు.

ఈ కాలమ్ నిర్వహించిన రెండున్నర ఏళ్ళలో జరిగిన అనేక ప్రధాన సంఘటనలని సుధామ రికార్డు చేశారు. పాలక ప్రతిపక్షాల రాజకీయాల్నించి మొదలుకొని, క్రీడలు, సాహిత్యం, సంస్కృతి, సినిమాలు, మానవహక్కులు, పర్యావరణం, ఆధ్యాత్మికం, శాస్త్ర సాంకేతిక పరిణామాలు, గ్లోబలైజేషన్ కల్లోలాలు, వ్యక్తిత్వవికాసం, అంతర్జాతీయ పరిణామాలు మొదలైన అంశాలెన్నో ఈ కాలమ్ పరిధిలోకి వచ్చి కవితారూపు దాల్చాయి.

"అమెరికా నేడు నల్లసూర్యుడుదయించిన తూర్పు" అంటూ అమెరికా అధ్యక్షునిగా ఒబామా గెలిచిన రోజును అభివర్ణించారు. నల్లజాతికి చెందిన ఒబామా అమెరికా అధ్యక్షునిగా విజయం సాధించడంలోని చరిత్రాత్మక సన్నివేశాన్ని 'తెల్ల చీకటి చీల్చే నల్ల సూరీడు' అంటూ కవితాత్మకమైన రీతిలో హృద్యంగా చెప్పారు. రాష్ట్రీయం, జాతీయమే కాక అంతర్జాతీయ అంశాలపై సుధామ ఏ దృక్పథంలోంచి, ఏ అవగాహనలోంచి వ్యాఖ్యానించారో ఈ 'కవికాలమ్' చెబుతుంది.

మార్క్సిజమే శిరోధార్యంగా చెప్పే వామపక్షాల ఏలుబడిలో పశ్చిమబెంగాల్‌లో జరిగిన నందిగ్రామ్ సంఘటన గురించి కూడా సుధామ స్పందించారు.

*"జరగరాని ఘోరాలు –*

*గుజరాత్‌లో జరిగినా,*

*నందిగ్రామ్‌లో జరిగినా*

***అమానుషత్వం అమానుషత్వమే!!"*** అంటూ నిర్ద్వంద్వంగా ప్రకటించడం సుధామ అవగాహన వైశాల్యానికి ప్రతీక. ఒకటి మతోన్మాద హింసయితే, మరొకటి గ్లోబలైజేషన్ క్రూరపీడన. బాధితులయినవారు రణగానం వినిపిస్తారని నవంబర్ 2007లోనే హెచ్చరించారు. రైతులపై హింస సాగించిన ప్రభుత్వం తప్పుదిద్దుకోకపోతే ఎదురయ్యే పరిణామాల్ని ముందుగానే ఊహించి చెప్పారు. వారు చెప్పినట్టుగానే పశ్చిమ బెంగాల్‌లో సిపిఎం పరాజయం పాలయింది. ఇదే కవి తెలుగునాట సిపిఐ, సిపిఎంల ఎన్నికల పరాజయాల్ని ప్రస్తావిస్తూ "ప్రజల పక్షాన నిలిచే/ వామపక్షాలన్నమాట/ ప్రజలకింత దూరమెందుకవుతున్నట్టు" అని ఆర్తి చెందారు. ఇప్పటికీ సమాధానం చెప్పాల్సిన ప్రశ్న ఇది.

తెలంగాణపై విభిన్నపక్షాల రాజకీయక్రీడల్ని కూడా ఉపేక్షించలేదు సుధామ. మాటలకీ, చేతలకీ మధ్యన అంతరాల్ని ప్రశ్నించారు. నైజాం నవాబును సమర్థించడం లోని తార్కికత ఏమిటని నిలదీశారు. మానవహక్కులకు పాలకులు పెడుతున్న చిచ్చును నిరసించారు. జాతీయక్రీడగా హాకీకి ఉన్న ఒకనాటి వైభవాన్ని చెబుతూ పురావైభవం సంతరించుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ఇలా అనేకానేక అంశాల ప్రస్తావనతో కొనసాగింది ఈ కవికాలమ్. వర్తమాన చరిత్రను కవితాత్మకంగా రికార్డు చేసింది.

మామూలు మాటల్లో, పత్రికా పరిభాషలో వ్యాఖ్యానించడం వేరు. కవితాత్మకంగా స్పందించడం అందుకు భిన్నం. ఇది సుధామకు వైవిధ్యమైన రచనానుభవం. పాఠకునికి విలక్షణమైన పఠనానుభవం.

ఈ కాలమ్ నిర్వహణ అంత సులువు కాదు. ఒక సంఘటనను, సందర్భాన్ని ఎంచుకోవడం ఒక కీలకమైనపని. దానిపై తన స్పందనను కవితాత్మకంగా వ్యక్తం చేయడం కాలమిస్టు సృజనకు పరీక్ష. కాలమిస్టు కవి కాకపోయినట్టయితే ఈ కాలమ్ రాణించి వుండకపోయేది. స్వతహాగా కవి కావడం వలన, నిరంతరం కవిత్వాన్ని అధ్యయనం చేస్తూ, రాస్తూ వుండడం వల్ల సుధామకు ఈ కాలమ్ నిర్వహణ సాధ్యమైంది. తన లక్ష్యాన్ని సాధించడంలో కవిగా, కాలమిస్టుగా సుధామ సఫలీకృతులయ్యారు.

స్పందించే నైజం ఒక్కటే సరిపోదు. తన స్పందనను కవిత్వంగా వ్యక్తం చేయడానికి ఒక నిర్మాణ పద్ధతిని అనుసరించాలి. అందులోకి తన స్పందనని ఒదిగేలా వ్యక్తం చేయాలి. ఇది సుసాధ్యం కావడానికి సుధామ చాలా శ్రమించారు. ఎత్తుగడలోనే తన సృజనాత్మకరీతిని చూపించారు. కవిత నడకలో అన్వయానికి, సమన్వయానికి లోటు రాకుండా నేర్పు వహించారు. వాలంటైన్స్ డే సందర్భంగా రాసిన కాలమ్‌లో రాసిన కవితాత్మక స్పందనలు సుమధురమైనవి:

***వలపు మొగ్గ***
***విశ్వాసం పువ్వు***
***పరిణయం కాయ***
***దాంపత్యం ఫలం***
***అదీ భారతీయ వంశవృక్షం***

అంటూ ప్రేమలోని సాంద్రతను, భారతీయ సామాజిక జీవనవిధానంలోని ఉదాత్తతను చాటారు.

చిన్నచిన్న వాక్యాల్లో అనంతమైన భావసముదాయాన్ని వ్యక్తం చేయడానికి ప్రయత్నించారు. పాఠకుడికి సుబోధకమయ్యే ఇమేజరీల్ని, పదచిత్రాల్ని వాడారు. అస్పష్టత లేదు. అన్వయక్లిష్టత కనిపించదు. కవిత్వనడకలో సారళ్యాన్ని సాధించారు. ఈ కారణంగానే అనాయాసంగా ఈ కవిత్వంలోకి పాఠకులు ప్రయాణించగలిగారు.

కవిత్వమంటే అది కొందరికి మాత్రమే అర్థమయ్యే ప్రక్రియ అని చాలామంది భావిస్తుంటారు. కానీ కవిత్వంలోని సొగసునీ, సున్నితత్వాన్నీ, సరళమైన రీతినీ కొత్త పాఠకుల అనుభవంలోకి తెచ్చిందీ కాలమ్. కవిత్వమంటే జంకు చెందేలా కాకుండా దగ్గరయ్యేలా చేసింది. అందువల్లనే సుధామ రాసిన ఈ 'కవికాలమ్' పుస్తకరూపంలో రావడం సముచితమైనదిగా తోచింది. వర్తమాన సామాజిక సందర్భాల్ని కవితాత్మకంగా రికార్డు చేసిన ఈ ప్రయత్నం అభినందనీయం.

**– గుడిపాటి**

# కవితా క్రమం


1. "ఇంతుల దన్నులుండ తెరువెయ్యది..." ................ 13
2. జర భద్రం కొడుకో...! .................................. 16
3. రణ నినదం... నందిగ్రామ్...! .......................... 19
4. పోరు బాటే పోవుబాట... ................................ 22
5. వైద్యానికి నైవేద్యం ........................................ 25
6. బాధలేని సౌఖ్యంవద్దు .................................... 28
7. జీవిత ఘటనం .............................................. 31
8. ప్రేమే జీవన శ్వాస .......................................... 34
9. రైలు ప్రయాణం... ........................................... 37
10. హో! కీ... పోయిందే ........................................ 40
11. రంగుపడుద్ది ................................................. 43
12. ప్రశ్నా(స)మయం .............................................. 46
13. రానీ సర్వధారి ................................................ 49
14. ఎంతో అక్కర్లేదు ............................................ 52
15. కాకి ఎంగిళ్లు ................................................... 55
16. గ్యాసు ఫూల్స్ పేరడీ ........................................ 58
17. పరుగు ........................................................ 61
18. శాంతి శ్వాస .................................................. 64
19. ఓ పువ్వు పూసింది!? ....................................... 67
20. ఆయుధం ..................................................... 70
21. స్వదేహీ మారకద్రవం ......................................... 73
22. శుభాకాంక్షల రెండు పాతికలు ............................ 76
23. ఓటరాయ నమః ................................................ 79
24. 'అణు'గుణంగా... .............................................. 82
25. స్వర జ్యోత్స్న .................................................. 85

26. బిగ్ బ్యాంగ్ ............................................. 88

27 అక్షరం – హృదయానికి 'బదులు' ....................... 91

28. ఆ'లయ'మేలా!? ......................................... 94

29. విజయదశ(మీ!?) ....................................... 97

30. చంద్ర యా(త)నం!?.................................... 100

31. గెలుపు మలుపులో... ................................. 103

32. భిక్షాం దేహి భ(గ)వద్గీత ............................... 106

33. హ్యాపీ న్యూ ఇయర్! ..................................... 109

34. తెల్లచీకటి చీల్చే నల్లసూరీడు .......................... 112

35. సమ్ డాగ్ కలియనీరు ................................. 115

36. పాప నవ్వుకు ఆస్కారం ................................. 118

37. మాకు కాస్త నమ్మకమివ్వండి .......................... 121

38. జన ప్రాణ హరణ జలం................................ 124

39. చెయ్యి ముడిస్తే పిడికిలి ................................ 127

40. అంతా'గుర్తే'నా........................................... 130

41. శతజయంతి శంపాలత................................ 133

42. ఈ చర్చల 'ప్రతిధ్వనులు' ఏ ఘంటారావాలో?! ...... 136

43. కాలం చేస్తున్న కవి(త్వం)............................. 139

44. దవ్వులు దువ్వే నువ్వు .................................. 142

45. 'వరద' హస్తం కావాలి .................................. 145

46. శ్రీమద్ 'మారాయ'ణం ................................. 148

47. ప్రమోద జనకులు ...................................... 151

48. ఈ చరిత్ర ఏ సిరాతో...?.............................. 154

49. హక్కుల 'దినం'......................................... 156

50. పదికాలాలు పదిలంగా ఉండాలి ...................... 158

# "ఇంతుల దన్నులుండ తెరువెయ్యది..."

ప్రతి నేత వెనుకా విజయాలకు
ఓ వనిత మాటేమోగానీ–
ఆ పార్టీ అధినేత ఊత– ఓ ఉవిద
ఊదరగొట్టే సొద.
మహిళా విభాగ సారథ్యం పేర–
అదరగొట్టే వార్తల కథ.

తన నాయకుడిని తిట్టినందుకు
ఓ నన్నపనేని నాలుక కోస్తానని
మందపాటి రసనాస్వనం–
గంగాభవాని.
చంద్రబాబు వెన్నెలకు వంకలెన్నే
మాటల తడుపుకు,
రాజకుమారి
నిరసనా సరసన వీరంగం.
సందట్లో సడేమియాగా
అఖిలపక్ష మద్యనిషేధ సమావేశంలో
"రాత్రి బారు– ఉదయం దర్బారు'
అంటూ తెరాసనేతపై
ఆ గులాబిరంగు పేరింటి
సారక్క రోజా–
అపశ్రుతుల రంగుపడుద్ది తరంగం.

రాజశేఖరుని
రాజకుమారి నిరసించడం,
చంద్రబాబుని జటాజూట సహచరి
గంగాభవాని మాటపోటెత్తించడం–
గులాబీ నేతను రోజాయే
నిందించడం

నామవైచిత్రిని మించిన
కాలవైచిత్రి.
రాజకీయ రంగస్థల శైలూషికా
పాత్రవైచిత్రి.
మూడుకొప్పులు ఒకచోట కలిస్తే
తిప్పలు తప్పవని పాతమాట!



కలవకుండా, కలివిడి లేకుండా
వైయక్తిక వీరావేశాల నారిసారించిన
నారీమణుల
భారీ హోరాహోరీ.
తిట్టిందే తిట్టిందే తిట్టిందే తిట్టడం
చెప్పిందే చెప్పిందే చెప్పిందే చెప్పడం

కెమెరాముందు
హావభావాల అభినేత్రి.
తాటిపట్ట నాలుకల అధిగాత్రి.
జోరీగ మీడియా శ్రవణ ఝుంకారం,
దృశ్యహుంకారం కాంచలేక-
ఛానళ్లకు కళ్ళిచ్చిన ప్రేక్షకుల
అక్షయ అసహనం.
కొప్పుల కొట్లాట కలికి చిలుకలకు
కాలక్షేప కమనీయ విక్షేపం.

ఆడవాళ్లు అందంగా ఉంటారు
'మీరూ మేమూ
ఈ ప్రపంచానికి అందం'
అంటారు రాజకీయ స్వామీజీలు.

నేతలకు అండగా వుండే ఆడవాళ్లు
మరీ అందంగా,
మధురస నిష్యందంగా వుంటారు.
తమకోసం జుట్టూ జుట్టూ
పట్టుకుంటున్నప్పుడు,
తమ తలల, తలపోతల
గోడులు మరిచి,
ఆ పూబోదులను మౌనంగా
లాలించడం,
ముసిముసిగా ఉసిగొల్పడం,
మగ'ధీర' త్వమేనా!

'మీవాళ్లను అదుపులో పెట్టుకో'మని
అధినేతలెవరూ
పార్టీలోనూ, ఏ టీపార్టీలోనూ
పరస్పరం అననూలేదు,
అనుకోనులేదు చూసారా?
లోలోన సంతసిస్తూనే
లోపాయికారిగా
'అన్నదాంట్లో తప్పేముంది' అనో,
'అంటే అన్నది లెద్దురూ' అనో,
'అంతలా అనకపోవలసిందేలే' అనో,
టేకిట్ ఈజీ పాలసీతో
తలాయించడం తప్ప
వారించిన వాక్సూరుడేడీ?

'నీ లేత గులాబీ పెదవులతో
కమ్మని తిట్లే రావాలీ
అవి ప్రత్యర్థి పార్టీ నేతలకే
బూతుల బుంగై పోవాలీ'
అన్నదే అంతరంగ ధ్వానం- గానం

కాంతా సమ్మితంగా తిట్టించడం
ప్రత్యర్థిని దెబ్బతీసే
ఎత్తుగడల కొలమానం.
పిట్టపోరూ పిట్టపోరూ పిల్లితీరిస్తే
పిల్లలొల్లీ, పిల్లలొల్లీ
ఎల్లరూ చూసాక-
ఎన్నికల వేళే తేటతెల్లమై తేలాలి మరి!

ఆకాశంలో, అధికారంలో
సగం మాటేమోగానీ-
మహిళా విభాగాల పక్షాన
అరచీ అరచీ,
కళ్లు వెలార్చీ, జబ్బలు చరచీ,
సొలసీ సొలసీ, పాపం
చిక్కి సగమౌతారేమో!

చక్కనమ్మలు చిక్కినా అందమేగానీ–
ఇలా ఛానెళ్ల కెమెరాకన్నులకు 'చిక్కితే'
ప్రేక్షక జన సమూహానికి
పరిహాస బంధం!

ముప్ఫైమూడు శాతం
రిజర్వేషన్ల మాటేమోగానీ–
రిజర్వ్‌డ్‌గా వుండక
యాగీ చేసుకుంటే,
పార్టీ అధినేత సానుభూతి శాతం
పెరుగుతుందో, తరుగుతుందో
రేపెప్పుడో గొప్ప పదవో గిదవో
దక్కుతుందో లేదోగానీ–
రాజకీయ దక్షతా రమణులు మాత్రం
కాలేరు నిజం.

కీర్తిశేషులు ఖాళీచేసిన సీట్లలో
సహగమన సతులుగా కాక–
మహిళలు సాధికారతతో
రాజకీయాధికారంలోకి రావాలంటే
ఈ సిగపట్ల గోత్రాల
మీడియా చిత్రాలు
సహకరిస్తే ధన్యోస్మియే!
ఏమైన ప్రజల దృష్టిలో
పార్టీల ప్రతిష్ఠకు
ఇంతుల దన్నులుండ
తెరువయ్యేది...
ఓ మహాత్మా! ఓ మహర్షీ!

***

***(1 నవంబర్ 2007)***

# జర భద్రం కొడుకో...!

నూతన జవసత్వాలు
ఆశిస్తున్నప్పుడు
గతానుగతికాలు కుదరవు



శిథిలదేహాన్ని
ఏవో మందుల రక్షణ
వలయంలో ఉంచి–
మనుగడ పటిష్టపరుస్తున్నట్లు.
కొనసాగింపు చర్యలో
కాలానుగుణ వైద్యం తప్పదు.

అన్నీ నీకు నచ్చవు
మార్పుకు వెరుస్తున్నావని కాదుగానీ–
నీ విలువల వలువలు
నిలువునా జారి,
నగ్నీకరమౌతున్న ఆర్తి నీది.
ఉనికిలోని గుట్టు, దాని పట్టు,
చేజారుతున్నట్టు–
చలించి చెమ్మగిల్లే హృదయ నేత్రం.

'నాకు భద్రతలేదు'
అదీ ఒక వేదన!
ఆ'వేదన'ను రెట్టింపు చేస్తూ
అవతలి వారెవరో–
బుల్లెట్‌ప్రూఫ్‌గా వాహన యోగులై
అంగరక్షక దళాలతో
ఆరోగ్యంగా బ్రతికేస్తున్నారనీ,
అవకాశాలు నాకు అవి లేవనీ,
మరీ మరీ అంతరంగ ఘోష!

ఎవరికిఎవరు కాపలా?
ఎవరికి ఉంది భద్రత?
పైకి సజావు మజాలే
లోన ఎగిరే అనుక్షణ మృత్యుధ్వజాలే
మందుపాతరే పేలనక్కరలేదు
పాత మందు ఏదో స్వయంగా
దేహగతమయినా–
సందేహం విస్ఫోటించి
కాలధర్మం నిర్ధారణ కావచ్చు.

ఒంటిస్తంభం మేడలో
దుర్గమ భద్రత ఏర్పరుచుకుని
శ్రీ శుక పుణ్యగాథాశ్రవణం చేస్తున్నా
పండులోంచి వచ్చి చావు
పామైకరిచిన పరీక్షిత్తులా–
భారతంలో ఈ నాడూ
జీవితంలో
సామాన్య పౌరుడి నుంచి
దేశ ప్రధానివరకూ
భద్రత గురించి ఎవరిది పూచీ?
ఎక్కడ హామీ?
కర్తవ్యం
నిర్వహింపబడుతూనే
ఉంటుంది
తన పని తాను చేసుకుపోయే
చట్టంలాగానే–
ఎవరి మృత్యువైనా ఎప్పుడైనాను!

హత్యా రాజకీయాలు చేసేవారైనా
మృత్యుపాశం విసిరే
యమరాజకీయం గ్రహించగలరా?
బస్సో, రైలో, విమానమో
గాలో, నీరో, పిడుగో
మందుపాతరో, చిన్నమాత్రో
గుండెపోటో, విందు ఘాటో
ఎవరికయినా, ఏదయినా, ఎప్పుడైనా
ఎదురై ఎగరేసుకుపోవచ్చు ప్రాణాన్ని

ఎవరికుంది భద్రత?
నిన్ను రక్షించే అంగరక్షకుడి
ప్రాణాలకున్న ముప్పుకి
నువ్వెలాగూ కాలేవు
మరింకెవరు చెప్పు కాపలా!

అవును!
సర్దుకునే పోవాలి.
సాధించుకున్న వేవయినా
శాశ్వతాలు కావు.
గొప్ప గొప్ప పదవుల పరిచితి
ఆపై విరమణలతో చ్యుతి
మరణంతో చితి
అంతే! ఆరిపోవు బతుకు ద్యుతి

దేహాన్ని, దేశాన్ని పటిష్ట పరిచేందుకే
సందేహాలన్నీ వదులు
చివరి రక్తపు బొట్టువరకూ
ప్రజాసేవకే అంకితం అనేవాళ్లు
అంగరక్షకులకై
అంగలార్చడం ఎందుకు?
పౌరులకు భద్రత కల్పించలేని
నాయకుడు ప్రజాప్రతినిధిగా
ఆ ప్రజల్లోంచే ఏదో ముప్పువుందని
ప్రాణరక్షణ కోరడమా?–
నువ్వు తమ నేతవనీ,
తమ సుఖసంతోష ప్రదాతవనీ
విశ్వసిస్తే–
ప్రజలే రక్షించుకుంటారు.
పరస్పరం ప్రాణాలొడ్డి త్యాగధనులు
సువ్యవస్థ నిర్మించుకుంటారు

గతానుగతికాలు కుదరవు.
తరం మారుతుంది
నీకు అంతరం,
అభ్యంతరం తోస్తుంది!
పనిచేసి పనిచేసి అలసినప్పుడు
కొంచెం మందు పుచ్చుకుంటే
తప్పేంకాదని–
ఎలాగూ అలవాటయిన గుట్టుని
బహిరంగంగా అంగీకరిస్తాడు.
ఖద్దరు గొప్పదే కానీ
విలువలు మారిన పార్టీలో
ఆ వలువల నెలవులు తప్పిన
తప్పేమిటని అడుగుతాడు.

అర్ధరాత్రి ఇల్లు వదిలిపోయే
సిద్ధార్థుల కాలం కాదిది
నవసమాజ కుతూహలుడు
రాహులుడు
రాజ్యాధినేతకావాలని పార్టీ తీర్థాల
రథసారథుల మనోరథం
నేటి కాలం!

తండ్రికి భద్రత లేకనే
తండ్రి తల్లికి భద్రత లేకనే
దేశాధిపత్యం వహించినా
దేహాలు తుత్తునియలై
అమరత్వాన్ని ఆపాదించాయి.

దేశభద్రత రేపు
రాహులుడి హస్తగతం చేయడానికి–
ఏ విలువలకై వెతకాలో,
పార్టీ భవితవ్యం
ఆ యువరక్తాన ఎలా
ప్రవహించి బ్రతకాలో,
ప్రజలే నిర్ణయిస్తారు!
పరిణామాలనూ ప్రజలే భరిస్తారు!

దేహాలనైనా,
దేశాలనయినా
ప్రజాస్వామ్య పౌరులే ఉద్ధరిస్తారు.

***

**(15 నవంబర్ 2007)**

# రణ నినదం... నందిగ్రామ్...!

బుద్ధదేవుడూ హింసావాదియేనా?
హంసరెక్కల గాయాన్ని మాన్పి
శాంతిగీతాంజలి
అర్పించే నికేతనంలో
రక్తచారికల రణభేరియా?
మూడు దశాబ్దాల
అప్రతిహత పాలన
నరమేధానికి యోగ్యతాపత్రం
కాజాలదు కదా!
నవబెంగాల్ నిర్మాతా,
నరేంద్రమోడీ
తేడాలేనిదేనా ఘటనల గారడీ?
కార్పొరేట్ పార్టీ ఆఫ్ ఇండియా
మర్డరర్స్
అనేదాకా ఎందుకీ ఎదుగుదల!
బీభత్స పారిశ్రామికీకరణం
బెంగాల్ బెంగటిల్లడానికీ,
ప్రాణభీతి పరిధవిల్లడానికీ కాక
ఇంకెందుకు మరి?

గ్రామీణ భారతాన్ని
అభివృద్ధి పేరిట అల్లకల్లోలపరిచే
వివేకరాహిత్య వ్యూహాలు
ఎవరు పన్నినవయితేనేం
పావురాయిని రాయి విసిరి
గాయపరుస్తున్న
పాలక ప్రభువు ఎవరైతేనేం?
మతం పేరునేకాదు
అభిమతం పేరున జరిగినా
నరమేధం నరమేధమే!!
మౌనం వహించి కేంద్రం కూడా
ధ్యానముద్రలో వుంటుంది
సిద్ధార్థుడు బుద్ధుడికి
తనంతట తానుగా
జ్ఞానోదయం కావాల్సిందేనా!



నంద్రిగామ్!–ప్రత్యేక ఆర్థిక మండలి
ప్రతిష్ఠాపనకు
పదివేల ఎకరాల స్వాధీనమా

ఆరుగాలం శ్రమించి
ముక్కారు పంటలు పండించే
రైతుల జీవనాధార భూమిని
స్వాధీనపరచుకునేందుకు
సాగించిన హింసాకాండ
ఎవరిదైతేనేం–
ఎలా సమర్థనీయం?

తనదాకా వస్తే తీర్పు వేరా?
భూమికోసం, భుక్తికోసం
పోరాటం ఎక్కడైనా
సామాన్యుడి ఆరాటం ఒక్కటేగా!
ప్రజాస్వామ్యయుతం కాని
పద్ధతులు ఎవరివైనా, ఎక్కడైనా–
నిరసన గళాలు
నినదించే తీరుతాయి.

అమాయక ప్రజను రెచ్చగొట్టేది
ప్రత్యర్థి రాజకీయ పక్షమే
అనుకున్నంత మాత్రాన సరిపోదు.
జరగరాని ఘోరాలు–
గుజరాత్‌లో జరిగినా,
నందిగ్రామ్‌లో జరిగినా
అమానుషత్వం అమానుషత్వమే!!

ఆయుధం–
శిష్ట రక్షణకా దుష్టశిక్షణకా?
చెట్టు చాటు వాలి సంహారానికా?
గుట్టు దాచు తీరుతీరుల
తెంపరితనానికా?

హింసకు ప్రతిహింస సహజం.
చర్యకు ప్రతిచర్య నైజం
తప్పిదం దైవఘటనం అయినా
ఒప్పిదం కాజాలదు!

నిజమే–
తుపాకులున్న ప్రభుత్వాలు
కృపాకీలలు వెలిగిస్తాయన్న
విశ్వాసం కలగడంలేదు
తిరుగులేని కమ్యూనిస్టు ప్రభుత–
ఆగ్రహావలంబన మవనేల
ప్రజామనోభావాలకు
తిలోదకాలివ్వడం
ఏనాటికీ కాలేదు ఘనత!

సిఆర్‌పిఎఫ్ శిబిరాలు,
సిపిఎం కార్యకర్తల అత్యాచారాలు,
దోపిడీలు, గృహదహనాలు,
భయం గుప్పిట్లో నందిగ్రాం.
ఋజువుల మార్గం
రాజకీయ రుజాగ్రస్తమైతే
స్థంభించిన పార్లమెంటయినా
సత్యాన్వేషణం సాధించలేదు.

'బ్రూటస్ యూటూ'నా
అని ప్రశ్నించినట్లు–
విశ్వసించిన బుద్ధదేవుడూ
పంద్లతోటలో తుపాకీలు నాటుతూ
రైతు హింసకు రైట్ ఫ్రంట్‌కు మరలితే

కలాలూ– హలాలతోబాటుగా
కదనుతొక్కక తప్పదు!
జనగణమనం
రణగానం తప్పదు!

ప్రపంచీకరణం, సామ్రాజ్యవాదం
ఆర్థికాభివృద్ధి ఆహ్వానాల పేరిట
అసమాన వంగతోటనూ
తూటాలతో తుంగలోకి తొక్కేస్తూంటే

సిద్ధార్థుడి బోధివృక్షంపైనుంచీ
శాంతికపోతాలు కాదు
సమర కపోతాలే ఎగురుతాయి!
శాంతికీ శాంతికీ మధ్య
విరామ చిహ్నామై
రణపల్లవమే చిగురుస్తుంది!

***

*(22 నవంబర్ 2007)*

# పోరు బాటే పోవుబాట...

దొరా!
వాటే యాన్ ఐడియా దొరా!
నిజమే! జీవితాన్నే మార్చేసే, నీ
జీతగాళ్ల సంఖ్యలోనే మేమింకా
కాలుమీద కాలేసుకుని
ఘడియ ఘడియకూ–



ఆ గడీలనే గుర్తు చేసుకునే
వర్తమాన నివర్తి– తమది
దేశ ముఖాన్ని తగిలించుకున్న
నాయకమ్మన్యవెల
మా! దొరలు కదా తమరు!

గత కాలపు కీర్తి వైభవాలు,
నవాబుకు నజరానాలిచ్చి
ఇష్టారాజ్య పెత్తనం చెలాయించిన
పరపీడన పరగణాధిపత్యం
తాజా గులాబిగా పరిమళిస్తున్న
మా లావు ఘ్రాణేంద్రియం కదా!

ముళ్లు మాకు గుచ్చుకున్నాయి.
రేకులు చిదిమి అత్తరులద్దుకున్న
ఆనంద క్షణాలు–
వాసనా రూపంగా మిమ్ములను
వెన్నంటే వున్నాయి కాబోలు!
నేడు
నాటి 'నిజాం' నచ్చినవారికి–
రేపు
'నేటి నిజం' మాత్రం బావుండదని
ఏమిటి నమ్మకం?
సమైక్యాంధ్రంలోనే సజావుగా
జీవించామని
ప్రగతి సాధించామని
రేపు భవిష్యత్తులో
నిజాం ప్రశంసావైభవ నీవారసత్వం
అంది పుచ్చుకునే మంది వుండరని
కాలం తమర్ని చూసాక–
ఎవరిని మాత్రం నమ్మమంటుంది?
ఎలా నమ్మమంటుంది?

అస్థిత్వ పోరాటం వేళ,
ఆత్మగౌరవ ఆరాటం వేళ,

భాషాయోషను చెరపట్టి ఆనాడు
ఉస్ ఉర్దూ మానియానే
విశ్వవిద్యాలయంగా
తలంటిన వాడిని,
మన కొంపలను కూల్చి,
మన స్త్రీల చెరబట్టి
ఖాసింరజ్వీలను రజాకారులను
గ్రామాలలో కదంత్రొక్కించినవాడిని,
పాకిస్థాన్‌వలె ఉస్మానిస్థాన్
ఏర్పడాలని–
సైనిక చర్య జరగకుండా
సర్దార్ పటేల్‌నే
బెదిరించ చూసినవాడిని,
కీర్తిగానాలతో కైవారాలు చేయడం
స్వాతంత్ర్య స్ఫూర్తికే విఘాతం!
నిజాం తాబేదార్ల
పెత్తందారీ సంస్కృతికి
పునరుజ్జీవనం!

తరతరాల బూజు
ఇవాళ పీచు మిఠాయిగా
కనిపిస్తోందా?
కోటి రతనాల వీణను
శృతితప్పిన వాద్యం చేసినవాడే–
రసిక రాజుగా
రమ్య చరితుడౌతున్నాడా?
మతం మార్పిడీల
తబ్లిక్ ఉద్యమ ప్రేరక్ నేర్పరికి–
సెక్యులర్‌గా సలామాలేకుంలా?
వెట్టిచాకిరీ వెతల వేల్పుకు
వందిమాగధ స్తోత్ర నీరాజనాలా!
ఎక్కడికి పోతున్నాం మనం?
ఉత్తుంగ కాశ్మీరానికా?
అగాధ అనాధ నాటి
తెలంగాణానికా?

నాజీల మించిన నైజాం సర్కారోడికి
సమాధి కట్టేందుకు నాడుద్యమించిన
వీరవరుల, ధీర చరితుల
త్యాగమూర్తుల ఆత్మఘోషకు
ఇపుడు ఈ హేతువెవరో,
వర్తమానం తీతువెవరో
తెలంగాణా ప్రజకు తెలియద!
కార్యఘాతుల కసిరి కసిరి
ఉసురుపోసుకు
ఊరేగ నీక
విసిరివేయక ఊరుకుందుర?
తప్పిదాలవి జరగవచ్చు
ఒప్పుకొనడం ముప్పుకాదు
పాతరోజుల భూతప్రేతం
తిరిగి బ్రతికీ తిరగరాదు.
ఎంత చక్కని దైనగాని
గతము మరిచేమరుపు, స్వగతము
పాతరోజులు మేలను
నాస్టాలిజీ తగదు, వదులుము.

ప్రగతి నాడే జరిగివుంటే
పోరాట యోధులు పుట్టుకొస్తర
విమోచనం పరిపూర్ణమైతే
నేటికీ నైరాశ్యమెందుకు?

'బాంచెన్ కాల్మొక్త' అంటూ
వెట్టి బతుకుల నెట్టివేసి
గట్టిమానస దీప్తి వైభవ
ఆత్మగౌరవ గీతి పాడగ
ఆసన్న సమయమైన దిక్కున
తవ్వి తీయుట ఎలా గోరీ
పలుకులేలా నోరు జారీ
నిజాం కాలపు నిజములేమిటొ
దాచివేస్తే దాగబోవు
కోరి పిలువకు కొత్త చావు
కె.చంద్రశేఖరరావూ!

దొరల దౌష్ట్యం తొలగిపోయి
ప్రజయె ప్రభువుగ విరాజిల్లే
సామ్యవాద సంఘ పరివార మెరిగి
ప్రజాస్వామ్యం పదును ఎరిగి
రాష్ట్ర విభజన జరిగినా
భాష మాత్రం ఒక్కటేనని
తెలుగు వెలుగులు తేజరిల్లే
విశ్వమానవ జాతి మనదని
విచ్ఛిన్నమైనా విచ్చుకుంటూ
భిన్నమందున ఐక్యమౌతూ
పరిపూర్ణ సాధన ప్రాప్తమొందే
పరమ 'పథం' లక్ష్యమందే
పోరుబాటే, పోవుదారని
నినదించి ముందుకు సాగుదాం!
మనదు గమ్యం చేరుదాం!

***

***(6 డిసెంబర్ 2007)***

# వైద్యానికి నైవేద్యం

మానవ సంబంధాలన్నీ
ఆర్థిక సంబంధాలవుతున్నప్పుడు
అంతా అపనమ్మకమే.
దోపిడీ ఒక్కటే
దృగ్గోచరమవుతూంటుంది.

లబ్‌డబ్ లబ్‌డబ్
గుండె చప్పుళ్ళు–
లక్ష్మీదేవి ఘలంఘలలేనా!
మానవ దేహమూ
సాటి మనిషికి
ధనకోశ సదృశమేనా!
కనిపెట్టుకు ఉండవలసిన
వృత్తి ధర్మాన్ని విస్మరించి–
నర్సాంగనలతో
సరససల్లాపాలాడే
ప్రణయ ప్రాంగణాలు కావుకదా!

బాధ,
మూలుగు,
ప్రాణభీతి,
బంధుగణం ఆందోళన,
అన్నింటి నేపథ్యానా
చికిత్స–
మానవీయ విచికిత్సకు
ముందు నోచుకోవాలి మరి.

దేహ యంత్రం
దేనికో మొరాయించినప్పుడు–
ఊపిరికో, రక్త ప్రసరణకో,
నరానికో,
మలమూత్ర ద్వారాలకో,
మెదడుకో, గుండెకో,



అవరోధం సంప్రాప్తించినప్పుడు
పసిగట్టి, పనిపట్టి
తిరిగి సజావుగా పనిచేయించే
మెకానిక్కే కదా వైద్యుడు.

కానీ
దేహం అంటే కేవలం
యంత్రం కాదు.
దేహం ఓ దేవాలయం
ప్రతి దేహమూ దైవం కొలువున్న
గేహమే!
జీర్ణ దేవాలయాన్ని
సముద్ధరించే
మహోదారుడు వైద్యుడే.
ఆసుపత్రి–
ఔషధాలే ఆ–సు'పత్రి'!
అర్చనా స్థలమే అదిన్నూ.
ఆర్తిని బాపే
ఆర్తత్రాణ పరాయణుడు
నెలకొని వున్న తావు.
వైద్యోనారాయణో హరిః
దైవం ఉన్నాడో లేడో
తెలియకపోయినా–
ప్రాణం పోస్తున్న
బ్రతుకు నిలబెడుతున్న
వైద్యులు
ప్రత్యక్షంగా కనబడుతూంటారు
ఆపద ఎదురైనప్పుడు
సిరికించెప్పక
గజప్రాణావనోత్సాహియై
తరలి వచ్చిన శ్రీహరి
వైద్యులకు ఆదర్శం కావాలి కదా!

సంరంభియై కుయ్యాళిస్తున్న,
మృత్యు మకర దంష్ట్రలలో
దీనాలాపన చేస్తున్న,
తను పనిచేసే రంగంలోనూ,
తన కుటుంబంలోనూ,
ఏనుగంతటి మనిషే అయినా
ధైర్యము విలోలంబై
ప్రాణంబులు ఠావులు దప్పి
ఆశ్రయించినప్పుడు
ఆపన్న హస్తం
అందివ్వడమే ముఖ్యం.
సిరిని కూడా గణించక
పరుగు పరుగున ఆదుకునేందుకు
తరలి రావడమే ధర్మం.
దైవ ధర్మం–
మూర్తీభవించిందే వైద్య ధర్మం!

ఔను!
విశ్వాసం ముఖ్యం.
విశ్వాసమే దేవుడు.
వైద్యునికీ, రోగికీ మధ్య కూడా
విశ్వాసమే
సమస్యను పరిష్కరించేది.
నమ్మకం లేకుంటే మందైనా
పనిచేయదు.
కర్తవ్యం వైద్యుని వంతు
కాపాడుట దైవం వంతు
విశ్వాసం ప్రధాన తంతు.

ఎక్కడో
నిర్లక్ష్యం నీడలు వున్న మాత్రాన
అందరూ లయకారులు కాదు.
వైద్యులు అపర బ్రహ్మలు
స్థితికారులు
శివుని ఆజ్ఞలేనిదే
చీమయినా కుట్టనట్లు-
రోగుల మరణాలకు
వైద్యులు బాధ్యులనుకునేట్లయితే
విశ్వాసమే మరణించినట్లు
దైవోపహతులు కాదు
దైవమే హతమైనట్లు

జూ.డా లకైనా వైద్యం
ప్రాణాలతో ఆడుకునే జూదం కాదు.
కర్తవ్య విముఖులు
వృత్తిలో రాణించలేరు.
విశ్వాసం చూరగొనలేని వైద్యుడు
ధూపదీప నైవేద్యాలందుకోలేని
రాతిబండడు.

ఔను!
విశ్వాసమే ముఖ్యం
విశ్వాసమే దేవుడు
ఆశే విశ్వాసం
ఆశే బ్రతికిస్తుంది
విశ్వాసమే బ్రతికిస్తుంది
కర్తవ్య పాలనలో
గజేంద్రమోక్ష ఘట్టాన
శ్రీహరిలా వైద్యుడూ,
నీవే తప్ప ఇతఃపరం బెరుగ
అన్నంత విశ్వాసంతో జీవుడూ,
రోగి బంధువులూ, మిత్రులూ
అందరూ
పరస్పర విశ్వాసంతో
మెలిగినప్పుడే,
ఆరోగ్య శ్రియః కాంతులు
పరివ్యాప్తమవుతాయి.
మన్వంతరాలెన్నయినా
ధన్వంతరి
ఆయుఃప్రమాణాలు పెంచుతూ,
మనగలుగుతుంది.
వైద్య వృత్తి- దైవభక్తిలా
మనుగలుగుతుంది.
రోగగ్రస్థ వ్యవస్థ చక్కబడుతుంది.
వేదన తీరి
వైద్యం వేదంలా ప్రవహిస్తుంది.


***

***(20 డిసెంబర్ 2007)***

# బాధలేని సౌఖ్యంవద్దు

సరికొత్తదే!
కానీ ఇది ఒక సందిగ్ధ సమయం
అవ్యక్త చేతనలో
అడుగులు వేసినట్లు-
విచ్చుకున్న ఆశల హరివిల్లు వెనుక,
చిల్లుపడుతున్న మానవీయ
ఓజోన్ పొర
అరసెకన్లో
అంకె మారుతున్న అర్ధరాత్రి
మద్యం ఏరులై పారడమూ,

కాలాన్ని పరిగెత్తించలేం.
ఆధీనంలో ఉందనుకున్న
స్టీరింగ్ చక్రమే అదుపు తప్పి
యాక్సిడెంట్ పాలయినట్లు,
అనుకోకుండా జరిగే వాటిని
విధిబలీయానికి
విడిచిపెట్టక తప్పదు.
వినోదమో, విషాదమో-
కర్త, కర్మ, క్రియలలో



మగువ స్తన జఘన
విన్యాసమూ,
అదేనా ఆనందం అంటే?
అదేనా స్వాగతం అంటే?

రోడ్లమీద కేరింతలతో
వాహనాన్ని వేగంగా
పరుగెత్తించినట్లు-

ఏది నీది, ఏది కాలానిదో
ఎరుక పరచి ఎలాగూ చెప్పలేమేమో!
నిన్ను నువ్వు మరచిపోతున్నది
ఎందులోనో కూడా
మరచిపోయేటంత మత్తు-
నిజానికి నీ నైజానిదేనా!
రూపాయి అంచుల మీద
బెల్లీడ్యాన్స్ చేస్తున్నట్లుంది.

అక్కడ ఫుట్‌పాత్ పక్కన
నీ సాటి మనిషే–
కడుపులో సుళ్లు తిరుగుతున్న
ఆకలికి గింగిరాలు తిరగడం
నీ మత్తుకనుల దృశ్యంలో
మనసమసకగానైనా ఆ నదులే!
విలాసాల ఖర్చులో–
విత్తాన్ని వెదజల్లే వారికి,
దానంలోని ఆనందం
ఏనాటికయినా గోచరించేనా?

కనీస జీవితావసరాలు తీరే
కాసులు కాసింతయినా లేక,
కాయకష్టానికి
చెమటా, రక్తమూ తప్ప
ఖరీదు కట్టే షరాబు లేక,
గరీబులు గణాంకాలలోనూ
అధిగమిస్తున్నప్పుడు–
ఓ అర్ధరాత్రి ఆనందానికి
ఒక్క నగరంలోనే–
నూటయాభై కోట్లు ఖర్చంటే
ఏమని అర్థం చేసుకోవాలి?
ఎవరిని నిందించాలి?
ధనమా? దైవమా?
ఏవీ సమానత్వ సాధనకు
సహకరించనప్పుడు,
కాలం హేల కాదు–
మనిషే ప్రశ్నార్థకమవుతాడు.
సంఘజీవిగా
బాధ్యతారాహిత్యుడవుతున్న
స్వార్థపరుడే దోషి అవుతాడు.

నిజమే! ఏ చట్టానికీ,
ఏ సాంఘిక వ్యవస్థకూ,
ఏ కాలరీతికీ, జవాబుదారీ కాని–
అందెలమెక్కిన అవినీతి,
ఒక్కదగ్గరే పోగవుతున్న ధన రీతి,
పట్టణపు శిల్పారామాల
షో కేసుల్లోకి తరలివస్తున్న
సంక్రాంతి.
శాస్త్రసాంకేతికంగా ఎదిగి–
శ్రమను కాక సౌఖ్యాన్ని
పెంచుతున్న యంత్రాలు పెరిగి–
శరీరమూ, మనస్సు కూడా
ఆ మరలకే ఒదిగి–
ఆసాంతం ఆక్రమితమవుతున్నదీ
కృత్రిమత రీతి.

ఎవరు రక్షిస్తారు మనిషిని?
సైన్స్ కాంగ్రెస్‌లో
పరిసరాల కాలుష్యం గురించి
పత్రాలు సమర్పించుకుంటాం సరే,
కలుషితమైపోయిన
మనిషిని, మనస్సును శుద్ధిచేసే
సిద్ధాంత పత్రాలేవీ?
ఆచరణ సూత్రాలేవీ?

గాలి, నీరు, మట్టి, చెట్టు
అన్నీ అమ్మకం సరుకుగా
చేసుకుంటున్నది మనమే.
సహజ వనరులను అసహజ ఆర్థిక
సామగ్రి చేసి,
హృదయంతో ఇచ్చిపుచ్చుకునే వాటినీ

డబ్బు లంకెల సంకెలలతో
బంధిస్తున్నది మనమే.
బాధపడుతున్నదీ మనమే.
బాధే సౌఖ్యమనే భావనను
పెంచి పోషించి,
ఇతరుల బాధ మీద
అమానవీయంగా
సౌఖ్య సౌధాలు వెలయిస్తున్నదీ-
మనమే.

అలాగని పెద్ద బాధాలేదు.
అవును బాధ మనదైతే కదా!
అవతలివారి బాధ గురించి
ఆలోచిస్తే కదా!
నువ్వు షో టికెట్టు ఎంతపెట్టి కొన్నా
ఆమె ప్రదర్శనకి లక్షల పారితోషికం
ఆమెకు చెల్లించినా,
ఆమె ఐటమ్ గర్లే అయినా,
బాధ కూడా ఒక జీవితపు ఐటమే!
నీ సుఖం కోసం తననెత్తిన
బీరు పోసి,
నడుం నొక్కులో-
నీ ఆనందం
చిక్కుకుందని నీవనుకున్నా

ఆమె గుండెల్లో గూడుకట్టుకున్న
అవమాన భారం,
దుఃఖభారం,
సభ్య సంస్కృతి దృష్ట్యా-ఘోరం!
మానవీయతకు అపకారం.

వద్దు! దయలేని ధనం వద్దు.
కారుణ్యంలేని కామనలు వద్దు.
శ్రమలేని సంపదలొద్దు.
స్వచ్ఛతలేని పరిసరాలొద్దు.
మానవత్వంలేని మనిషే వద్దు.
గుండెలోతున స్పందించని
కవిత్వమే వద్దు.
బాధలేని సౌఖ్యమే వద్దు.

ఈ మధుపాన కేళీ విలాసాల,
అసభ్యనృత్యాల,
అసహజ కేరింతల,
స్వాగత సంస్కృతిని
ఇకనైనా చేద్దాం రద్దు.
మనిషి మనీషిగా
మనగలగడమే ముద్దు.
***

***(3 జనవరి 2008)***

# జీవిత ఘటనం

అంతా నిష్ఫాతులే
అందరూ అనుభవజ్ఞులే
ఇదమిత్థమని తేల్చక ఒకడు
ఇదేమిటని ప్రశ్నించి ఒకడు
రెచ్చగొట్టి ఉచ్చులు
పన్నాలని ఒకడు

హఠాత్తుగా ఓ ఆలింగనం
పరుగెత్తికొచ్చి పరామర్శ
రవ్వంత దొరికిన సందులోంచి
రాజకీయ జీవిత స్పర్శ

ఉసిగొలిపే వ్యూహాలు
అభిమాన దాహాలు
శత్రువుతోనూ స్నేహాలు
నడిపేది అధికార వ్యామోహాలు

కొత్తగా ఓ బ్లడ్ బ్యాంక్
రక్తాలు కారేట్లు కొట్టుకున్నా
సెలబ్రిటీ పేరిట ఎందుకండీ
రాజకీయ రక్తనిధీ వుంటుంది
దాశరథీ కరుణా(పయో)నిధీ
నీ ఉనికే ప్రశ్నార్థకం కదా
హతవిధీ!

మనిషి కనిపించడం లేదు
అమ్మకీ నాన్నకీ మటుకే కాదు
ఆచూకీ తీయాల్సిన వాడికే
కనిపించడంలేదు
సాంబశివా
ఏ శ్మశానంలో తిరుగుతున్నావయ్యా!

ఎలా మాయమైపోతాడసలు
ఎన్‌కౌంటర్ ఏమీ జరగలేదట
కస్టడీలో లేడట
తనదైన ఉద్యమం స్టడీలోనే లేడట



ఊపిరిలూదాల్సిన వాడు
ఊపిరితో ఉన్నట్టా లేనట్టా
కౌన్ జానారెడ్డీ
మానవ హక్కులూ తింటాయా గడ్డి

ఎవరి దారి దొడ్డ దారి?
ఎవరి దారి దొడ్డి దారి?

కలాపి కలాపజాలం
కలాంజాలంలో లోక్‌సత్తా ఏముంది?
చిరంజీవిత్వం కలాం కలంతో
కాలంలో
పురుడు పోసుకుంటుందా!
అవినీతిపై యుద్ధం
రాగోరు తాగూరూ
హక్కుల అమ్మకం
బిజినెస్ లావాదేవీల్లో
మెగా పాలయిందని-
తిరగదోడిన ఓ పాత దిగాలు.
అందరూ మనవాళ్లే.
అయినా దగాలు.
వెండితెర వేల్పుల్లోనూ
ఆధిపత్యపు పోరు.
సెలిబ్రిటీ, లెజెండ్‌ల మధ్య
చిరు భేదభావాల బెండు
మారిందిలే-
అభిమాన సంఘాల ట్రెండు!

పోస్టర్ పై పేడ ముద్ర
దిష్టిబొమ్మ దగ్ధ రౌద్ర
సినీ రాజకీయంలో పిడకల వేట
ఇప్పుడు నెట్‌లో తిట్టుకునే బాట.
సారీ సో సారీ
అంతా మంచివాళ్లే!
క్షమాగుణం ఆనవాళ్లే!

అనుచరగణం రెచ్చిపోయిందని-
ఖండన వాక్యమూ గిచ్చిపోతుంది

చూస్తూనే వుండండి
నిరంతర వార్తాస్రవంతి
దేనినీ చల్లారనివ్వం
రావణకాష్ఠం మా టాగ్‌లైన్
రగులుతోంది మొగలిపొదే కాదు
మొగల్తూరు కథ కూడాను

ఈ చెంపకొడితే ఆ చెంప చూపే
గాంధీకాలం కాదిది.
రెండు చెంపలూ చూపకుండానే
వాయగొట్టే గాంధీగిరి కాలం.
ఫ్యాన్స్ అభిమానంతోనే కాదు
ఆగ్రహంలోనూ తిరుగుతారు.

పరస్పర భజన సమాజాలతో
నష్టంలేదు.
పరస్పర గర్జన వ్యవహారాలు
తేలని విషయాలపైన వ్యూహాత్మక
తర్జన భర్జనలతో-
పరస్పర దూషణ తిరస్కారాలతో-
ఆలూలేదు, చూలూలేదు
కొడుకు పేరు సోమలింగంగా
సాధింపులతో-
అంతా అతలాకుతలం
అనుక్షణం కలకలం!

అంతా నిష్ణాతులే
అందరూ అనుభవజ్ఞులే

ఎవరి వ్యూహాలు వారివి
ఎత్తుగడలు, పన్నాగాలు
ఎదుర్కోలలు
ఎదురు దాడులు ఏవైతేనేం
అన్నీ-
ఇంకా కనబడని ఎన్నికల చెయ్యేదో
ఆడుతున్న నాటకం
వార్త విస్తరిస్తోంది.
దృశ్యం ఆక్రమించుకుంటోంది.
భీరువు బాల్చితన్నేస్తాడు.
వీరుడు లాల్చీ తొడిగేస్తాడు
ఝుళిపించే ఓకమీ్చ సాక్షిగా
మాటలోనూ, చేతలోనూ
మాటేసి వుంటుంది.

ఇప్పుడన్నీ సెగ్మెంట్స్ మాత్రమే.
ఎందుకో ఎక్కడో పిగ్మెంట్స్.
కొత్త సువ్యవస్థా స్థాపనకు
ప్రతి పార్టీ ప్రెగ్నెంటే
నొప్పులు ఎప్పుడో మొదలయ్యాయి
లోపల పిండం సంగతి తెలీదు
పైకి మాత్రం తనకు తాను
గట్టి పిండమే!
ప్రతివాడు తనకు తానే
క్లీన్ చిట్ ఇచ్చుకుంటాడు.

అవతలి వాడిపై
మాత్రం బురదచల్లుతాడు.
ఎవరూ ఎవరికీ, దేనికీ
వ్యతిరేకం కామనే అంటారు
తమ ప్రమేయం లేకుండానే
తమ పేరున
తప్పిదాలు జరిగిపోతున్నాయంటారు

ఏదీ నీ అధీనంలో లేనప్పుడు
సినిమా కథలోని పాత్రే
సమాజంలోనూ నీ అస్తిత్వం.

జీవితం సినిమా కాదు.
జీవితం రాజకీయం కాదు.
జీవితం జీవితమే.
వ్యష్టి కాదు సమష్టి జీవితం.
వైయక్తికం నుండి ఎదిగి
ప్రకాశించాల్సిన సంఘశక్తి మౌక్తికం.
సినిమాలూ, రాజకీయాలూ
జీవితంలో ఒక భాగం మాత్రమే.
మనిషి సాటి మనిషితో
పరస్పర విశ్వాసంతో,
ప్రేమైక భావనా మమేకం కావడమే
మనుగడ సాగించడమే జీవితం.

***

***(31 జనవరి 2008)***

# ప్రేమే జీవన శ్వాస

కలబడడమే–
దేహాలతోనైనా, దేశాలతోనైనా,
అనివార్య యుద్ధం
బహిరంతరాలతోనైతే బాగుణ్ణు!
ప్రేమికుడికీ ఉగ్రవాదికీ
తేడా లేకుండా పోతే ఎలా?




బ్రతుకు రుచ్యం చేసే వలపు–
ఎడద తీయదనపు తలపు.
బాధౌషదం
చిత్రంగా మళ్లీ–
డెందానికి మందులేని బాధ.

స్వాంతానికి సాంత్వనం
ఉత్సాహపుటింధనం
ప్రేమ లోకం తోటిది
ప్రేమలేని బ్రతుకు ఓటిది.

కానీ చూసావ్?
వీక్షణంతో మొదలై
గుండెల్లోని కెమిస్ట్రీ
ప్రేమరసైక రసాయనం–
ఎప్పుడెలా, ఎవరిలో, ఎందుకు
రూపొందుతుందో, ఓ మిస్టరీ!

హిస్టరీ నిండా
ప్రేమకథలున్నాయి
ప్రేమకోసం యుద్ధాలున్నాయి.
త్యాగాలున్నాయి.
ఏవయినా–
మనుషుల మధ్యే కదా.
ఆరాటాలూ, పోరాటాలూ
సకల జంతుతతి మధ్యే సదా.

ప్రేమించడానికో,
తిరస్కరించబడడానికో,
పగిలి పొగలడానికో,
మనసులంటూ ఉండాలి కదా!
మనుషులంటూ ఉండాలి కదా!

చచ్చి సాధించేదీ,
ఏమీ ఉండదు.

పుట్టడమంటూ జరగాలే కానీ–
ప్రేమెప్పుడూ చచ్చిపోదు.

పారదర్శకం కాకపోవచ్చు.
సాక్షికం కావచ్చు.
అనుభూతి రమ్యమేకానీ–
అభివ్యక్తం కాకపోవచ్చు
ఓడిపోవచ్చు
దూరం కావచ్చు
మరుగుపడచ్చు
మరిగిపోనూ వచ్చు
కానీ ప్రేమ ఉంటుంది
చిరంతనమై, చింతనమై
మనసున మనసై
ప్రేమ ఆత్మికమై ఉంటుంది
ప్రేమ–
కాలే దేహం కాదు.
కాలకుండా ఎగిరిపోయే
ఆత్మ కావచ్చు.

ఉన్మాదీ, ఉగ్రవాదీ
అనర్హ ప్రేమికులేం కాదు.
ఆక్సిజనూ కెమిస్ట్రీయే.
పొటాషియం సైనేడూ కెమిస్ట్రీయే
కెమిస్ట్రీ ఏదయినా–
సరిగ్గా కుదురుకోవాలి.
స్త్రీ, పురుషుల మధ్య
బయాలజీ ఏదయినా,
ఎవరి ఫిజిక్‌లు ఏవయినా,
కెమిస్ట్రీ కుదరాలి.
విస్ఫోటన రసాయనాలు కాక
ఎన్టూఓ– ప్రాణవాయువమరాలి.

అప్పుడు రోజూ ప్రేమికుల రోజే.
వీలయితే నాలుగు మాటలూ,
ఓ కప్పు కాఫీ
స్వాగతించదగినవే!
వీలుకాదని నాలుగు వేధింపులూ,
ఓ కత్తిపోటూ నివారించవలసినవి.

పిచ్చివాడా!
అనగా ప్రేమికుడా!
నీ పిచ్చిగానీ ప్రేమే పిచ్చి.
పిచ్చే కుదురుకున్నప్పుడు–
ప్రేమే కుదురుకోదా?
ఓ అమ్మాయి కాదన్న అబ్బాయికీ,
ఓ అబ్బాయి వలదన్న అమ్మాయికీ,
అక్కడితో వలపు ఇగిరిపోదు.
ప్రేమ శాశ్వతంగా ఎగిరిపోదు.
కెమిస్ట్రీ కుదురుకోనప్పుడు
ప్రయోగం విఫలమవుతుంది.
అంత మాత్రాన
వియోగం ఎప్పటికీ విజయం కాదు.
సూత్రబద్ధంకాని వలపుకు–
సూత్రీకరణలు మారవచ్చు.
కులం, మతం, పెద్దలు,
ఇంకెన్నో సంఘం పెట్టిన హద్దులు
ప్రేమ అధిగమించనూ గలదు,
ఒదిగి, మించనూ గలదు.

వలపెరుంగక బ్రతికి
కులికి మురిసే కంటె
వలచి విఫలమ్మొంది
విలపింప మేలురా–
అని బసవరాజు ఊరికే అనలేదు.

తరాలు ఎన్ని మారినా–
తరగని నిధి ప్రేమ.
ఎవరికి వారు ఆర్జించుకుని
పంచి పెంచుకునేది ప్రేమ
వాలం–టై ను చుట్టుకుని,
పాశ్చాత్యమై విపరీత పోకడలతో–
మనకేమీ కొత్తగా
పాఠాలు చెప్పనక్కర్లేదు!
డేటింగులూ, డైవోర్సులూ
కిస్సింగులూ, కిల్లింగుల
సంస్కృతి కాదు మనది
ప్రేమ మన పునాది.
ప్రణయం మన అనాది
పరిణయం పక్వఫలాది.

వలపు మొగ్గ.
విశ్వాసం పువ్వు.
పరిణయం కాయ.
దాంపత్యం ఫలం.
అదీ భారతీయ వంశవృక్షం.

వరదలు, తుఫానులూ,
భూకంపాలూ,
అగ్నిప్రమాదాలూ,
ఎన్నిమార్లు ఎదురవనీ–
మన ప్రకృతి
విధ్వంసం నుండి కూడా
కొత్త చిగురు వేస్తుంది.
ప్రేమలో దైవాన్ని చూస్తుంది
వరమైనా, శాపమైనా
ప్రణయ ప్రణవ మూర్తినే
విశ్వసిస్తుంది.
కొలుస్తుంది.

ప్రేమ కోసం–
మనుషులు చచ్చిపోకూడదు.
ప్రేమలేదని–
మనుషులు చంపబడకూడదు.
పునరపి జననం పునరపి మరణం
మనిషికే కాదు,
మనుగడ ఉన్నంతకాలం–
స్వచ్ఛ ప్రేమ భావనలకు కూడా.
ప్రేమించు ప్రేమకై
ప్రేమించు బాధకై
ప్రేమించు మనిషికై
జీవించు
మరణమెరుగని ప్రేమకై.

***

***(14 ఫిబ్రవరి 2008)***

# రైలు ప్రయాణం...

పందుం పుల్ల
నోట్లో పెట్టుకు నములుత్తూ,
మచ్చల బర్రెను నిమురుతూ,
సూచనలు సలహాలలో
మీడియాయే వెనుక పడిందనీ,
ముందే మేల్కొనకపోతే–
నువ్వెక్కవలసిన రైలు
జీవితకాలం లేటేననీ–
లైట్ తీసుకు చెప్పేసాడు లాలూ.
కంటితుడుపుతో
ఈ మాటూ–
మన స్టేషన్లో ఆగినట్లే ఆగి,
ఆగకుండానే అసలుకు,
దూసుకుపోయింది– బడ్జెట్ రైలు.

మొన్నటిదాకా
గుండెల్లో పరిగెత్తిన రైలు–
పట్టాలకు ఎక్కినట్లే
అనిపిస్తోంది.
ప్రయాణించడానికి సౌకర్యం
సమకూడినట్లే
పొడగడుతోంది.
ఒకప్పటి పొగబండి
ఇప్పుడు విద్యుత్ పొగరుబండి
రూపెత్తింది.
ఏ.సీ.లూ., టీ.సీలూ
బాగానే పనిచేస్తున్నట్లున్నా
సామాన్యుడు రోసిస్తూనే ఉన్నాడు.
పరుగులిడే చక్రాలు
ప్రవహించే జీవిత వాహినిలో
ఇంకా ప్లాట్‌ఫారం మీదే ఉన్నాడు.
గరీబ్ రథమూ
అమీరే హైజాక్ చేస్తాడు
అవసరానికి కౌంటర్లో
తత్కాలమూ చేతికందదు.



కూతపెట్టినంత ఘనంగా
కూడలికి చేర్చనే చేర్చదు
ఆలస్యమూ, ఔటర్లో నిలుపుదలా
అనివార్యంగానే ఉంటాయి.

అరకొర సౌకర్యాలూ,
అధ్వాన్నపు తిండీ-
హరాయించుకోలేనట్లే ఉంటాయి.

రైలు ప్రయాణం అంటే-
సరుకుల్ని ఒక చోటు నుంచి
మరో చోటుకి తరలించినట్లు,
మనుష్యుల రవాణా కాదు కదా!
అలా కాకూడదు కదా!

మరచెంబుతో నీళ్లూ
ఓ బెడ్డింగూ, చిన్న ట్రంకు పెట్టే,
మూటకట్టిన మినపరొట్టే,
పులిహోరా, పెరుగన్నం,
దారి తిండికి మురుకులు,
వేసవిలో సెలవుల్లో
అమ్మమ్మ ఊరికి
అనకాపల్లి ప్రయాణం అంటే-
అదో అందమైన
మధురానుభూతి.
జ్ఞాపకాల్లో ఇప్పటికీ
తూగుతూండే బాల్యం-
రైలు ప్రయాణం.

కిటికీ పక్క సీటు కోసం
పిల్లలు పోటీ పడడం,
వెనక్కి పరుగెత్తే దృశ్యాల
వీక్షణంలో అచ్చెరువు పొందడం,
ఏ బొగ్గు నలుసో ఎగిరొచ్చి
కంట్లో పడితే-
అమ్మ దగ్గరకు తీసుకు కన్నూదడం,
రుమాలు మడిచి ఊది
వేడి ఆవిరి పట్టడం,
స్టేషన్లో బండి ఆగినప్పుడు
ఖాళీ అయిన మరచెంబును నీళ్ళతో
నాన్న నింపి తేవడం,
ఈలోగా రైలు కదిలిపోతుందేమో
అనుకుంటూ
అంతా ఆత్రంగా, కంగారు పడటం,
పక్కవారితో ముచ్చట్లూ,
ఎవరి చంటి పిల్లలనైనా ఎవరైనా
ఎత్తుకుని ముద్దులాటలూ-
రైల్లో ఓ చిన్న ఊరు
ఉన్నట్లే ఉండేది.
మానవ సంబంధాలతో
గుండెగూళ్లు కిటకిటలాడేవి.
రైళ్లు- సంబంధాలనూ
అనుసంధానం చేసేవి.
అనుబంధాలనూ, ఆత్మీయతలనూ
పరస్పరం చేరవేసేవి.

నివాసగృహాలకూ-
కంపార్ట్‌మెంట్ కల్చర్ పెరిగాక,
ఏసీలూ, టూటైర్లూ
ఎక్కువయ్యాక,
నిజానికి సౌకర్యాలు
హృదయ సౌమనస్యాలను
మరింత పెంచాల్సింది పోయి-
ఏమిటో
ఎడాలు పెరుగుతున్నట్లు
అనిపిస్తోంది.
రైలు ప్రయాణమూ యాంత్రికమై

పట్టాల అయోమయం–
అనుభూతిలోకీ
చొరబడినట్లనిపిస్తోంది.

ఓ బ్రీఫ్‌కేస్‌తో
రైలు ప్రయాణం చేయగలం నేడు.
పరుపులూ, రగ్గులూ,
తలదిండ్లూ, న్యాప్‌కిన్లూ,
వాటర్ బాటిల్సూ,
నీటుగా ప్యాక్ చేసిన
ఆహారపు పొట్లాలూ–
అన్నీ సప్లయ్ చేయగలరుగానీ,
అనుబంధాలనీ, ఆత్మీయతలనీ
ఎవరు సప్లయ్ చేస్తారు?

రైళ్లలో ఇరుకుని
నివారించగలరేమోగానీ,
మనస్సులో ఇరుకుని
మనమే పారద్రోలుకోవాలి.

ప్రయాణంలో
కొత్తదంపతులకు కూపీలు
ఏమయ్యాయో తెలీదుగానీ–
రైల్లో నేరాల కూపీలు
పెరిగిపోతున్నాయి.

పట్టణాలకు వలసలు పెరిగి
ఊళ్లు తరిగిపోతున్నాయి.
రైలు పట్టాల్లానే కలవని
దూరాలు పెరిగిపోతున్నాయి.

ఇంతకీ ఆశించేది ఒక్కటే–
సరుకుల రవాణాలా
'వట్టి' మనుషుల రవాణాగా
కాకూడదు రైలు ప్రయాణం.
ప్లాట్ ఫారం మీద
పడిగాపులు కాకూడదు.
ఆలస్యాలకు ఆలంబన కాకూడదు.
ప్రయాణం అంటే–
మనుషుల్నే కాదు,మనసుల్ని కలిపేది.
ప్రేమానురాగాల అభివ్యక్తి.
మానవ సంబంధాల శక్తి అది.
చిక్కులు, చీకాకులూ లేక–
అవసరాలకు ఆలస్యం కాక–
సౌకర్యాలకు దూరం కాక–
సమకూరిన రైలు ప్రయాణం–
అవిస్మృత అనుభూతి గానం.
అనుభవ జీవనయానం.
అదీ అసలు సిసలు రైలు ప్రయాణం.

***

***(28 ఫిబ్రవరి 2008)***

# హా! కీ... పోయిందే

గిల్లి ఏడిపించడం
ఓ ఆట అయ్యాక-
కళ్లముందే బావురుమని
చతికిలబడడం
ఓ విషాద దృశ్యం!



ఉత్థాన పతనాలు
క్రీడాస్ఫూర్తి అనుకోవడానికీ లేదు,
చేతులారా-
చేతులెత్తేసినట్లే,
ఆడిపోరాడి ఓడితే
బాధేమీ లేదు.

కానీ అసలు
రణ క్షేత్ర ప్రవేశానికే
అర్హత కోల్పోవడం-
వీరావమానం

పేరుకి
జాతీయ క్రీడ
పేనుకి పెత్తనం
తల అంతా తెగ కొరికినట్లు,
నేతృత్వ దరిద్రమే
వెనుజూపినట్లు

అంతా వివక్షే
అంతా సవతి ప్రేమే
ఆటగాళ్ల మధ్యనే
సృష్టించిన అంతరాల అగాధం
ఆటకీ ఆటకీ
అలవిమాలిన తేడా,
క్రీడా మంత్రిత్వంలోనే
కోల్పోయిన వ్రీడ.
చూస్తూ చూస్తూండగానే
పరుచుకున్న క్రీనీడ.
బృందాన్ని నిందిస్తాడు
జోకిమ్ కర్వాలో,
ఆటగాళ్ల వైఫల్యానికి
అందరిదీ తలో చెయ్యి.

"ఇప్పటికి నా దగ్గర
ప్ఫదో ఇరవైమందో

మాస్టర్లు పనిచేశారు" అనే
బుడుగుగాడి చందాన
పదేళ్లలో మారుతూ వచ్చిన
పదిహేనుమంది శిక్షకులు
గిల్లి ఏడిపించిన
ప్రైవేటు కథనమే!
ఖచ్చితంగా ప్రభుత్వ
సంవిధానమే!

ఎవరు దోషి?
జాతీయ క్రీడ హాకీ
మరణశయ్య మీద
పరాజయ మృతమయ్యేందుకు
ప్రాణం తీసిందెవరు?
పాడె కట్టిందెవరు?

సగటు మనిషి మత్తు
వ్యాపార క్రీడయేగానీ–
జాతీయ క్రీడ కాదు కదా!
బ్యాటూ– బంతే
అక్కడయినా, ఇక్కడయినా,
కానీ–
మినహాయింపులూ, ప్రోత్సాహకాలూ,
లక్షల మీద లావాదేవీలు,
ఆటగాళ్ల మీద బిడ్డింగులు,
అహో!–
పదకొండుమంది ఆడితే,
పదకొండు లక్షలమంది చూసే
క్రికెట్టు ఎక్కడ?
పాపం
కాలహరణమేలని
కళాత్మక క్రీడ
హాకీ ఎక్కడ?
ధ్యాన్ చంద్!
హాకీని జాతీయ క్రీడగా పైపైకి తెచ్చి–
సువర్ణ పతకాల పంట పండించిన
మణికట్టు మాయాజాల
మాంత్రికుడు.
స్టిక్‌వర్క్, డ్రిబ్లింగ్ నేర్పుతో–
నాజీనియంత హిట్లర్‌నే మురిపించిన
అప్రతిహత ఆటగాడు;
ధ్యాన్ చంద్!
ఒలంపిక్‌లో పతకాల గెలుపు
పతాకాలు ఎగరేసిన వాళ్లం.
మెల్‌బోర్న్ వరకూ మేలు జట్టు
మనమే!
మాస్కో ఒలంపిక్స్‌తో
గత శతాబ్ది ఎనభై దశకం మొదలు
చూస్కో ఇక పతన పరంపరే!
డుబుక్కుమేల పుటుక్కు జరజరే!

తిరుగులేని ఒక నాటి జట్టు
క్రమేపీ కోల్పోయింది తన పట్టు.
జట్ల సంఖ్య క్రమేపీ పెరిగిన తట్టు–
అర్హత పోటీల పేర
దాటక తప్పనిస్థితి
అంకురించిన లోగుట్టు.
నాలుగేళ్ల క్రితం వరకూ
నాణ్యత మాటేమోగానీ మనవారు
అధిగమించారు అర్హతపోటీల గట్టు.
ఇప్పుడు
బయటపడింది మన రట్టు.

భరించాల్సి వస్తోంది తిట్టు
మన జట్టు.

నిజమే!
నిబంధనలు మారాయి,
బంధనాలు జారాయి,
రాజకీయాలు దూరాయి,
పళ్లూడగొట్టుకునేందుకు
ఏదయితేనేం రాయి!
పచ్చిక మైదానాలు పోయి-
ఆస్ట్రోటర్ఫ్, పాలీగ్రాస్,
అంటూ
ఎప్పుడయితే తయారైందో-
కృత్రిమ సింథటిక్ గ్రౌండ్
వాటి ఏర్పాటే భారీ పరిణామమైంది.
రాజకీయాలు,
ముఠాతగాదాలు- ఇవీ...
అగ్నికి ఆజ్యంలా తోడయింది.

పదిహేను దాటని ఆస్ట్రోటర్ఫ్‌లు
ఆటగాళ్ళని ఎదగనీయని
బోన్సాయ్ క్రీడాకారుల్ని చేసాయి.
పతనం అంచుల మీదే ఇక
వరుస సంతకాలు చేశాయి.

క్రికెట్ మహావృక్షం ముందు-
'హాకీ' ఓ గుబురు పొద అయింది.
ఓ గుబులు సొద అయింది.
ఓ దిగులు పదమయింది.

గెర్హార్డ్ రాచ్
తొలి విదేశీ శిక్షకుడి వ్యాఖ్య-
పిచ్చాసుపత్రి అయ్యింది.
భారత హాకీ సమాఖ్య.

ఒక అనౌచిత్య పెత్తనం-
భారత హాకీలో పడి లేచిన
మొలకెత్తిన విత్తనం...
ఎవరు చేస్తారు క్షాళన!
తొలగుతుందా హేళన!
కళ్లు తెరచి చూడాలి.
వొళ్లు తెలిసి ఆడాలి.

ధనరాశుల క్రికెట్టు మోజులో-
హాకీ కనుమరుగు కారాదు ఏరోజూ
మళ్లీ ఒలంపిక్స్ నాటికైనా-
హాకీ కాకి అరవాలి.
కోకిలను ఎంబ్లమ్‌గా ముద్రించి
రాబందుల క్రీడ చెలామణి
కావడం కన్న,
జాతీయ క్రీడగా హాకీ
తిరిగి తీయదనపు పురావైభవం
పొందాలి!
ధ్యాన చంద్రమై
కీర్తి వెన్నెలలు ప్రసరించాలి!
హాకీ మన గర్వకారణమని
గ్రహించాలి.
***
***(13 మార్చి 2008)***

# రంగుపడుద్ది

ప్రతి మనిషీ ఓ వర్ణం.
వర్ణరహితుడెవడూ లేడు,
రంగు–
మాతృగర్భంలోనే ముంచితీసినట్లు–
బయల్పడటమే ఓ చిత్రం!
బొమ్మ గీసుకుని ఏ బ్రహ్మయ్యో
మట్టితో చేసెనయా!
ప్రతిక్షణం ప్రతి బొమ్మా–
నయానయా!!
ఎక్కడి వర్ణమిశ్రమం!
ఎన్ని రంగులు! ఎన్నెన్ని రంగులు!!

రంగు
మనిషి రంగు
జాతి రంగు
కులం రంగు
రంగు జీవిత రంగాన
చివరంటా వెన్నంటే వుంటుంది.
వాడు నలుపు
వీడు తెలుపు
తను చామనఛాయ
అది సరే!
బాహిర రూపుల రంగులు సరే!
వెన్నంటే వర్ణమో!
వర్ణాశ్రమ ధర్మమో!
గీతాకారుడు గీతలేసినట్లు
కలిపిన నాలుగు రంగుల
హంగు పొంగులో

అయిదో వర్ణమే కాదు
ఆరో వర్ణమూ పులిమారు కదా!
అన్ని రంగులూ అందమైనవే.
అన్ని రంగులూ అందుకోదగినవే.
దేని విశిష్టత దానిది.
ఒక రంగును ఒక భావానికీ,
ఒక వర్ణాన్ని ఒక క్రియకూ
ఎంచుకుంటున్నది నువ్వు,
రంగు పంచుకుంటున్నదీ,
రంగు ముంచుకుంటున్నదీ,



రంగులు రంగులంటూ
తరంగ మాడేదీ,
వీరంగమాడేదీ– నువ్వు!

రంగు పలచబడుతుంది,
రంగు గాఢమౌతుంది,
రంగు తేలిపోతుంది,
కణికో, నీరో, నూనెయేనో–
కలమో,కోక్రైవిలో, కుంచెయేనో–
రంగు చిలకరించబడుతుంది,
రంగు జల్లబడుతుంది,
రంగు పూయబడుతుంది,
రంగు రంగులో రంగుగా
రంగరించుకుని–
ఏదో రంగమెక్కుతుంది.

చిత్రం చూసావా!
వివర్ణమూ ఓ వర్ణమే.
సప్తవర్ణ సంచాలిత గాత్రం
ఆకాశమూ, భూమి ప్రకృతే–
ఒక ఆత్రం.
రంగులు మారిపోతూనే వుంటాయి,
దివారాత్రం.

రంగు గురించి మాట్లాడేప్పుడు
ఊసరవెల్లి ఉరికి వస్తుందెందుకు?
నల్లపిల్లీ, తెల్ల కుక్క, పచ్చటి చిలుకా
ఎర్ర తామర, నీలి కలువా,
వర్ణం– ఓ లక్షణ ప్రతీక.
ప్రతి జీవికీ ఓ గుర్తింపు పతాక.
ఇంతకీ అసలు మనిషి రంగేమిటీ?
మట్టిరంగే మనిషి రంగు కదా?
ప్రపంచాన్ని రంగుటద్దాల్లోంచి
చూడడం
ఎవడికి ఎవడు నేర్పినట్లు?

రంగు పేరుతో మనిషికీ
మనిషికీ మధ్య
దూరాలు సృష్టించిందెవ్వడు?
రంగుల్లో అందాలు,
ఆనందాలు కాదు
విద్వేషాలను ఎద కేన్వాస్‌పై
అలదిన విచిత్ర వీర్యుడెవ్వడు?

హోలీ! రంగ హోలీ!
ఎదకేళియ హోలీ!
వసంతం రంగుల రథమెక్కి వస్తుంది.
ఆకులు, చిగుళ్లు, కాయలు,
పూలు, పండ్లు...
చెమకేళియ హోలీ!
బుక్కీలు, గుండలు, పిచికారీ ద్రవాలు
పైపూతలు, మైపూతలు,
మునగానాం! తేలానాం!–
రంగేళీ రంగురంగుల వైభోగం.
వర్ణభరిత పర్వం సర్వం.

ఏ వర్ణం వారయినా–
అందరూ మావారే!
అందలాలు అందరికీ.
పదవులు మాత్రం కొందరికి.
ఇంతకీ పార్టీకి రంగు ఎందుకు
ఎవరయినా చెబుతారా?
ఒకరికి పసుపు,
ఒకరికి కాషాయం,
ఒకరికి గులాబి,
ఒకరికి ఆకుపచ్చ,
ఒకరికి మూడు రంగులు,

పార్టీకి రంగులు కాదా ఓ పిచ్చ!
కేవలం ఏకవర్ణాంకితం కావడం
కాదా ఓ మచ్చ!

ఓ పార్టీ తీర్థం పుచ్చుకున్నప్పుడల్లా
విలువల సంగతేమోగానీ–
వలువలు మాత్రం మారుతాయి.
వర్ణం మారిపోతుంది.
కండువాలు, చొక్కాలు, పాగాలు,
చేతి జండాలు,
పతాకాలు, తోరణాలు,
ఒకటే రంగు,
రంగేరంగు... ఏకవర్ణపు పొంగు.
పార్టీ అంటే ఓ రంగు.
అధినేతది తదనుగుణంగా ఓ రంగు.
ఓ రంగుకు కట్టుబడడం–
అంతరంగం రంగేమిటో
అంతుబట్టకున్నా,
పైపూత ఖాయం–
బహిరంగం– అంగాంగం!
ఇంతకీ
అన్ని రంగులూ కలిసిపోయేది
ఒక్క రంగులోనే
అని తెలిసీ– వర్ణార్భటి–
రంగుల పోటీ
రాజకీయం నుండి
జీవితం అంచువరకూ...
విస్తరించిన వర్ణవైవిధ్యం!
ఇంతకీ నలుపు తెలుపుల అసలు కళ
వర్ణ వైదుష్యంలో వుందా?

వెలుగూ– చీకటి, మంచి–చెడూ
పుణ్యం పాపం అన్నీ
తెలుపు నలుపుల
అసలు సిసలు వెలగల నాణెపు
బొమ్మా బొరుసు కదా!
సత్యశోధనకు, ధర్మ సాధనకు
రంగులు పులమడం మరియాదా?

ఏ రంగూ అంటని
స్వచ్ఛ స్ఫటికంగా ఎవరినీ
ఉండనివ్వరు.
నిజాయితీ రంగుని,
నియమాల రంగునీ
కడిగేసుకున్నవాడే చెలామణీ!
రంగులద్దకపోయినా
బురదేనా చల్లుతారు.
చీమూ నెత్తురూ మరిగిపోయేలా–
వర్ణ వివక్ష సచిత్రపటాలకెత్తుతారు.

జాగ్రత్త బాబూ జాగ్రత్త!
కొత్త రంగులొస్తున్నాయి,
కొత్త జెండాలొస్తున్నాయి,
కొత్త పార్టీలొస్తున్నాయి,
కొత్త నేతలొస్తున్నారు.
ఉత్తిష్ఠోత్తిష్ఠ!
ఇంక హోలీయే హోలీ!
సెంటర్‌లోనే కాదు,
నుక్ అండ్ కార్నర్‌లో
ఎక్కడున్నా జాగ్రత్త!
రంగు పడుద్ది!
***
***(20 మార్చి 2008)***

# ప్రశ్నా(స)మయం

ఎదురుగా ఓ ప్రశ్నాపత్రం,
ఒకడి ముందు ఒకడు
అడగడు- చెప్పడు
అంతా సందేహమే,
అన్నీ అనుమానాలే,
సంధించే ప్రశ్నలుంటాయి,
సమాధానాలే తెలియకుంటాయి.



ఔను-
ఇది పరీక్షా కాలమే,
పోటీతోనే భేటీ,
ఇంటరో, పదవ తరగతోకాదు
ఇంటనూ, పదవీ గతిలోనూ-
పరీక్షే!

అంతర్గత అసమ్మతులకూ,
అధిష్ఠాన విస్మృతులకూ,
అస్తిత్వ బలాలకూ,
అమలుకాని సభలకూ,
అన్నింటికీ ప్రశ్నలే ప్రశ్నలు!!
ఎవరో సంధించేవే కాదు,
ఎదలో తామై తొలిచేవి కూడాను.
అడుగుముందుకూ
అడుగు వెనక్కూ
ఎటువేయాలన్నా అడుగడుక్కూ
ఆవిష్కృత మౌతున్న ప్రశ్నలు!
క్వశ్చన్ అవర్ ఈజ్ ఓవర్ కాదు.
ఓవర్ క్వశ్చన్ అవర్-
యువర్ పవర్.
సమాధానాలు చెప్పాలనే-
సమాధానాలు రాయాలనే-
సమాధానాలకు
సమాధానించుకోవాలనే-
కానీ ఏదీ వీలు?
ఏది దారి?

ముంచెత్తిన వానలు
ప్రశ్నలను తడపవు.
ఎండగడుతూనే, ఎండ బెడుతూనే
ఎదుట నిలుస్తాయి.
కుత్తుక బంటిలో కూరుకుపోయినా-
కుర్చీ బల్లమీద
ప్రశ్నాపత్రం నిలదీస్తూనే ఉంటుంది.

రెపరెపలాడేంత గాలిలేదు సరే–
ప్రశ్నై ఉబ్బరిస్తున్న
ఈ ఉక్కపోత మాటేమిటి!
వాడు–
ప్రశ్నను సంధించి తప్పుకుంటాడు.
కనబడినప్పుడల్లా మౌనమే!
కానీ ప్రశ్న
రాజుకుంటూనే ఉంటుంది.
నవ్వినా రువ్వినట్లే ఉంటుంది.
సమాధానానికి నిలదీసినట్లే నిజానికి.
అడిగితే– అడిగానా అంటాడు.
సమాధానం నీ బాధ్యతను చేసి–
నిమ్మకు నీరెత్తడు.

ఐక్యత ప్రశ్న.
సెంటిమెంట్ ప్రశ్న.
సీనియర్స్ ప్రశ్న.
రాజీనామాల ప్రశ్న.
వానకు వందనం ప్రశ్న.
ఎండకు ఆ గొడుగు ప్రశ్న.
ఛానల్స్‌కు నిరంతరాయం ప్రశ్న.

ఔను!
ఇది పరీక్షా కాలం.
మనిషికి మనిషే ప్రశ్న.
మానవత్వం మనుగడే ప్రశ్న.
పాపాయి సైతం
రూపాయి పరుపు మీదే
మేను వాల్చింది.
కనురెప్ప కొట్టినప్పుడల్లా
కరెన్సీ లెక్క పెడుతున్నట్లే ఉంటోంది.

ఫేక్‌లూ, ఫ్లూక్‌లూ,
ఫేస్‌ల్లోనూ, క్లాస్ ప్రశ్నలూ–
మాస్ ధర్నాలూ,
మనుషుల నిధనాలు.
అన్నింటా ఆర్థిక బంధనాలు.
అడిగేవాడికి చెప్పేవాడు లోకువ.
అడగకపోయినా–
పట్టించుకోలేదని లోన కువకువ.
అడిగితే– అడుగులు మడుగులొత్తినా,
ప్రశ్నల మేకు దిగక తప్పదు నెత్తిన!
బుర్రలనిండా సందేహాల సూదులే.
తెలిసో తెలియదో కూడా తెలియదు.
తెలిసినా తెలిసినట్లుగా
తెలియనీయదు.
తెలియకుంటే తెలిసినట్లుగా
తేలుతూ–
తెల్లతెల్ల మొహాలెందుకో తెలీదు!

చెట్టు ఒక ప్రశ్నార్థకం.
ఎగసే అల ఒక ప్రశ్నార్థకం.
కురిసే వాన ఒక ప్రశ్నార్థకం.
మానవ ప్రకృతే–
చిత్త శుద్ధి లోపించి,
నీతి, నిజాయితీల బాట తప్పి,
నిలిచినప్పుడు–
సర్వప్రకృతీ ప్రశ్నార్థకమే!

ఆటో వస్తావా?
ఈ బస్సెటుపోతుంది?
రైలు రైట్ టైమేనా?

ఆమె ప్రేమిస్తుందా?
ఇతడు పెళ్లాడతాడా?
కత్తితో పొడిచాడా? విషం తాగిందా?
ప్రయాణం నుంచి ప్రణయం దాకా
ప్రశ్నలే ప్రశ్నలు!!
సందేహమందేహుల సందోహం.
సమయం, సమాజం, సందర్భం–
ప్రశ్నార్థకాలకు ఆలవాలం.
అన్నీ ప్రశ్నలే!
అక్షరాలే కాదు, అంకెలూ ప్రశ్నలే!
ఆరో వేతన సంఘం–
అమలెప్పుడనీ ప్రశ్నలే!
రమణీయం నుండి రాజకీయం దాకా
అన్నీ అడుగుడులే!!

వాక్యం, ప్రశ్నలతోనే ఉంటుంది.
వాస్తవం ప్రశ్నలతోనే ఉంటుంది.
మాటలన్నీ
ప్రశ్నలవైపే మళ్లుతున్నాయి.
ఏమిటి?
ఎందుకు?
ఎలా?
ఎప్పుడు? ఎక్కడ? ఎంత?
నేటి మానవ ప్రకృతే ప్రశ్నల వింత!

ఇంతకీ–
ఎవరికయినా అసలు
సమాధానాలు కావాలా?
ప్రశ్నించడంలో కుతూహలంగానీ,
జవాబు వినడంలో ఉందా?
సమాధానాలు తెలిసీ ప్రశ్నిస్తున్నారో,
సమాధానాలు కోరి ప్రశ్నిస్తున్నారో,
సమాధానాలు విని ప్రశ్నిస్తున్నారో
తెలియని పరీక్షా కాలం!

ప్రశ్నకు ఒకరికొకరు సాక్షీభూతం,
సమాధానం విన్న,ఉన్న
దాఖలా దొరకని
ఆధునిక మానవ భగవద్గీతం!

***

***(27 మార్చి 2008)***


# రానీ సర్వధారి

వాడు చొక్కా విప్పేస్తాడు
అనాచ్ఛాదిత వక్షస్థలం
గుండెలపై గుబురు కేశాలు
వర్ణం వెల్లడవుతుందేమోనన్నట్లు-
గుబులును ఆదర్శంలోకి
అనువదించి,
చిలక్కొయ్యకు తగిలించిన
యజ్ఞోపవీతం,
మనసులోని గాయత్రి-
మగువేకానీ, మంత్రం కాదు,
ఔను!
వాడికి సల్మాన్‌ఖాన్ హీరో.

ఆమె పైటనెప్పుడో
తగలేసింది.
బీచ్ వాలీబాల్ ఆడుతున్నట్లు
దుస్తులు అతిపొదుపు.
హాలీవుడ్డో, బాలీవుడ్డో, టాలీవుడ్డో
శ్రేణి ఏదయితేనేం
శ్రేయం అధునాతన ఫ్యాషన్
అమ్మాయికి!
షార్ట్‌లో, మిడ్డీలో,
టీషర్టో, జీన్స్‌ప్యాంటో
అబ్బాయికీ, అమ్మాయికీ
ఒకటే డ్రెస్సు
తేడా ఎందుకులే!
ఆకాశంలో సగం సరే-
సగం సగం దుస్తుల ధారణా
అవధరించరయ్యా...

ఔను! ఆమె
వెండితెర తారకు
జిలుగు వెలుగు జిరాక్స్ కాపీ.

సిగ్గు నీతి మానం
విప్పేసిందని-
సినీమాని ఆడిపోసుకునేవారు.
సంఘ సంస్కర్తలు, దేశభక్తులు
రాగానురాగాలు వదిలారు.



జననినీ, జన్మభూమినీ
డాలర్లకు జార్చారు.
కీలకమైన మౌలిక విలువల పతనం.
యథానేతా తథా పౌరా!
మునుముందు కనబడేదంతా-
దిగంబరమే.

రాజకీయమూ ఆ తొలి
అక్షరాలుగానే చ్యుతమైంది.

అన్నీ జారుడుబల్లలే
అన్నీ పాకుడు రాళ్లే
లోయలూ, లోతులే
అసెంబ్లీ బూతులే
ఛానెల్ చొంగకార్పుళ్లే
పోర్నోగ్రఫీ ఇంటర్నెట్‌లే
ఒక దిగజారుడుతనం
దిసమొలతనం
అంతా అసహజం, కృత్రిమం.
ఆకాశం
చుక్కలను జార్చుకుంటే
ప్రభాతమవుతుందన్న
ఆశ ఉంటుంది.
మేఘం
కొండను తాకి దిగుతూంటే
వర్షం హర్షమయ్యే సంకేతముంది.
వృక్షం ఆకులు రాల్చుకుంటే
తిరిగి వసంతం వస్తుందన్న
భరోసా వుంది.

మనిషే–
విలువలు దిగజార్చుకుని,
వలువలు దిగజార్చుకుని,
ఏమైపోతున్నాడో తెలియడంలేదు.
శరీరంలో ప్రవహించాల్సిన రక్తం
రోడ్లమీదకు పారుతోంది.
పడకగది వ్యవహారాలు
డ్రాయింగ్‌రూం ఇంటి తెరల్లోకి
జారాయి.

అనుబంధాలూ, ఆత్మీయతలూ
రూపాయి అంచుల్లోకి పడ్డాయి.
పెద్దల మాట చద్దిమూట కాదు
వారినే మూటగట్టి వృద్ధాశ్రమాలకు
ముడుపుగట్టి వదిలారు.
కొండమీది గుడిలో దేవుళ్లు కూడా
నాలుగు రోడ్ల కూడలి రహదారుల్లో
ట్రాఫిక్ జామ్‌కు వీలుగా,
రోడ్ల విస్తరణకు సవాలుగా,
మారారు.

ఎక్కడ ఉండాల్సినవి
అక్కడ ఉండడంలేదు.
అంతా స్థానభ్రంశమే.
ఆకాశంబున నుండి... శంభుని
శిరంబందుండి...
గంగాకూలంకష–
పాతాళ పతనమే!
భగీరథ ప్రయత్నాలేమీ అక్కర్లేదు–
పడిపోవడానికి
పడగొట్టడానికి
అంతా రెడీయే కానీ
రాజకీయం ఛీ!
అవిశ్వాసం పెట్టి
వీళ్లు విశ్వసనీయత
పోగొట్టుకుంటారు.
బాధ్యతలు ధరించాల్సిన రాజకీయం
'జల్సా'ను దింపుకుంటుంది.
తెలుగు ప్రేమ ప్రచారం–
ప్రాచీన భాష గుర్తింపు దేవులాటలో
దిగబడిపోయి,
భవిష్యత్ సజీవత్వాన్ని విస్మరిస్తుంది.

అంతా దింపుడు కళ్లెమే!
అంతా దివాళాకోరుతనమే!
అంతా దిగజారుడు వైఖరే!
నైట్‌క్లబ్ క్యాబరే డ్యాన్సర్
మ్రోగుతున్న శ్రుతికనుగుణంగా
ఒక్కొక్క ఉడుపునూ ఒడుపుగా
తీసిపారేసినట్లు,
సినిమాలూ, రాజకీయాలూ,
శాసిస్తున్న ప్రపంచీకరణ
పెత్తందనాలూ
ఆర్థికం ఒక్కటే ఫాస్ట్‌బీటై
మ్రోగుతూండగా–
ప్రేమలు, ఆత్మీయతలు,
అనుబంధాలు,
సంప్రదాయాలు, సంస్కృతీ
ఒకటేమిటి
విలువైన అన్నిటినీ విడిచిపెట్టేలా–
దిగంబరీకరిస్తున్నాయి.

తల్లీ ఉగాదీ!
నవవత్సరాదీ!
'సర్వధారి' అన్న పేరు
కోల్పోతున్న విలువలకూ
మానవ సంబంధాలకూ వర్తించేలా–
ధరింపచేస్తావా!
ఉద్ధరింపచేస్తావా!

నాలుగు కాలాలపాటు నీ పేరు
చెప్పుకునేలా
నాలుగు రోజుల్లో వచ్చేయ్!
విశ్వాస తీర్మానంతో విహరించ
వచ్చేయ్!
రా సర్వధారీ!
రానీ సర్వధారి.

***

*(3 ఏప్రిల్ 2008)*

# ఎంతో అక్కర్లేదు

ఎంతో అక్కర్లేదు
అక్కర్లేదు!
నిజమే! తపన చాలు.
నిజాయితీ చాలు.
చిత్తశుద్ధి చాలు
ఎందరో అక్కర్లేదు–
ఒక్కడితో మొదలైనా చాలు.



కానీ– వట్టి ఊహ, వట్టి ఆశ.
చుట్టూ తతంగం–
విహంగాన్ని కూడా
వలవేసి పడుతుంది.

పంజరం బాగుంటుంది
రెక్కలల్లార్చి ఎగిరే
కష్టమక్కర్లేదనుకుంటే–
పక్షికి పంజరమే బాగుంటుంది.
విహాయసంలో ఆయాసం
అనుకుంటే–
విహంగం గూడు వదిలేదే కాదు.

ఫలించిన వృక్షానికే
రాతి దెబ్బలు.
ఏ పని చేయక స్తబ్ధుడై
నేనే మిస్టర్ క్లీన్ అంటే–
నవ్వులాటవుతుందే గానీ
నువ్వు గ్రహింపబడవు.
స్వేదాన్ని ఓడ్చని వాడు–
సేద్యానికి పనికిరాడు.
కంప్యూటర్ మీట నొక్కి
కన్నీటిని నిరోధించలేవు.
కష్టం వుంది, రొచ్చు వుంది,
కాళ్లు చేతులూ ఆడని
ఇబ్బంది వుంది.
సొంత భూమి లేదు.
సొంత గూడు లేదు.
సొంత తిండి లేదు.
సొంత మనిషి కూడా లేకుంటే–
సొంతానికి మిగిలిందేముంది!

ఎక్కడ ఆపన్న హస్తం?
ఏది దరస్మిత కమలం?

పడకపై ముళ్లు లేని గులాబీ ఏదీ?
గమనానికి ద్విచక్ర శకటం ఏదీ?
కంటి నక్షత్రం ఆశ.
ఏనుగు మోసేయగలమన్నంత శ్వాస.
ఏ బరుల్లోని ఎదుగుదలా తాకని
లేబరు తొంభై శాతం జనం.
లేబర్ పార్టీ చిరంజీవి
లేని బరాబరులు చేస్తాడా ఏమిటి?
ఎవడొచ్చీ అసలింతకీ ఎవరికయినా
కొత్తగా ఊడబొడిచేదేమిటి?
ముందు గడిచే తీరు
చూడాలిగా ఇప్పటి
కప్పుకోడానికి చలికి దుప్పటి,
త్రాగేందుకింత జొన్న సంకటి,
ఉన్నప్పుడు కదా మిగతా సంగతి!
ఎండకింత నీడా,
ప్రతి పూటా ఆకలి తీరే జాడా,
దొరికినపుడు కదా–
కొంతైనా వదిలేది దారిద్ర్యం పీడ!

నిజమే!
ఎంతో అక్కర్లేదు.
ఒక్క రెండ్రూపాయలు చాలు.
టీనీళ్ల ఖరీదుకంటే,
కనీస బస్సు టికెట్టు కంటే,
ప్లాట్ ఫారం రైలు టిక్కెట్టు కంటే,
తక్కువే రెండ్రూపాయలు.
కానీ కిలో బియ్యం
వస్తుందంటే ఎందుకు భయం
అది కదా అభయం.

అన్నీ ఓటు బ్యాంకు కొల్లగొట్టడానికే–
అనుకోవడమే అన్యాయం!
కాగితాల మీద
అన్ని పథకాలు బాగుంటాయి.
అనుష్ఠించిన వాళ్ల
కబుర్లూ బాగుంటాయి.
అందుకోబోయే వారి
ఆశలూ, ఆకాంక్షలూ బాగుంటాయి.
కానీ చేతల్లోకి
అనువదితమవ్వాలి కదా!

మధ్యదళారులు
బస్తాలు మాయం చేసి
రాస్తాలు తమ దిక్కు తిప్పేసి
కిలో బియ్యాన్ని పొలోమంటూ
తమ ఖాతాల్లోకి ఒంపేసి,
నల్లబజారుల్లోనో,
అసలు అంగళ్లలోనో
తిరిగి తామే అమ్మేసి,
దీనజనోద్ధరణ ఫోజు పెడితే మాత్రం
కాగితాలు
కళకళలాడతాయేమో గానీ,
జీవితాలు వెలవెలబోతాయి.
ఎక్కడ వేసిన గొంగళ్లు అక్కడేగా
ఎదలు విలవిలలాడతాయి.

ప్రార్థించే పెదవుల కన్నా
పనిచేసే చేతులు గొప్పవి.
నాటకాలేవయినా
అన్ని వేళలా నప్పనివి.

మంచి పనులంటే
వట్టి మాటలుగా చెప్పనివి.
సంక్షేమమే తప్ప
స్వార్థం ముసుగు కప్పనివి.
వట్టిమాటలు కట్టిపెట్టి,
గట్టిమేల్ తలపెట్టినప్పుడు
తలోమాటా అనడమూ మామూలే.

పనులంటూ సజావుగా సాగితే-
ప్రతిపక్షమూ మేలే.
"అమ్మా పెట్టా పెట్టదు
అడక్కు తినానివ్వదు" అన్నట్లు
అవిశ్వాసాన్ని అంగరఖాగా ధరిస్తే
అడుగులుంగీ జారిపోవచ్చు!
నగ్నసత్యాలు బయట పెడతామని
ఉద్విగ్నపరచిన సభలో-
తామే దిగజారిపోనూ వచ్చు.

ఎవరు పేద వెంటో
ఎవరు పదవి వెంటో
ఏది నీటి రాతో
ఏది నీతి జాతో
ఏది పెదవి మాటో
ఏది మేలు బాటో
ఏది కడుపు మంటో
ఏది తుడుపు కంటో
ఎరిగినవారు జనమే.
ఎంత ఆడిస్తున్నా ధనమే
ఎగసివస్తుంది ప్రభంజనమే!

ఎంతో అక్కర్లేదు!-
కాసింత ఆసరా చాలు.
కాసింత విశ్వాసం చాలు.
కాసింత కార్యాచరణ చాలు.
ధర్మానిది అయినా కుంటికాలు
నడక సాగుతూండడం చాలు.
గమ్యం చేరేందుకు వుంది వీలు

అవును!
ఒక్క రెండ్రూపాయలు చాలు.
కిలో బియ్యంతో-
నిరుపేదల కడుపు నిండే వీలు.
జనప్రథాన పథకం-
అందుకోగలదేమో జేజేలు.
మాజీలు, రాజీలు, ఖాజీలు ఇంక
కేవల రాజకీయాలైతే కుదేలు!
సామాన్యుడి ఆకలి
ఎలా తీరినా చాలు
ధర్మక్షేత్రే, కురుక్షేత్రే అదే పదివేలు!

***

***(10 ఏప్రిల్ 2008)***

# కాకి ఎంగిళ్లు

అంతా
మనను ఉద్ధరించేవాళ్లే!
నడిస్తే మనకేమిటట?
నడక కాదు చూసేది–
జనం 'నడత' చూస్తారు.

ఎండాకాలం
చెమట పట్టినట్లు
ఎన్నికల కాలంలో
నేతకు జనం పడతారు కాబోలు!
అధికారం రుమాలు దొరగ్గానే–
తుడిచేసుకోవడం మామూలే.

ఒక్కడంటే ఒక్కడున్నాడా?
గుడిసెలోనో, అద్దె ఇంట్లోనో కాదు,
కనీసం అపార్ట్‌మెంట్లో!
ప్రతి నేతా బంగళాదారుడే.
అపార్ట్‌మెంట్లున్నా– అదనాలే.

ఆస్తిలేని నాయకుడెవడు?
నాయకుడై–
ఆస్తి పోగేయని
ప్రజాప్రతినిధి ఎవడు?

పైకి బోలెడు కబుర్లు
అందరూ
మనను ఉద్ధరించేవాళ్లే!
అంతా మనకోసమే!
అందరిదీ ప్రజాపథమే!

ఎండలోనయినా
గిరిజన తండాలోనయినా
తమ నడక,
తమ తాపత్రయం,
జనం బాగుకోసమే!
పేద ప్రజా సంక్షేమం కోసమే!
"రక్తం చివరి బొట్టు వరకూ..."
అని ప్రతిజ్ఞలపై ప్రతిజ్ఞలు.



ఏ పార్టీ గర్జనలయినా,
ఏ ఊరేగింపులయినా,
నెట్టుకునేదీ, తిట్టుకునేదీ,
కొట్టుకునేదీ, మూగేదీ,

గొడవ ముదిరి గాయాలైతే-
రక్తం ఓడేదీ-
జనమే కదా.
అనుయాయులే కదా!
'అసలు వాడు'
కుశాలుగానే వుంటాడు.
పొరపాటున వేలుకోసుకున్నా-
నేత అయితే అది వార్త అవుతుంది.
కోసుకున్న వేలుకు
గుడ్డ చుట్టడం మాటేమోగానీ,
మీడియా బోలెడు చిలవలు పలవలూ
చుడుతుంది.
ఛానెల్స్ సమయాల
కడుపు నిండుతుంది.

తన గొడుగు క్రిందకు
జనాన్ని తెచ్చుకోవడం కోసమే-
వారి విహారాలు.
ఎండగట్టేది ప్రభుత్వాన్నవునో కాదో
తెలీదుగానీ- ఖచ్చితంగా
నిరీక్షణలో జనాన్ని,
బోలెడు ప్రజాధనాన్ని.

అధికారంలో వున్నప్పుడు
తప్పటడుగులు వేసి-
ఇప్పుడు నిరవధిక పాదయాత్రలు
ఎంత తమాషా!

ఒకడికి
చిన్నన్నే చెప్పాలా!
అన్నన్నా! ఆనాడే వివేకం తప్పాలా?
రైతు వెన్నెముక విరిచి
హెరిటేజ్ పెంచుకున్న ఏజ్
దాటివచ్చేశాకయినా తెలీదా
మరొకడికి.

సౌభ్రాతృత్వం మాటెత్తడు.
పరమతాన్నయినా దువ్వుతాడుగానీ,
అన్నదమ్ముల మధ్య సమైక్యత గిట్టదు.
విడదీసే ఓ సినిమా విలనీ కత.
ఆట- రాజీనామాల రాజకీయమైనా
అధికారం కోసమే!
ఎవరిల్లు వారిదైనంత మాత్రాన
ఒక ఊరిలో అన్నదమ్ములు
విడిపోయే బ్రతకాలా?
కుటుంబ కక్షలు రేపేవాడూ-
మనవాడే.
కానీ వట్టి స్వార్థపరుడు,
విడదీసి పాలించాలనుకునేవాడు.
తరతరాల బూజుకు
సరికొత్త నజరానాలెందుకు?

ఇతగాడి చేతిలో ఇదిగో-
ఎర్రజెండా ఉంటుంది.
ఉంటుందంటే ఉంటుంది.
రంగులు కలపడం ఇష్టం.
చరిత్రకారుడు కాదుగానీ-
విచిత్ర చిత్రకారుడౌతాడు.
ఎరుపు పసుపు కలవచ్చు.
ఎరుపు గులాబీ కలవచ్చు.

ఎరుపు వేసే చరుపు–
'చిరు' మొగ్గలే తొడగచ్చు.
అరచేతి వాటంలోనే–
ఎరుపు గోరిం'టాక్' పండచ్చు!

అందరూ మనల్ని ఉద్ధరించేవాళ్లే!
వాళ్లు, వాళ్ల పొత్తులూ,
వాళ్ల జిత్తులూ, ఎత్తులూ పై ఎత్తులూ
అంతా మనకోసమే అంటారు.
"నీకోసమె నే జీవించునదీ..."
అని ప్రజా విరహ గీతాలాలపిస్తారు.

లోకులు కాకులే.
నిజమే! కాకి నోట్లో–
'బ్యాలెట్' అనే రొట్టెముక్క వుంది.
కాకులు ఎక్కడెక్కడ
వాలినా, ఉన్నా,
రొట్టెముక్కల కోసం
నక్కలక్కడ చేరి,
చెక్క భజనలు చేస్తాయి.
పొగిడి ఉబ్బితబ్బిబ్బు చేస్తాయి.
కాకి గూట్లో కోకిల దూరి తన గుడ్లెట్టి
మోసం చేస్తోందని
తాము రక్షణకై వచ్చామంటాయి.
పంచమ స్వరాలనూ
మళ్లీ పసందుగా దువ్వుతాయి.

కాకుల కన్నా ఎక్కువగా
నక్కలు ఊళలతో 'కాకిగోల' చేస్తాయి
'కావ్ కావ్' అని అరుస్తున్నది
తమ రక్షణకై కాకులు కాదు,
కాకుల రక్షణకై వాలామంటున్న
రాజకీయ జంబుక తతిదే!
మృగ సంతతిదే!

సంక్షేమ పిండాలతో–
కాకులను ఆకర్షించి,
వాటి నోటి బ్యాలెట్ రొట్టెముక్క
తాము కాజేసి
ఆనక సింహాసనాలపై
గ్రామ సింహాలూ కూచోవచ్చు.

పక్షి కోసం వలలు
వేయడమే రాజకీయం.
సమష్టిగా కాకులయినా సరే–
వలకు చిక్కక ఎగరేసుకుపోతేనే
ప్రజాస్వామ్యం.
ప్రభుత్వాలు ఏవయినా
'కాకి ఎంగిళ్లు'
అన్నది మాత్రం నిజం.

***

***(10 ఏప్రిల్ 2008)***

# గ్యాసు ఫూల్స్ పేరడీ

జడలో మల్లెపూల జవ్వనులు
కనిపించడం లేదు
పువ్వులన్నీ దండలై
పనికిమాలిన నేతల
కంఠసీమల్లో ఉరేసుకుంటున్నాయి




కొత్త 'పుష్పవిలాపం' రాసే
కరుణశ్రీలెవ్వరూ
కనిపించడం లేదు.
మృదుత్వాల చిహ్నం పూలు.
కోమలత్వానికి గుర్తు పూలు.
మంచి వాసనలు పంచేవి పూలు
కొమ్మల మీద నుంచి,
రెమ్మల మీదనుంచి,
జలజలా రాలినా
ఆవరించిన మేరా
అందాలొలకబోసేవి పూలు

పూల సౌందర్యంగానీ,
సౌకుమార్యంగానీ,
మంచిని పంచే పరిమళంగానీ,
ఒక్కటంటే ఒక్కటి లేని
నాయకుల కంఠసీమల్లో చేరి
కన్నీరెలా ఒలికిస్తున్నాయో పాపం,
కర్కశ హృదయుల కెలా
తెలుస్తుంది?
పూలు
'ఫూల్స్' చెంత 'పూల'వుతున్నాయి.
'పోల్స్' గురించి తప్ప
పూల గురించెవరూ
ఊసెత్తడం లేదు!
ఇంతలేసిగా
భగవంతునికైనా ఏనాడూ
భక్తితో ఇచ్చిన దాఖలా లేదే
గజమాలలు
మోయలేనంత బరువుతో
మెడలు వంచే దండలు.
కానీ తలవంచని వీరులు కదా!
తలవంపులు తెచ్చే పనులు చేసినా
తాము పూలహారాలు మోస్తారు.

అభిమానులు గంపలకొద్దీ తెచ్చి
అభిషేకించాలని ఆశిస్తారు.
దండలు వేయించుకునీ,
కైదండలు పట్టించుకునీ,
కైవారాలు చేయించుకునీ,
కేరింతలు కొట్టే నేతలు
ఇంతకీ పూలనేం చేసుకుంటారు?
పిచ్చా! వెర్రా? ఒక్కొక్కటిగా
వాళ్లు జనం చెవుల్లో పెట్టేది
వాటినే కదా!

అంతా గాలియే
భలే పోగేస్తారు సుమా!
ప్రయోగశాలలో హెచ్2ఓ
కనుక్కోవడానికి కూడా–
పరీక్షలు చేయాల్సిందే గానీ,
వీళ్లు–
గాలిమోటర్లెక్కి,
గాలిమాటలు చెప్పి,
బహుచక్కగా అంతా
గాలికి వదిలేయగలట్టి
పవమాన సుతులే!
ప్రజలు మాత్రం పాపం
ఎప్పటికీ అవమానగతులే!

అంతా సహజ వాయువే!
మనం నమ్మాలి.
గ్యాస్ ఉచితంగా ఇచ్చేస్తామంటే
'గ్యాస్' అని మనకు తెలియాలిగా!
పైపులైన్లతో పంపినీ
మాటేమో గానీ
మైకు హోర్లతో పంపినీ సత్యం!

వాగ్దానాల గ్యాస్ నింపి,
ప్రజల బెలూన్లను
ఆనందంతో ఎగిరేలా చేస్తున్నారు.
ఎన్నికల గాలివాటుకి–
ఎంత ఎత్తయినా ఎగరేయగలరు.
బుడగ ఎప్పుడో 'ఠప్పు'మంటుంది.
నిజం నిప్పుమంటగా
గుప్పుమంటుంది.
గ్యాస్ మండుతుంది!
గ్యాస్ కబురూ
ప్రజలు మండితే
లీకేజి సిలిండరై పేలుతుంది!
వాయువే కదా అని ఉపేక్షిస్తే
దావానలమవుతుంది.
గ్యాస్ నింపే నేతల
గాలి వాగ్దానాల సభ లీకేజీలకు
ప్రజలు అగ్గిపుల్లలయ్యే దెపుడో!

పువ్వులూ– గాలీ కలిస్తే
పరిమళాల పరివ్యాప్తి గానీ,
అసహజ పొత్తులకు
జిత్తులే తప్ప
సైద్ధాంతిక సత్తువలుండవు.
చిత్తంలో చిత్తుల విత్తులే.
పైపైని దువ్వే మాటల మత్తులే.
కనబడకుండా దూసే కత్తులే.
అసలుకి జరిగేవి–
వారివారి కసరత్తులే.
ఎవరికి, ఎప్పుడు, ఎవరు
ముద్దొచ్చి
ఎవరి చంక నెక్కుతారో తెలీదు

నిన్నటిదాకా శత్రువు
నేడు పరమాప్తమిత్రువు.
వామపక్షాలలోనూ వాలెక్కడో
'మా' మాట ఎక్కడో–
'మీకోసం' కలం పట్టి
ఆకాశపు దారివెంట
హడావుడిగ వెళిపోయే
అరుచుకుంటు వెళిపోయే
వారివెంట పొత్తెందుకో తెలీదు.
ఏ పార్టీ– పోటుగాళ్లెవరనుకుని
భేటీ వేస్తుందో తెలీదు.
ఎక్కడ, ఎందుకు, ఎలా
పోటీ చేస్తుందో తెలీదు.

పూలూ– గాలీ
దయా– జాలీ
అన్నీ ఎందుకు గానీ,
అందరూ విరమించుకుని
రాజీనామాలు చేసినవారికే
ఆ సీట్లన్నీ వదిలేస్తే
ముంచుకుపోయేదీ,
ముందుకు వచ్చేదీ ఏమన్నా వుందా?
ఉప ఎన్నికల ఫలితాలు
దేనికీ రెఫరెండం కానట్లయితే
గ్రీష్మ కాలాన
ఇంత 'కాక' ఎందుకు?
జరిగేమాటేమీ కాదు గానీ–
ఇది లాహిరియే!
ఇది గారడియే!
ప్రజల చెవుల్లో పూలెట్టే–
రాజకీయ ఆరడియే!
అన్నిటికీ అంతా 'ఢీ'యే.
సరేకానీండి–
ఉప ఎన్నికలన్నా
కానున్నది కాక మానదు
కాలం ఎప్పుడూ గెట్ రెడీయే!
శ్రమశక్తికి ఒక వృధా పేరడీయే!

***

***(1 మే 2008)***

# పరుగు

పెద్ద పెద్ద అంగల
నడకకు ఫాస్ట్ ఫార్వర్డ్.
దూరాన్ని అధిగమించడానికి
కాలానికి దోహదపడే
పుంజీభూత పాదాలశక్తి.
అందుకోవాల్సినదేదో
అంతలోనే దాటిపోకుండా-
చేరువై చెంగలించడానికి
మనఃప్రేరణా క్రియ.
భయానికో,
తప్పిదాన్నుంచి తప్పించుకుందుకో
మటుకే కాదు-
ఆత్మవిశ్వాసానికీ,
శారీరక పటుత్వ పరీక్షకూ
ప్రతిబింబ ప్రక్రియ.

అవును!
పరుగు-
ఆచరణలో కొంత మేరకైనా
అనువదించుకున్న
మనోవేగం,
అది పిక్క బలం.
పడక కాదు,
నడకకు ద్విగుణీకృత
వేగవత్ పాదయుగళం.
ఎవరు, ఎవరిని, ఎందుకు
పరిగెత్తమంటారు?
ఎవరు, ఎందుకు, ఎప్పుడు, ఎలా
పరిగెత్తుతారు!

నిలబడి నీరు త్రాగమన్న
సంస్కృతే కానీ-
పరుగెత్తి పాలు తాగమన్న
ఫణితి మనది కానే కాదు.



దొంగలను పట్టుకునేందుకు
పరుగులే అవసరమా!
దొంగతనం చేసి పారిపోయే
కాలమా ఇది?
నేరస్తుడు తాపీగా, దర్జాగా
సంఘంలో చెలామణి
అయిపోతూ-
చట్టాలపైనే పట్టు చెలాయిస్తున్న
చిత్రవిచిత్ర కాలం.

అవినీతి, అక్రమార్జనం,
మానభంగం, హత్య, నేరం
ఏది చేసినా–
మహా అయితే ఓ ముసుగు తప్ప
మీడియాలోనూ
బోలెడు ప్రచారమేనాయె!
మంచి చేసినవాడికన్నా
ముంచిన వాడితోనే–
పరిచయాలు, ఇంటర్వ్యూలు,
పదేపదే దృశ్యమాలికలు.
నేరాలు, ఘోరాలు చేసినవారు
పారిపోతున్నట్లు లేరు–
వారితో టీవీ కవరేజీలకై
వారి వెంట
మీడియాయే
పరుగు పెడుతోంది.
అనుక్షణ దృశ్యమాలికలకై
ఆపసోపాలు పడుతోంది.
ఇంకా దొంగలను పట్టే
శిక్షణ కోసం అన్నట్లు–
కానిస్టేబుళ్ల ఎంపికకై
అభ్యర్థుల పరుగు పందేలా?
అందునా మండుటెండలో
కిలోమీటర్ల కొద్దీ
శారీరక బలపరీక్షలంటూ
పరుగులెత్తించడాలా?

నిజమే!
పరుగు ప్రాణాలు తీస్తుంది,
జాగింగుల కన్నా
బ్రిస్క్ వాకింగులే చేయమని
డాక్టర్లే చెబుతున్నారు.
పరుగులెప్పుడూ సుఖాలు కాదు,
పైగా ప్రాణాంతకాలు.
తప్పిపోతుందని బస్సునో, రైలునో
అందుకోవాలని పెట్టే పరుగు–
ఆ ప్రయాణ సాధనం క్రిందనే పడి
వికలాంగుడిని చేసిన
ఘటనలున్నాయి,
ప్రాణాలే తీసిన సంఘటనలున్నాయి.
వేగం ఎప్పుడూ ప్రమాదమే
నిదానమే ప్రధానం.
'తాబేలు– కుందేలు' కథ లేదూ!
'ఆరడుగుల నేల' కథ లేదూ!
అన్ని చెప్పేదీ ఒకటే–
'అతి సర్వత్ర వర్జయేత్'
అందునా వేగం మరీను.
నిన్ను నీవు
నియంత్రించుకోవడమంటే
నీ పరుగులు నువ్వాపుకోవడమే.
ప్రణాళికలు లేనివాడే–
పరుగులెత్తుతాడు.
కాలావధులకు కట్టుబడక
తాత్సారం చేసేవాడే,
అలసుడే, బద్ధకస్తుడే,
ఆఖరి నిముషంలో పరుగులుపెట్టి
ఆందోళన పడతాడు.
బ్రతుకు అతలాకుతలం
చేసుకుంటాడు.

మనిషిని తరుముతున్న
పులిపిల్లతో
తల్లి పులి అన్నట్లుగా–

"తినే తిండితో ఆ ఆటలేమిటి
పరుగులేమిటి"
అన్నట్లే వుంది బుష్షుగారి
ఉస్సురుస్సుల రుసరుసలు!

చుక్కల వైపు పరిగెడుతున్న
ఆహారధాన్యాల ధరలకు
మధ్యతరగతి భారతీయులను
హేతువు చేయడం–
వేటగాడు తన లక్ష్యమే
'తనకే' గురిపెట్టబడిందనడమే.

తన వ్యాపార నిమిత్తం
పిజ్జాలు, బర్గర్ల జంక్‌ఫుడ్డును
మనమీద రుద్దుతూ–
ధరల పెరుగుదలకు
మన అవసరాల పరుగులే
హేతువని నిందించడం–

ఒబేసిటీ బలిసిన దేశాల
గుత్తపెత్తందారీ అహంకారం తప్ప
మరేదీ కారణం కాదు.
ఒక్కటి మాత్రం నిజం!
సంతృప్తుల స్థితప్రజ్ఞత లేక,
మానవీయ విలువల
మధురాలింగనాలు లేక,
తనతనంతో తాను నిలబడక,
ఆశల అంగలు వడివడి చేసి
కీర్తి, వ్యామోహాలకై
అంగలార్చుతూ
డబ్బు వెనుక మనిషి
'పరుగు' పెడుతున్నంత కాలం–
మృత్యువే మన కంఠ కరవాలం.
బ్రతుకు కాలేదు
ప్రశాంతికి ఆలవాలం.

***

*(8 మే 2008)*

# శాంతి శ్వాస

రాక్షసుడి ప్రాణాలు
రామచిలుకలో వున్నట్లు
ఫ్యాక్షనిస్టు ప్రాణాలు
ఫ్యాక్షనిజంలోనే ఉంటాయి



ప్రేమ ప్రేమను ప్రేమిస్తుందో లేదో
తెలియదుగానీ
ప్రాణం తీసిన
ప్రాణం ప్రాణాన్ని
ప్రాణమే తీస్తుంది

కత్తులు కటార్లు కొడవళ్లు
సుమోలు, లారీలు
యమపాశ రూపాల్లో
వెంటాడుతూనే వుంటాయి
సత్యం వధ
ధరం చెఱ
పగ, ద్వేషం, ప్రతీకారం
సంచరిస్తూంటాయి చరచరా
కారణాలు అడగద్దు
శాఖోపశాఖలుగా ఎదిగి
వెళ్లూనుకుంటున్న
సారాభూమి
విసిగివేసారా భూమి
పవనంగా వీచేది పగ
మబ్బై వర్షించేది మారణహోమం
రక్తం సూర్యుడై ఉదయిస్తాడంటుంది
చీకటి వ్యూహాలతో
చంద్రుడు వెన్నెల బాంబుగా
కళలతో నిత్యం వర్ధిల్లుతుంటాడు

ఔను
వెన్నెల పేలుతుంది
వేటకొడవలి పైట చాటునుండీ
పైబడవచ్చు
ఇక్కడి చానల చూపులూ
చురకత్తులే
మృత్యుభయం పూసేది
గుత్తులు గుత్తులే

ప్రవాహం
రుధిర ధారలది
కర్తవ్యం అసిధారలది
కాష్ఠంలో బూడిదలోంచే
కార్పణ్యం బూమెరాంగ్ అవుతుంది
మళ్ళీమళ్ళీ కథ
బ్రతుకు వ్యధనే రచిస్తుంది

అంతా తెలుసు
అక్కర్లేదనీ తెలుసు
అమానుషమనీ తెలుసు
అనుక్షణం భయద జీవనమనీ
తెలుసు.
అయినా మృత్యు కేదారంలోనే
విద్వేష జీవి సుమించుట చూస్తాం

కోరుకున్న బ్రతుకు కాదంటూనే
కూరుకుపోవడం అలవాటు
సంధిప్రయత్నాల్లోనూ
సవాలే ఎదురవుతుంది
ఆయుధం ఎదుటివాడే
ముందు త్యజించాలని ఆంక్ష
శాంతికి తాను ముందడుగు వేస్తే
శత్రువుకు లోకువైపోతాననేదే
తిరగతోడుకునే కక్ష.
అవును ఏదీ రక్ష?
చట్టమూ, న్యాయమూ, పోలీసూ
అంతా ఫ్యాక్షనిజం దందాలే
పోషించుకునే పటాలమంతా
ఆర్థిక అసమానతల చందాలే
అంతా బృందాలు బృందాలే

అయినా ప్రాణాలు
ఏ వ్యక్తిది ఎప్పుడు గాల్లో కలిసేది
అనుమానాస్పదాలే

ఆకులే బాకులుగా
కొమ్మలే కొడవళ్లుగా
పువ్వులే
అంటుకున్న బాంబు వత్తిరవ్వలుగా
ప్రతి చెట్టూ
ఒక ఫ్యాక్షనిస్టులానే తోస్తుంది
గాలీ, నీరూ, నేలా
అంతా భయదగ్రస్తమై వుంటుంది.

పార్టీలు
రాజకీయాలు
పదవులూ, అధికారాలూ
అన్నీ హింసగొడుగుక్రిందే
అనుక్షణం బుసకొట్టే
పగాద్వేషాల పాముపడగ క్రిందే
జోలపాటలో చావుపాట విన్పించే
ఎదుగుదల
కనబడని కత్తి ఏదో తెగేసేందుకు
పైన వ్రేలాడుతుండే తల
కొడవలి వేటుకు కొడుకో
బాంబుదాడికి భర్తో
బలి అయిపోయాక
కన్నీళ్లలోనూ రగిలే అగ్నిసెగలు
దిగుల్లోంచి పెగిలే పగలు
కాలాన్ని కత్తుల బోనులా
కట్టుకునే మనుగడ కోట
ఒంటిస్తంభంమేడలోనైనా

ఒంటికి ఇంటికి
కంటికి మింటికి
ఏకధారగా భయదజీవనం
ఏ రాత్రీ నిద్ర ఉండదు
ఏ పగలూ పగలు తగ్గవు

'కప్పట్రాళ్లు'
ఎన్నో బ్రతుకుతాళ్లు
వాళ్లు ఒకళ్లుకాదు
వాళ్లూ వాళ్లూ ఒకళ్లు కాదు
కత్తినూరడం ఆగే క్షణం ఉండదు
చిరంజీవి కాకుండా చితిమండదు

సీమ– మృత్యుహారం తెగి
కంఠసీమ– శాంతిహారం
ఎప్పటికో తెలీదు.

ఒక ప్రాంతాన్ని ఫ్యాక్షనిజం నేలగా
మరింత విధ్వంస చిత్రాలను
ధనాధిపత్య ధ్వజం కోసం
రూపొందించే స్థితికి
అంతిమ గీతం ఎప్పుడో తెలీదు.

కప్పలు, రాళ్లు
అన్నంత సహజంగా
'కప్పట్రాళ్ల' లాంటి బతుకులు
ప్రకృతి బీభత్సంగా
స్థిరపడకుండా
రక్షించే ప్రభుత ఏర్పడాలనేదే ఆశ
మానవత్వం కోసమే మనిషి శ్వాస
***
***(22 మే 2008)***

# ఓ పువ్వు పూసింది!?

ఉత్తర భారతం తప్ప
దక్షిణాది మొన్నటి వరకూ
తనకు ఎడారియే!
దాక్షిణాత్యులే నిజానికి
పూలప్రేమికులు.
కొప్పుల్లో మూరలు మూరలుగా
ముడుచుకునే ముదితలు
ఉత్తరాదిన తక్కువే.
అయినా విచిత్రం!
ఏ పూవూ దక్షిణాదిన ఇంతదాకా
రాజకీయ శిరోధార్యం కాలేదు.

“ఇదేమి లాహిరి
అదేమి గారడి
ఎడారిలోన పూవు పూచి
ఎంత సందడి!!”
ఎడారి యెడ్యూరప్పతో
అధికార పుష్పవనం అవుతోంది.
కర్ణాటకంలో
కమల వికసనంతో
ఔను!
దక్షిణ భారతంలో తొలిసారిగా
ప్రభుత శాఖకు
ఓ పువ్వు పూసింది
కమలం వికసించింది.
ఏ జపాలు, ఏ తపాలు
ఆతపాలు ఏవయితేనేం?
‘భాజాపా’ పరిమళించింది.

వంచనకు ఓ గుణపాఠంగా,
నమ్మకద్రోహానికి ఆశనిపాతంగా,
మాటతప్పిన తనానికి వేటుగా,
సానుభూతితో తడిసి
వ్యతిరేకత ఎరువులు కలిసి
పెత్తనం మార్పుకు విత్తనం పడి



ఎదిగి వచ్చిన ఎన్నికల వృక్షానికి
వర్ణభరితంగా,
సువాసనా జనితంగా,
ఓ పువ్వు పూసింది
దక్షిణలూ, ప్రదక్షణలూ
ఏవీ, ఏవయినా
ఎవరెవరివి, ఎలాగయినా
ఎలాగయితేనేం!?
ఓ పువ్వు పూసింది.

"కమలాక్షునర్పించు
కరములు కరములు"
కాక తప్పని హస్తాలిప్పుడు
కర్ణాటకలో,
జెడిఎస్ జెడ్డిసలహాలతో
జడవేయ బూనిన
జడత్వానికి ఆసరాగా
చెయ్యి అడ్డుపెడితే,
చేసిన 'చెయ్యి'దాలకు
చెంగలించిన చైతన్య దళం.
ఎలుగెత్తిన మార్పు గళం.
తారుమారయిన ప్రజాబలం
ఎడారనుకున్న ఎదపై ఇదిగో
ఓ పువ్వు పూసింది.
కమలం వికసించింది.

పువ్వు అస్తిత్వం వికసించిన నవ్వు.
హృదయంలోని
'సెంటిమెంట్' రువ్వు.
అమ్మాయి జడలో,
ఆలయం దేవుని అర్చనలో,
అతి మనోహరంగా,
స్నిగ్ధ సుందరంగా భాసించే
పువ్వు
ఎంత సున్నితమో,
ఎంత నాజూకో,
ఎంత పరిమళమో,
ఎంత దళితమో,
అంత శరసంధాన సదృశం.
సుమశరముల బారికి
సంచలించని యతులెవ్వరు?
నియతులేమిటి?

పూలలోనూ మంటలుంటాయి.
పూలలోనూ విషాలుంటాయి.
పూలలోనూ తమాషాలుంటాయి.
పుష్ప వికాసాలే కాదు
'పుష్ప విలాపాలూ' వుంటాయి.
"ఓహో గులాబి బాలా
అందాల ప్రేమమాలా"
అని పాడుకోవాలని వున్నా
"గులాబీలు పూచే వేళా
ముళ్లుంటయ్ చూసుకో
గెలుపంటే మజా కాదులే
ఊహించుకో"
అని హెచ్చరిక నినదిస్తుంది.

నిజమే! కత్తులు, ఖడ్గాలు
తుపాకులు, తూటాలు
అక్షరాలపైనే ఆయుధాలు
అవిశ్రాంతంగా ఎక్కుపెడుతున్న
అసహన, అసహజ కాలాన
చేతుల పిడిగుద్దులు
సైకిల్ చైన్ల హింసాన్యాసాలు,
చెలరేగిపోతున్న కాలాన
విజిల్ వేసి నియంత్రించే,
అస్తవ్యస్త రాజకీయ ట్రాఫిక్‌ను
క్రమబద్ధీకరించే,
మార్పు ఏదన్నా సంభవిస్తుందా?
'పూవు వలే విరబూయవలే'
అని సుతిమెత్తని హృదయం పువ్వై
కర్కశ అధికార రాజకీయాన్ని
హస్తగతం చేసుకోగలుగుతుందా?

కాళోజీ అన్నట్లు
“ఉదయం కానే కాదనుకోవడం
నిరాశ.
ఉదయించి అలానే
ఉంటుందనుకోవడం దురాశ”
ఆశ ఒక పువ్వు.
ఆలోచనలు మొగ్గ తొడిగినప్పుడు
ఆచరణ పువ్వు కాకపోదు.
మధ్యలోనే త్రుంచేసే, త్రెంచేసే
కుట్రలు, కుయుక్తులను
ఓ కంట కనిపెడుతూ
ముల్లుని ముల్లుతోనే కాదు,
నిజాయితీ హృదయపు జల్లుతోనూ
నెట్టి వేయగలిగినప్పుడు
చిత్తశుద్ధి మొత్తంగా హత్తుకున్నప్పుడు,
వ్యవస్థ ఎంత ఎడారి అయినా
విశ్వాసం కుసుమించి
విజేత అంటాడు
‘ఓ పువ్వు పూసింది.’

***

*(29 మే 2008)*

# ఆయుధం

చక్షురక్షర సంయోగంతోనే
మేథో హృదయ సంచలనం.
ఒక చైతన్య స్పందనం,
అనుభూతి స్యందనం.

అక్షరం మాటకు లిపి.
అక్షరం భాషకు ఆకృతి.
అక్షరం ఆలోచనల దర్పణం.
అక్షరం
అభిప్రాయాలను ఆవాహన చేసి,
మంత్రించి వదిలిన తర్పణం.




మాటయినా
గాలిలో కలుస్తుంది గానీ
అక్షరం అక్షరమే!
అక్షరం ఆయుధమే!
ట్రిగ్గరు మీద వేలుంచాక
నిర్ణయించుకోవాల్సింది
నొక్కేముందే.

అక్షరం ఆయుధమే,
ఆయుధం వుందని,
ఆయుధానికి లైసెన్సు వుందని,
అయిన దానికీ కాని దానికీ
దుందుడుకుగా ప్రయోగిస్తే
పిచ్చుకల మీదకూ
బ్రహ్మాస్త్రాలు సంధిస్తే
ఘోర తపస్సు చేసి సాధించిన
శక్తిని
క్షణికావేశాలకు శాపంగా వెదజల్లిన
కమండల జలంతో కోల్పోయినట్లే.
ఆయుధం వుండడం గొప్పకాదు,
ఆయుధ విన్నాణం తెలియాలి.
ప్రయోగించే ఒడుపూ,
ప్రయుక్తమయ్యే లక్ష్యమూ
తెలియాలి.

దేవుళ్లుగా
ఆయుధ ధారులను కొలిచేది
ప్రసన్నులై భక్తులను రక్షిస్తారనే.
భక్తుడి మీదే అకారణంగా
కత్తిదూసేవాడు
భగవంతుడెలా అవుతాడు.
అక్షరం
ఏకలవ్యుడి చిటికెన వ్రేలు కోరదు.
అక్షరం
శంభూకుడిని వధించదు.
అక్షరం భగవంతుడినే నియంత్రించే
మహిమాన్వితం.

దైవిక శక్తి అయినా
అక్షరబీజాల నుంచి మొలిచేదే.
దుష్టశక్తి అయినా
బీజాక్షరాలతో సంహరింపబడేదే.

మాటే మంత్రము.
మంత్రం అక్షర యంత్రం.
అక్షరమైన మాట గొప్పది.
సత్యం బ్రూయాత్
ప్రియంబ్రూయాత్
నబ్రూయాత్
సత్యమప్రియం
అప్రియమైన నిష్ఠుర సత్యాలైనా
గాలిలో కలిసిపోయే
మాటగానైనా వద్దన్నప్పుడు,
గాయాలు చేసే ఆయుధాలుగా
ఏ ప్రయోజనాల కోసం
అక్షరాలను సంధించడం?
కలం చేతిలో వుందని,
అదే నా ఆయుధమని,
చీటికీ మాటికీ
శంఖాలు పూరించి,
చక్ర ప్రయోగాలు చేసే
సంచలన యుద్ధోన్మాదమూ
సహేతుకం కాదు.

రాయబార సందేశ ఘట్టంలో
మంచిచెడులనూ,
ముందు పర్యవసానాలనూ,
వివరించబోయిన
జ్యోతి స్వరూపుడిపై
బంధించి
దాడి చేయాలనుకోవడమూ
అవివేకమే!

అక్షరాల విశ్వరూపాన్ని
అరుదుగానే ప్రదర్శిస్తాడు సూత్రధారి.
ఆయుధమున్ ధరియింపనయ్య
అంటూనే
యుద్ధాన్ని నడిపించగలుగుతాడు.
ఆయుధం
అక్షర యోధులందరిదీ.
కానీ శాపగ్రస్త కర్ణులూ వుంటారు.
శిఖండులూ వుంటారు.
అశ్వత్థామహతః కుంజరః
అనే యుక్తిగత ధర్మజులూ వుంటారు.
అస్త్రసన్యాసం చేసేది
పిరికివాడేకాదు
గీతాబోధకు ముందు
అర్జునుడి విషాద యోగమూ
వివేచించదగిందే.

యుద్ధం యుద్ధమే
అక్షరాయుధంతోనైనా,
ఎన్నికల పోరాటంలో
ఓటు ఆయుధంతోనైనా,
యుద్ధంలో దిగాక
ఆయుధానికి వెరచి లాభం లేదు.
యుద్ధ హేతువు
తానేనని వగచీ లాభంలేదు
మడమ తిప్పని వీరుడు
మడుగులో దాగడు.

నన్నోడి తన్నోడినా,
తన్నోడి నన్నోడినా
అన్న తర్కానికి
ఇదేమీ మాయాజూదం కాదు.
కోరి ఆహ్వానించాక
జయాపజయాలు
శిరోధార్యాలూ కావలసిందే!
చేసేది ధర్మయుద్ధం అయినప్పుడు
అస్త్ర సన్యాసం చేయాల్సింది
శత్రువయితే కావచ్చు గానీ,
నువ్వు కాదు.
రాజీనామా
ఆయుధం కాజాలదు.

అయిన దానికీ కానిదానికీ
అవతలి వాడిని గాయపరిచేలా
అక్షరం చెక్కడమూ
ఆయుధ విన్నాణం కాజాలదు.

ఆయుధం వుందని
అవతలివాడిని
శత్రువుని చేసుకోవడం
తప్పు
దుష్టశిక్షణ
శిష్టరక్షణకూ
ఆయుధం వుందని చెప్పు.
చతుర్భుజాల్లో ఆయుధాలతో
ఫోర్త్ ఎస్టేట్ శక్తివంతమైనదే.
కృపాకటాక్ష వీక్షణాలతో,
ఆపన్న హస్తంతో,
దీన జనరక్షణంతో,
ఆయుధ ధారియే అయినా
జనజీవన సూత్రధారి వందనీయుడు.
అతగాడే దేవుడు.

***

***(5 జూన్ 2008)***

# స్వదేహీ మారకద్రవం

ద్రవ్యం యావత్తు లోపించి
ఎన్నికల్లో ఏరులై పారాలి–
వట్టి మాటలు ఎవరిక్కావాలి?
'ఇంగ్లీషులో మాటాడుకోవడం'
అంటే–
ఇప్పసారా అయినా ఇప్పించడమే.

ఎంత ఖర్చు!
అంత కంతా– రెట్టింపు ముంత
పిచ్చివాళ్లా వట్టినే పంచడానికి
పోయిస్తేనేకదా వేయించేది.
వేయించాక ఇంకెట్లా మూయించేది?

అద్భుతమైన పాట–
కోయిల గొంతు కాదు. కోటి కోటి
కొనుగోలు గొంతు.
గాంధీ సెంటినరీ హాల్లోనే తంతు.
సిగ్గు, లజ్జ, మానం
అన్నీ వదిలితేనే కదా స్వేచ్ఛ!
స్వేచ్ఛా స్వాతంత్ర్యాలే కదా–
సమాజం కోరుతున్నది.
తినకపోతేనేం– త్రాగు!
త్రాగి త్రాగి తెగవాగు!
ఎంత వాక్స్వాతంత్రం!
వందేమాతరం అనకపోయినా
'మందే'మాతరం అనగలం!

తాగితే మరిచిపోడు కదా ఓటరు–
తాగి ఓటేస్తాడు.
మందునీ, నోటునీ వాటేస్తాడు.
పాడు పాడు–
అబ్కారీ!
కోటి కోటి అయితేనేం,



రాబోతోంది ఎన్నికలబోటి.
ముందస్తు జాగ్రత్త!
'మందు' అస్తు, జాగురూత–!
వాగ్దానాలకేం ఎన్నయినా చేయచ్చు.

ఫైలు మీద తొలి సంతకం చేస్తేనేం
తర్వాత 'ఫైలే' మూసేయచ్చు.
అవసరం మనదయినప్పుడు–
మందయినప్పుడు
అంతా సబబే.
అవతలివాడు సంపదనంతా
'స్ట్రా' వేసుకు తాగేస్తున్నాడనే కదా–
స్ట్రాంగు దుగ్ధ!
పానం రోజా ముగ్ధ.
గులాబీ వాడితేనేం–
ద్రాక్ష రాలితేనేం–
ఎందులో నుంచయినా పిండచ్చు.
ద్రవ్యం యావత్తు లోపించక తప్పదు!
తాగితే కదా మొగుడికి
తన్నడానికి అంత ధైర్యం!
తాగినోడితో తెగబడేకంటే–
తానూ ఓ ముంత పుచ్చుకుంటే పోలే!
ఆడాళ్లూ మందు కొడతారు.
కల్లు తాగిన 'నారినీ' చూడచ్చు.
త్రాగడం ఓ గొప్ప ధైర్యం.
అదీ సమర్థింపుల స్థైర్యం!

పైకి అన్నీ గాంధీ కబుర్లు.
లోన అన్నీ బ్రాందీ బజార్లు.
'బార్ బార్ దేఖో హజార్‌బార్ దేఖో...'
బడిలేకున్నా బారులేని ఊరులేదు
ప్రభుత్వ ఖజానాకి
ద్రవ్యం యావత్తూ ద్రవమే!
యావత్తూ సంపదకోసమే.
మత్తు గమ్మత్తు కోసమే
రాజకీయమైనా చిత్తే
పోటీబడి పాట పాడ–
టెండర్ల వెండర్లు
ఎవడురా అడ్డం వచ్చేది
ఈడ్చి పారేయండి
కాదంటే కాల్చిపారేయండి!
రాత్రికి ఎలాగూ గ్లాసుల ముందూ,
వీలయితే
ఆగ్రహం అందాలను ఆరబోసిన
ఆమెల పొందూ, అంతా పసందు
అద్భుత రాజకీయం విందు.
నినదించి నినదించి నీరసపడ్డాక
రాత్రి మందు కొట్టి
పడుక్కోవడమేగా–
ఏముంది తెలియని సందు?

'సాధనమున' పనులు
సమకూరు ధరలోన అంటే–
తోటీ, ధనముతోటీ అని అర్థం.
'రా' కొట్టేసాడు కాబట్టి
మరీ మత్తెక్కి, మొదట్లో
ఎత్తుకోవడంతోనే జారి
బొత్తు నోట్లు చేరి
'సాధనమున' అని
సమాసం వచ్చింది
స్వారస్యం సంగతి ఎలా వున్నా
సారా రసం వచ్చింది
ముంచెత్తేది మందే!
"సారానామ నరస్యరూపమధికం
ప్రచ్ఛన్నగుప్తం ధనం
సారా గురూణాం గురుః
సారాభోగకరీ, యశస్సుఖకరీ

సారా బంధుజనే, విదేశగమనే
సారా పరాదేవతా" అదీ శ్లోకం!
సారా విహీనుడే మరి
రాజకీయ దృష్టిలో పశువు.
పశువుకు కుడితి త్రాగించినట్లు
సారాపట్టిస్తే-
'మనసారా' బోలెడు పనులైపోతాయి.

పైకి నీతిసూత్రాలు వల్లెవేసేవారు
అద్దే పల్లె అయినా, పట్టణమయినా,
శివుడయినా, నవీనుడయినా
మందుకొట్టే
మరో ప్రపంచాన్ని స్వప్నిస్తారు
ఇప్పుడు కవులు
గుర్తింపబడ్డ శాసనకర్తలు
సీసపద్యాలు రాయకపోతేనేం
సీసాలెత్తి తాగ్గలరు
సమాజ స్పృహ గురించి
సభల్లో వాగివాగి
సభ అయిపోయాక తాగితాగి
స్పృహకోల్పోగలరు
ఆదర్శాలు ఆ నోళ్ల వెలువడినవి
వేనోళ్ల పొగుడుతారు.
విమర్శకులూ త్రాగి చేరాలే కదా!

ప్రభుత్వానికి గొప్ప ఆదాయ వనరు
ఎన్ని కుటుంబాలు కూలితే
దానికేం?
దాని సీటు దానికి పదిలం.
ప్రతిపక్షంలో వున్నంతసేపు
'బంద్' చేయాలి
ప్రభుత్వం రావడానికి
'విందు' చేయాలి
వచ్చాక మందు లేనిదే
అడుగు ముందుకు పడదు
బెల్టుషాపుల బోల్టులు
తీయక మానరు
'మద్యనిషేధం' ఉద్యమంగా
మాత్రమే ఖరారు
ఆచరణలో ఆమడదూరం పరారు

నిజాయితీ, చిత్తశుద్ధీ బూడిదచేసి
మందులో కలుపుకుని తాగేసాక-
అంతా స్వదేహీ మారకద్రవం.
'మద్యపాన నిషేధం'-
ఊరేగిస్తున్న శవం.

***

*(19 జూన్ 2008)*

# శుభాకాంక్షల రెండు పాతికలు

ఇప్పటికీ నా స్వప్నాలలోనూ నడిచే
సాహచర్యం నీది.
బహుశా నీ మోకాళ్ల నొప్పులు
ఇంత షటిల్ సర్వీసు వల్లనేనేమో!
నీకెంత ఊతగా వున్నానో
నాకయితే తెలియదు.
నా జీవితపు
ప్రతి ఉషస్సుకూ రాణివై-
అనురాగ శాసనాన్ని
నా ఆకాంక్షల ప్రభుత్వం నెరపుతున్న
నెనరు నీది.
స్నేహలత లల్లుకోవాల్సిన గుండెకు
గాయాలు మాన్పి,
ఆశాకిరణ చికిత్సతో
ప్రాణశక్తులందించిన
ప్రణయమూర్తి నీవు.



అజంతా అన్నట్లు-
పొద్దున్న లేవగానే ఆ పాదాలను
ముద్దిడి
రోడ్డున పడినానంటే-
రోజంతా నిశ్చింతే!

పేపర్లు కుమ్మరించే రాజకీయం,
ఛానెల్స్ చిందే హింసా దృశ్యం.
సాయంత్ర సభల
సాంస్కృతిక కాలుష్యం
ఏవీ నన్ను బలహీనుడిని చేయవు.
నువ్వొక రక్షణ చక్రానివి.
నిజమే!
నాకు మిత్రులున్నారు.
(తెలియని శత్రువులూ వున్నారేమో)
చలింపచేసే క్షణాలూ,
చరింపచేసే గణాలూ,
ఎన్నున్నా, ఏవయినా-
నీ తలపుల ప్రభుత ముందు
తలవంచి నన్ను
నమస్కరించమంటాయి.
నీకు మనస్కరించని మనుగడ-
నాకెలా కాగల్గుతుంది ఏలుగడ?
ఎంత కల్లోల సంరంభం నుండి
ఎగసి పైకి లేచినా-
"నిద్రకు వెలియై నేనొంటరినై
చీకటిలోపల నా గదిలో...
నా గదిలోపల చీకటిలో
ఉంచనీయని నీవే- తలగడ
నవనీతం శాంతిమీగడ.

రికార్డుల ప్రకారం
చదువులూ, ఉద్యోగాల ప్రకారం
భిన్నప్రాంతాలు మనవి
అనుకోనవసరంలేని

ఏకత్రితం మనది.
సమైక్యం మనది.
రాజకీయాలు, భౌగోళికాలు
విడదీయగలవేమోగానీ
రాగాలు, అనురాగాలు,
ప్రేమలు, అభిమానాలు
మనలను ఒకటిగానే ఉంచగలవు.
వేర్పాటు
వైయక్తిక ఆత్మగౌరవాలకే కానీ–
పరస్పర సంఘర్షణలకు కాదు
తినే తిండికి కూడా ప్రాంతీయతను
ఆపాదించుకుని–
ఆహార విహారాలనూ
కలుషితం చేసుకునే
అమానవీయ సంబంధాల
నైజం ఎందుకు?

“పోలీసులదీ పత్రికలదీ కూడా
భార్యాభర్తల సంబంధం” అని
హోంమంత్రులు చమత్కరిస్తూంటే–
నిజమైన భార్యాభర్తల సంబంధంలో
వైస్ వర్సాగా–
ఎవరు పోలీసు ఎవరు పత్రిక
అని ప్రశ్న.
నీది సమాచార స్రవంతి అయితే–
నాది నిఘానా?
నాది అక్షరాయుధ విశృంఖల
స్వేచ్ఛ అయితే–
నను కట్టడి చేసేది నీవేనా!
కట్టుబాట్లు ఏవయినా మనకోసమే.
సంఘటిత సహజీవన
సుఖశాంతుల కోసమే.

ఎవరు ఏమనుకోనీ–
బాంధవ్య బంధంలో
విశ్వాసం ముఖ్యం.
మనల్ని విడివిడిగా
ప్రేమించేవారెందరున్నా.
మనిద్దరి ప్రేమలో
చొరబాటుదారులు
కానంతకాలం
మనకేమిటి పేచీ!
ఎందరిలో మనం వున్నా,
అందరిలో మనం వున్నా,
పరస్పరం మన హృదయాలు
అనురాగ సంధాయకమైనప్పుడు–
సంసారపక్షమే ఉదాత్త
కుటుంబ వ్యవస్థ.
ఉంటే ఉండనీగాక
ఊసెత్తనే ఎత్తదు విడాకుల అవస్థ.

చట్టాలు కాదు మనుషుల్ని కలిపేది
రాజకీయం కాదు వ్యవస్థను నిలిపేది
మానవ విలువల సంస్కారం,
హృదయానిదే అసలు పాలనం.
బుద్ధిదే అనుశాసనం.
మనుషుల్లో మార్పు, చైతన్యం రానిదే
ఏ ఉద్యమాలూ ఏమీ చేయలేవు.
ప్రభుత్వాలను పడగొట్టేదైనా,
నిలబెట్టేదయినా– ప్రజయే
ఏకత్రితం కాలేని ప్రజ
సంకీర్ణాలనే సంభవింపచేస్తుంటాయి.
కలివిడిగా కాక కట్టెమోపు
పుల్లలు పుల్లలుగా విడిపోతూ
దేనికదే తానే సువ్యవస్థను తెస్తాననీ

ఏకత్రితం కావిస్తాననీ
ఎగసిపడుతూ వుంటే-
ప్రత్యేక అస్తిత్వానికయినా
ప్రాణ ప్రతిష్ఠ జరిగేది ఎలా?
మిత్ర వైరుధ్యమో, శత్రు వైరుధ్యమో
తేల్చుకోలేనంత కాలం
ప్రతి తలా తననితానే ఎగరేసుకుంటే
అంతా రావణకాష్ఠమే! స్థితి మారదు-
సమస్య ఎప్పటికీ ఆరదు.
ప్రభుత్వానికిప్రజలా-
దాంపత్యానికి ప్రేమ.
ఇంతకీ చెప్పవచ్చేదేమిటంటే-
నువ్వే నా బిందువు.
నీ చుట్టూతానే నా పరివృత్తం.
"ఢిల్లీకి రాజయినా
ఓ తల్లికి కొడుకునే"లా-
'లోకానికి రాజునైన నీ
ప్రేమకు దాసుడిని'.
ఆదమరిచి కాదు-
ఆలోచించి మరీ అనగలను.
అని మరీమరీ మనగలను.

నా సంస్కృతీ, నా సాహిత్యమూ,
నా రాజకీయమూ- సంసారాలుగా
వెరసి సమస్త జీవితమూ-
సహధర్మచారిణితోనే అయినప్పుడు-
కల్లోల మేఘాలు లేవు
కఠిన సమస్యలూ లేవు
కటిక దారిద్ర్యమూ వుండదు.
ఒక ఆత్మీయ అంకుశం ఉండాలి.
స్వయమాపాదిత
క్రమశిక్షణా ఉండాలి.
మతం చెప్పినా,
గతితార్కికవాదం చెప్పినా,
నిన్ను నీవు తెలుసుకొమ్మనే చెప్పింది.
నన్ను నేను తెలుసుకునే
ఉపకరణం నువ్వే!
కరణేషు మంత్రిత్వ సూక్తంలో
ప్రత్యంశ సత్యమై ప్రయుక్తమై-
యుక్తియుక్తుడిని చేసేది నువ్వే!
నీ నవ్వే!

నీ జన్మదిన స్వర్ణోత్సవ సంరంభం-
నీది కాదు నాది.
నిన్ననే కాదు, నేటికీ ఏనాటికీ.
దేహాన్నయినా, దేశాన్నయినా
దేవాలయంగా సంభావించే
పవిత్ర భావనలో
ఇంటికి దీపం ఇల్లాలు.
వెలుగుల ప్రస్థానానికిగానీ,
విజయపథానికి గానీ,
ఏ స్వేచ్ఛాభావనలకూ
అణచివేతకాదు.
జీవితాన్ని పరిపూర్ణ
కాంతివంతం చేసే భార్యకు
వినమ్రుడయ్యేవాడే ఉదాత్తుడు.
అందుకే అందుకో ఈ
రెండు పాతికల శుభాకాంక్షలు.

(ప్రేమతో ఉషకు)

***

*(3 జూలై 2008))*

# ఓటరాయ నమః

ఒక పరిహాస పదం పట్టుకుని–
ఒకటే ఊయల.
నిజానికి వీళ్లంతా వేసింది
ఒక సర్కస్ డేరా
విన్యాసాలా?–
ఎవరివి వారివే.
అందరూ ఆటగాడి ఆట
ఆడిస్తూ ఆడిస్తూ ఆడే ఆట.
ప్రజాసేవ పగిలి, చిట్లి–
చిద్రుపలు చిద్రుపలైన పదం–
జోకర్ పగలబడి నవ్వు.

ఒక గుడారం,
ముందు పులిదో, సింహానిదో,
అయితేనేం–
బొరియల్లో నక్కలూ దూరుతాయి.
ఒంటె– ముందు తలపెట్టి,
ఆనక అంతా తనదేనంటుంది.
జంతుతతి ఏ అవతారమో–
గుడారాన్ని చీల్చుకుపోయి
కొత్త గుడారమవుతుంది.

సిద్ధాంతాల ఊలలు
అశుద్ధం మీద ఊపిరులే.
బుడగలు ఊదుతారు
బుద్బుదాలయితే బుద్ధిగా
గాలివాటుకు ఒదుగుతారు

అంతా రక్షకులే!
అసలేదీ అర్థం కానివ్వరు.
అన్న ఒప్పందం దగ్గరే
ఇంకా వున్నాం
కిలో బియ్యం, కందిపప్పు,
ఆయిలూ, గ్యాసూ, పెట్రోలు,



అన్నపూర్ణ ఆంధ్ర ఆరాటమంతా.
అభివృద్ధి లేదంటూ–
కృశించిన అస్తిత్వంలోనే
పోరాటమంతా.
అయినా అణు ఒప్పందం దాకా–
అందరితోబాటు పరుగు పందెం!

రక్తాన్ని దానం చేయమంటూ-
రాజకీయానికి
కొత్త రక్తం ఎక్కిస్తానంటాడు.
సినిమాటోగ్రాఫిక్,
యానిమేషన్ గ్రాఫిక్సా!
స్వయంకృషి రాక్షసుడు స్టాలిన్‌గా
కనులకు కట్టినందుకేనా!
వామపక్ష గాలి వింజామరలు.

అక్కడొక పంద
ఇక్కడొక మంద
ఒకడు చేజేతులా స్వయంగా
జారుకుంటూ, జారుకుంటూ-
పైపైకి ఎక్కుతున్నాననుకుని
ఒకటే నిక్కులాటనా-
రాజీనామాలోనే జీనా
అనుకుంటాడదేమిటి రామా!

ఇంకా రాముడూ, కృష్ణుడూ వేషధారి
వెన్నుపోటు బాణం గుచ్చుకు
అవతార సమాప్తి కానిచ్చేసుకున్నాక,
హరేకృష్ణ భజనల చైతన్య రథం
గాలి తీసేసిన సైకిలుకు
గంట గణగణమ్రోతలే గానీ-
ఎక్కడుంది పాత ఛరిష్మా!
ఆ విధంగా ముందుకుపోతున్నాం
అంటూ
వెనక్కి వెనక్కి మీకోసం-
మళ్లీ దేబిరించి వస్తూన్నప్పుడు
బాలకృష్ణ రూపమో,
రోజా రామణీయకమో
జూనియర్‌తో, హరికృష్ణ గర్జనో-
చొచ్చుకుపోగలవా గుండెల్లోకి-
ఫ్లై ఓవర్లు ముగిసాక రోడ్డున పడ్డ
పక్షి ప్రజల్లోంచి ఎగిరి
పంటపొలాల్లో రైతు నేస్తం
అవుతుందా?

మన పార్టీ, నవ పార్టీ, జనపార్టీ
అల్లుడి అత్తా, గుత్తా, లోక్‌సత్తా
సర్కస్‌లో సరదాలు పెంచుతున్న
పిల్లలు
పైన ఊగిసలాట.
క్రింద నెట్‌వర్క్
జారితే ఓ వల
పడితే- ఆవల, అయినా ఓ కల
చూడ కనుల కింపు- కళకళ.


ప్రజాసేవ ఎంత పరిహాస పదమో,
ప్రజాస్వామ్యం అంత-
మజ్జిగ పలచని స్థితి.
పెరుగు పెరుగు- కొలస్ట్రాల్ పెరుగు
చిక్కదనం వద్దు
చిక్కబట్ట ధనం, కురుచీ చాలు
ఎవడి పార్టీ వాడికిరుచి.
కాకిపిల్ల కాకికి ముద్దు.
ఎవరూ అనరేం-
ఇన్ని పార్టీలు వద్దు.
సంఘటితం కాకుండడం కోసమేనా-
ఇన్ని జెండాలు, ఎజెండాలు
ఎవరికి వారికి గూండాలు,
ఎదురెదురు దండాలు,

పొత్తులు, జిత్తులు, గుత్తులు గుత్తుల
సముదాయాలు!!
చీలికలు గురించి తెలిసిన ఏలికలు.
హింసానేరాల కాపాలికలు.
అటూ ఇటూ ఊగిసలాడే తూలికలు.
తన మెడకు తానే పడే–
స్వచ్ఛంద జైజై గణమాలికలు.
అందరికీ హస్తిన గద్దె–
లక్ష్య నిర్దేశపు పెద్ద విద్దె.
రాష్ట్రాధిపత్యం రంగుల కలలు
పడుతూనే వుంటాయి
హంగుల వలలు.
పడగొట్టడం, విడగొట్టడం మీదే
రాజకీయం అంతాను.
సమకట్టడం– స్వార్థ చింతనకే కానీ
సహగమ్యవంతలకు కాదు.

తనతోనే అంతా అనే–
తలకెక్కిన తప్పుడు సూత్రం.
తనవెంటే జనం అన్న
సర్వే స్వీయాల శ్వేతపత్రం.
ఈ పార్టీ గుహలనూ,
ఈ అసందిగ్ధ గుహ్యాలనూ,
నోరు విప్పకుండానే–
నోట్లో విశ్వముందంటున్న
మన్ను తిన్న చిరంజీవులనూ,
అంతా మా హస్తవాసేనని
చేతి చమురు వదిలించుకుంటున్న
పథకాల పథగాములనూ,
పార్టులు పార్టులు ఊడబెరుక్కు
విడివడుతున్నా–
సైకిల్‌పై ప్రపంచ పర్యటన
స్వప్నిస్తున్న చంద్రులనూ,
కాసిన్ని అయినా కాసానులనూ,
సహస్ర దళ పద్మం
పరమ పదసోపానపట
అధిరోహణా కాంక్ష
కమల దళితులనూ–
అందరినీ అన్నివేళలా
అవలోకిస్తూనే వున్నాడు ఓటరు–
సామాన్యుడు.
వాడు అనిలం
వాడు అనలం
వాడు అర్థంకాడు.
వాడు వ్యర్థం కాదు.
ధర్మ సంస్థాపనార్థాయ
సంభవించవలసింది
ఓటరు అవతారమే
అది మనమే.
***
***(17 జూలై 2008)***

# 'అణు'గుణంగా...

ఆరు నెలల్లో
ఎన్నికల రణాంగణంలో
ఎలాగూ ఎదుర్కోబోయే
కాడికి
ఇప్పుడు పడగొట్టి
దేశాన్ని ఏ మాయావతి
గతికో
సరికొత్త అవినీతికి
అవకాశాలు ఇచ్చే బదులు



గెలుస్తేనే బాగుండుననే
ప్రజాకాంక్షకు
'అణు'గుణంగానే–
సర్కార్ రాజ్ గెలుపొందింది.

సిగ్గులేని పని మొదలెట్టిందే
'సి.పి.ఎం.' అని
స్పీకర్ సోమనాథ్ సంభావించే
తన పార్టీ ఆదేశాన్ని బేఖాతరు చేసి
సభా కార్యక్రమాన్ని
తన పరిధుల మేరకు
సజావుగా నడిపిన తీరు
ఓ విలువల కేతనం ఎగరేసింది.

అయితేనేం–
నోట్లకట్టల వీరంగం,
ఎన్.డి.ఏ. పార్టీల అంతర్గతాలలోనే
తిరుగుబాటు ధ్వజాలతో
ఆ పార్టీల అధినాయకులకు
దిమ్మ తిరిగే శృంగభంగం.
లాబీయింగులు, జంపింగులు,
అర్థంలేని అర్థంకాని
అంటుకట్టింగులు,
మేకపోతు గాంభీర్యాల బెట్టింగులు,
విందు భోజనాల సిట్టింగులు,
మొత్తానికి తలబొప్పి కట్టింగులు,
బుల్‌బుల్ పిట్టల–
బోల్తా కొట్టింగులు.
ఎటు పోతున్నాం?
మనం ఎక్కడికి వెళ్తున్నాం?
ఎన్ని విలువల తిరోగమనంలో పడి
విశ్వాస పరీక్ష నెగ్గినా
ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్ని
కోల్పోతున్నాం.

కనబడని చెయ్యేదో
ఆడుతోంది నాటకం.
'సబ్ ఠీక్ హై' అని గెంతులేయడం
ఓ పెద్ద బూటకం.

నాలుగేళ్లు చూసీ చూసీ
ఎన్నికల కాలం చేసే సమయానికి
వెంటిలేటర్ మీదవున్న ప్రభుతకు
కిటికీ మూసేయాలనుకోవడం
వామపక్ష తప్పిదం
ఆఖరి శ్వాసలు తీస్తున్నవేళ
అసలు డాక్టర్‌నే
మార్చేయాలనుకోవడం
అస్తిత్వ ప్రాణిపై ప్రేమకాదు,
ఏదో వైయక్తిక స్వార్థచింతన,
ఆలోచనల్లో క్రమతా, స్థిరతా లేని
పొంతన.

ఇంతకూ జరిగింది-
ఓ అంకెలాట
అతుకు బొతుకుల బొంతలాట
ఏకవాక్య తీర్మానంలో
అసలు అణు ఒప్పందంపై చర్చకు
ఆస్యగహ్వరాలు తెరిచిన వారేరీ?
ప్రజకు మంచిచెడ్డల గురించిన
వివరణకు వీలు కల్పించిన వారేరీ?
ఎవడిగోల వాడిదే!
అసలు అంశం పక్కదారిదే.
ఎవరికి తోచినట్లు వారి మాట్లాట
నిండు సభలో నిస్సిగ్గుగా నోట్లాట
అవలీలగా గెలుపు

లీలగా మరేదో తెలుపు
అంతఃకరణమంటూ ఉంటే
లోలోన ఏదో సలుపు
ఏమైతేనేం!- ఇప్పుడిదో మలుపు

ఒక్కడు
ఒకే ఒక్కడు
అతడు
సింగిల్ నెంబర్ల కాయ్‌రాజా కాయ్
అణువుతోనే ఆశలు వెలిగేది
మాట ఏమోగానీ
ప్రస్తుతానికి మాత్రం
మన్మోహనానుకూలంగా
అణు(కు)వైనందుకు
ఆరు నెలల ఆనంద విహారం

తన కోడీ కుంపటీ లేకుండానే
తెల్లవారిందని
ముసలి వామపక్షాలకు
నిండా మునిగిన ఆశ్చర్యం
ముందే తేలిన యుపీఏ విజయంతోనే
బి.జె.పి.ది హైడ్రామాలన్నట్లుగా
నోట్లకట్టల
నాటక దుశ్చర్యం
సొంత పార్టీ ఎంపీలే షాకిచ్చిన
చక్రగ్రహణంలో చంద్రబాబు
ఆరు నెలలయినా ప్రధాని కాగలనన్న
ఆశల మాయావతికి
ఆశలపై నీరుచల్లిన మూడో ఫ్రంటు
ప్రస్తుతానికి పీకేయని టెంటు
కొనసాగుతూండే స్టంటు

గండం అయితే గడిచింది
కానీ–
ముందున్నది ముసళ్లపండుగే!
ఇప్పుడు తీరుతీరుల
తీరని కోర్కెలు
తీయతీయగా తీర్చకపోతే–
కొత్త తలనొప్పులు
తలకెత్తక తప్పదు.
వామపక్ష ఆరళ్లు
అధిగమించామన్న ఆనందం–
ఆడబడుచు నవ్వులాటలను
తట్టుకోవడంలో తెలిసివస్తుంది.
మిలాఖాత్‌ల ములాయం
అమర్‌సింగ్‌ల పవర్
శిబుసోరెన్ మన్
అన్నీ గ్రహించుకుని
ఫన్నీగానే సాగాలి.

ఎవరికి ఎక్కడ కోపం వచ్చినా
ఏ ఒక్క అంకెలో అలకలల్లలాడినా
కల్లోల తరంగం లేవక తప్పదు
సంకీర్ణ ప్రభుత్వాలంటేనే
సవాలక్ష సర్దుబాట్లు తప్పదు
ఈ దేశానికి ఇప్పుడు బహుశా
ప్రాంతీయతా ప్రభంజనమే గానీ
ఒక అఖండ జాతీయత ఒప్పదు.
జాతీయ పార్టీల జోరు
జారుతూ పోతూ
సన్నగిల్లుతున్నప్పుడు
ప్రజాస్వామ్యం
ఇంతకంటే మెరుగ్గానప్పుదు
రెండు పార్టీల వ్యవస్థ ఏర్పడగలదన్న
ఆశావిశ్వాసాలను
వర్తమానమే కాదు
ఏ భవిష్యత్తూ ఇప్పుడు చెప్పదు

సో! నియర్ ఫ్యూచర్లోనూ
సోనియా కంపెనీకి
ప్రక్క వాయిద్యాలు తప్పవు
వాద్యఘోష 'బీటే' ఎక్కువయితే
చెవిపోటు, తల హోరులు తప్ప
మెలోడీలు నప్పవు.

ఎక్కువమంది చేతులెత్తిన
మాత్రాన
న్యాయం కాజాలనిది
నివురుగప్పిన నిప్పులా
ప్రజ్వలిస్తూనే వుంటుంది
ఛానెల్స్ ఎన్నెన్నో తిప్పుతూన్న
అయోమయం విస్తరిస్తున్నా–
ప్రజ అంతా గమనిస్తూనే
వుంటుంది.
అదునెరిగి పదునెరిగి
క్రమాక్రమాగత చైతన్య ధనుష్పాణి
అవుతూనే వుంటుంది.
కాలానుగుణంగా
కావాలంటే
'అణు'గుణంగా
వ్యవస్థీకృత మవుతూనే ఉంటుంది.

***

***(24 జూలై 2008)***

# స్వర జ్యోత్స్న

ఒక స్వరాన్ని గురించే
మాట్లాడుతున్నాను.
గాలి తరగలలో
మామూలైన అలవరసల మీద
శ్రోతల హృదయాలలోకి
ఇన్నాళ్లుగా వెన్నెలలు వర్షించిన
ఆత్మీయతను పంచిన
తనతనపు తేనెలూరించిన
మధురోహల గళ మాధురి గురించే
పలకరిస్తున్నాను.
ఇంత ఎఫ్.ఎం.ల .జోరు,
ఇన్ని ఛానెల్ల హోరు,
ఎంతగా విస్తరించి వివశుల్ని చేస్తున్నా
ఇప్పటికీ
ఎదలోతుల్లోకి ఇంకి,
అనుభూతి రసవాహినులను తాకి,
ఆంతరిక ఆనంద వీచికలనూపే
ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం
ఆత్మీయ స్వరం గురించే
స్పృశిస్తున్నాను.

జీవితం ఎంత అల్లకల్లోలమైనా
ఒక మగ అహ, మదాల నుండి
అధిగమించి
అహ్మద్ అనురాగ మైదానంలో
విచ్చుకుని
ఆస్మానే హద్దుగా,
అభివ్యక్తిలో ఎదిగి,

విద్యుక్త ధర్మంలో ఒదిగి,
మాటల ముత్యాలు పొదిగి,
బ్రతుకు సమరాన్ని కూడా
స్వర సమీరంగా మార్చుకుని
ఉదయ తరంగిణుల నుండి,



అపరాత్రుల
సంగీత విభావరుల దాకా
కంఠం విప్పి
కోట్లాది గుండె కోటల్లో పాగా వేసి
స్వర పతాకాలు బాగా ఎగరేసిన
స్వరజ్యోత్స్న గురించే
'సలాం' చేస్తున్నాను!

ఎన్ని ఘట్టాలు, ఎన్ని ఘటనలు
ఎన్ని రాజకీయాలు, ఎంత చరిత్ర
రాష్ట్ర రాజధాని కేంద్రంలో
రాశులు పోసిన ఎన్ని జ్ఞాపకాలు
రేడియోలో ఆదివారపు
మధ్యాహ్న నాటకాలు, చిత్ర గీతాలు,
ముఖ్యమంత్రుల ప్రమాణ
స్వీకారాల నుండి
ప్రధానులు, రాష్ట్రపతుల
సందేశాల వరకూ
వందేమాతరంతో మొదలిడి
అర్ధరాత్రి ప్రసార సమాప్తి
జైహింద్ వరకూ
షిఫ్ట్ డ్యూటీల్లో దివారాత్రాలు
అనౌన్సర్ల గాత్రాలు.
ఆహుతుల సమక్షంలో
కవి సమ్మేళనాలు, సంగీత సభలు.
ఏవయితేనేం, ఎప్పుడయితేనేం,
ఎదకు హత్తుకునే
అభినందనీయ స్వరం.

శారదా శ్రీనివాసన్ తరువాత
అంతటి ప్రతిభా పాటవాలకు
ఆలవాలంగా
అదనంగా అపురూప అనౌన్సర్‌గా
వినుతికెక్కిన విదుషీమణి
జ్యోత్స్న:
తెలుగు విశ్వవిద్యాలయం నుండి
రేడియో నాటకం మీదే
డాక్టరేట్ పొందిన ఘనత తనది.
తొలితరం తెలుగు అనౌన్సర్
తల్లి భానుమతి నుండి
ప్రజ్ఞావైదుష్యాలను పుణికి పుచ్చుకున్న
పున్నావఝుల వారమ్మాయి.

వివిధ భారతి పూలజల్లులో
మధులతలుగా అల్లుకుని,
దాంపత్య బంధాన్ని కొల్లగొని,
ఇలియాస్ జ్యోత్స్నలుగా
వాసికెక్కిన వ్యాఖ్యాతల జంట.
అతని ఔదార్యమే
వెన్నంటి ఉండకపోతే
కర్కశ మీడియా చిత్రాగ్నికి
ప్రజ్ఞ ఆహుతి అయినప్పుడుగానీ,
స్వప్న సుధాకర స్థిరత్వంలోగానీ,
గాయపడిన జీవితం నుండి
ధ్యేయ గంభీరంగా
ధీమతి కావడం కుదిరే పనేనా!
అడవిగాచిన వెన్నెల కాకుండా
ఆస్మాన్ తక్
పిండివెన్నెల పరుచుకునే
సహజ ప్రకృతిత్వం
ధర్మసాధని దైవసంభాషణంగా
దీప్తిమంతం కాగలిగింది కదా!
మతం
మానవత్వ అభిమతంగా
సహజీవన సంస్కారాన్ని
పరివ్యాప్తంచేయడం
ఎంతటి మహోదాత్తత!
అతని సంస్కారానికి శిరస్సు
కావాలి సదా అవనత!

అవును!
జ్యోత్స్న సదా అభినందనీయ
ఆటుపోట్ల సముద్రానికి
జీవితం గురైనా
వెన్నెల హారతులే పట్టి
కంటిలో, గుండెలో ఎన్నిమార్లు
ఏ సుడిగుండాలు తిరిగినా
గొంతులో ఆవంతయినా తొణకక,
'రేకి' తనంతప్ప, లేకితనం లేక,
ఉదాత్త గాంభీర్యంతో
ఉత్తాల గళాన్ని పలకించడం,
ప్రసార కార్యక్రమాలలో
ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునే
స్వర మాధురులొలికించడం
సామాన్యమైన సంగతేమీ కాదు!
జ్యోత్స్న అందుకే
సార్థక నామధేయ స్వరజ్యోత్స్న..

అరవై ఏళ్లకి పదవీ విరమణ
అనివార్యంగానీ
ఇప్పటికీ ఇరవైగా ఇంపైన గళాన్ని
ఇవ్వగల వెన్నెల జాలే!
జపాఫోర్‌తో చుట్టిన శ్రీకారాలే
నేటి మీడియాలో స్వైరవిహారాలే.

ఇక వృత్తికి విరామంగానీ
ప్రవృత్తికి కాదుగదా విరమణం.
జీవితం ప్రవహిస్తూనే ఉంటుంది.
గతానుగతికం నుండి అనివార్యంగా
కొత్త స్వరం వినిపిస్తూనే వుంటుంది.
రంగం మారవచ్చుగానీ
చిరంజీవత్వం వర్ధిల్లుతుందిగా!
నీ స్వరమూ అంతే.
బ్రతుకు దారి సర్వమూ అంతే.

వెన్నెల్లో ఆడపిల్లా! వెన్నెలయిన పిల్లా!
సలామత్ రహే నీ సుస్వరాల మాల.
శ్రోతలు మరువలేని
ఓ రేడియో బాలా
అరవై ఏళ్ల అందాల స్వరజ్యోత్స్నకు
నీకు
ఇది అభినందన వర్ణమాల.

**(ఆకాశవాణి అనౌన్సర్ జ్యోత్స్నకు
పదవీ విరమణ సందర్భంగా
అభిమానంతో)**

***

***(31 జూలై 2008)***

# బిగ్ బ్యాంగ్

తెలుసుకోవడానికి
భయపడితే–
నీలో నువ్వే బద్ధలవుతావ్!
విస్ఫోటనం జరిగాక కానీ–
విశ్వరహస్యం తెలియదు.
తెలుసుకోవడానికి నువ్వుండాలి
అంటే–
ప్రయోగం నువ్వే చేయాలి.
ముందు భయాలను పేల్చి
నువ్వు ముందుకెళ్లాలి.



సెర్న్– ఓ టర్న్.
దేవుడిని సృష్టించింది మనిషే.
మరి మనిషి
జీవకణం సృష్టించిందెవరు?
ఒకటారెండా–
పదమూడు వందల డబ్భైకోట్ల ఏళ్లు
నక్షత్రాలు, గ్రహాలు ఏర్పడి
మిణుకు మిణుకుమనే
నక్షత్రాల నడుమ
డార్క్‌మేటర్, డార్క్ ఎనర్జీ గూర్చి
ఎప్పుడైనా విశ్లేషించావా!

ఒక శూన్యం
విస్తరిస్తూనే వుంటుంది–
బహిరంతర విశ్వఖేలనంగా.
మూఢంగా అహోబిలాల
గురించి కాదు
కృష్ణబిలాల గురించి ఆలోచించు.
లక్షల డిగ్రీల సెంటిగ్రేడ్ల
ప్రేలుడు తర్వాతి వేడిమి
సూర్య ఉపరితలంకన్నా ఎక్కువై
ఇప్పుడే నీ బుర్రలో
భయమై జ్వలించకుండా చూసుకో!
లార్జ్ హోడ్ర్లాన్ కొల్లైడర్–
నీ హృదయ సొరంగమేనా.
ఇరవై అయిదు మిలియన్ల
డాలర్ల వాటా
నీ దేశానిదీ వుంది.
శాస్త్రవేత్తలై నీ భారతీయ
జ్ఞానసోదరులూ ఉన్నారు.

సృష్టి ఎలా జరిగిందన్నదీ
పదార్థం ఎలా పుట్టిందన్నదీ
మనిషి ఎలా ఏర్పడ్డాడన్నదీ
ఏది కాదు జిజ్ఞాస?

నీ ఆశ గురించి–
నీ శ్వాస గురించి–
నీకే తెలియడం మించిన
మహత్తు ఏముంది?

మతం చెప్పినా–
గతి తార్కిక భౌతికవాదం చెప్పినా–
నిన్ను నీవు తెలుసుకొమ్మనే.
అన్వేషణలో భాగమే–
ప్రతిపరీక్షా, ప్రతి ప్రయోగం
భూమి మీద ఎక్కడున్నా–
మనిషి మనిషే.

ఫ్రాన్స్ స్విట్జర్లాండు సరిహద్దుల్లో
జెనీవాలో
భూమికి ఆరువందల అడుగుల
లోతున
ఇరవై ఏడు కిలోమీటర్ల
చుట్టుకొలతతో
పదిహేడు మైళ్ల పొడవు సొరంగంలో
నలభైవేల కోట్ల ఖర్చుతో
విశ్వరహస్య ఛేదనానికి తలపెట్టిన
బిగ్‌బ్యాంగ్ ప్రయోగం–
మానవ మేధస్సుకే
మహిమాన్వితమైన అద్భుత–
విజ్ఞానశాస్త్ర ప్రయోగం!
నిజమైన యాగం!
సెకనుకు నాలుగు కోట్ల
చిత్రాలు తీసే కెమెరాలు.
సెకనుకు పదకొండు వేలసార్లు
చుట్లు తిరిగే ప్రోటాన్లు,

బిగ్‌బ్యాంగ్ జరిగిన సెకనులోనే
జీవుల తాలూకు బీజాలకు చెందిన
రహస్యాలు వెల్లడయ్యే
పరిణామ ప్రయోగం.
శక్తి, హై వెలాసిటీ కలిగిన
కిరణ ప్రసారంతో
పదార్థంగా మారిన పరమ రహస్యం
బట్టబయలు...
ఎంత ఆశ! ఎంత ఆకాంక్ష!

ప్రయోగంలో
ఇరవై యూరోపియన్ దేశాలు
ముప్ఫైఏళ్లుగా కృషి
ప్రపంచ వ్యాప్తంగా
నూటయాభై పరిశోధక కేంద్రాలు
ఆరు నెలలపాటు సాగనున్న
ప్రయోగాలు
పధ్నాలుగేళ్లుగా పురిపెట్టిన
శాస్త్రమేధ
ఔనా!
మరి హేతువు వికసించాలిగా!
ఉత్సాహం అంకురించాలిగా!
భయాలనూ, పిరికితనాన్నీ,
భూమికి ఏదో అయిపోతుందన్న
హైరానానూ,
ప్రళయమే మీద పడుతుందన్నట్లు
వణుకునూ,
బిగ్‌బ్యాంగ్ కన్నముందే–
ప్రజలలో పేలుస్తున్నదెవరు?
విజ్ఞానాన్ని విధ్వంసమని
అవివేకాన్ని విస్తరిస్తున్నదెవరు?

ఆహ్వానించవలసిన
విషయాన్ని ఆందోళనబాట
పట్టిస్తోందెవరు?

జరిగేదేదో జరగకమానదని
కర్మసూత్రంతో కరచాలనం చేసినా–
కాగల కార్యం
విజ్ఞాన శాస్త్రగంధర్వులు
ఎలాగూ తీర్చనే తీర్చుతారు
భయపడే వాడెప్పుడూ
జయించలేడు.
ఆలోచనల్లోనయినా–
ధీమాయే ఆసరాకావాలి.

ఉచిత సలహాలతో ఉట్టినే
ఉద్యమించరెవ్వరూ
ప్రయోగాలు చేసేవాడు
భయస్తుడెపుడూ కాడు.
విజయాన్ని విశ్వసించే
కార్యశూర్యుడవుతాడెవరైనా.

పరిణామాలను అంచనా వేసే,
కీడెంచి మేలెంచుతూనే,
కీలెరిగి వాతలు పెడతాడు.

రంగం ఏదయితేనేం!
మనిషి ఎవడయితేనేం!
ప్రయోగాలు ప్రభంజనాలవుతూ–
అభివ్యక్తంకాని
రహస్య ఛేదనాలు జరుగుతూ–
అభ్యుదయ పురోగమనానికి
అడుగులు పడడం
ఆహ్వానించాల్సిందే.
మార్పు మంచికయినప్పుడు
నతమస్తకం కావల్సిందే.
ఉద్యమించనీ– హేతుబద్ధమై
కొత్తగ్యాంగ్.
జరగనీ– బిగ్‌బ్యాంగ్!

***

***(11 సెప్టెంబర్ 2008)***

# అక్షరం - హృదయానికి 'బదులు'

సుప్త సింధువులో
చలిత మీనాల్లా
నా మనసులోకి
నీ లేఖాక్షరాలు.

ఎన్నాళ్లయ్యింది అక్షరాల్ని చూసి!
ఆత్మీయ లేఖలోని ఒక్కో అక్షరం
నిజంగా ఒక ఉషాకిరణం.
చెవుల్లో జలతరంగాల్లా
శబ్దధ్వనుల హోరు నుంచి
ప్రశాంతంగా చూపుల పడవసాగే
ఉత్తరవాహినిని చూసి
గంగాజల పవిత్ర స్నాతునిలా
ఎంత పులకించిపోయాను.

అక్షరం హృదయ దఘ్నమై
ఎన్నాళ్లయిపోయింది
ఎవరన్నారు 'అమెచ్యూర్' అని?
శుభ్రజ్యోత్స్నా పులకితయామిని
స్వచ్ఛంగానే వుంటుంది.
గుండెలోకి ఇంకిన
జ్ఞాపకాల రసానుభూతి-
పసిపాప నవ్వులా అమాయకంగానే
కదలాడుతుంది, కదిలిస్తుంది.

నిజమే-
బూటకపు ప్రపంచంలోనేగా
ఇలా బతుకుతూవున్నాం-

అనుబంధం, ఆత్మీయత
ఆర్థిక సంబంధాల ఘలంఘులల
నడుమ
అవమాన దగ్ధంగానే
పొడ చూపుతుంది.
"అనుకున్నామని జరగవు అన్నీ
అనుకోలేదని ఆగవు కొన్నీ



జరిగేవన్నీ మంచికనీ
అనుకోవడమే మనిషి పని"
అని మనసుకవి
కళ్లను చెమ్మగిలచేస్తూనే ఉన్నాడు.

లౌక్యం ఎరుగని జీవులం-
దంచుతామే గానీ-
భుజాలెగరేస్తూ
నటించలేం మనం.

సారూప్యాలు, తులనాత్మకాలు
వద్దనుకున్నా రూపుకడుతున్నప్పుడు
ఓడిపోతున్న
అసమర్థ జీవుని వేదన
అనుభవిస్తామేగానీ
అవతలివాడిని ఏమీ అనలేం.
'ఏం మాట్లాడితే ఏం తప్పో' అన్నది
మన భయం కాదు,
బాధ్యతను విస్మరించలేని
మన బరువు, విలువల పరువు.

అందుకే
మన గుండె బరువు,
మన కంటి తడి,
మన చుట్టూనే గిరికీలు కొడతాయి.
పాత ఊహాచిత్రమే బాగుంటుంది,
కానీ వాస్తవ దృశ్యాన్నుంచి
నిష్క్రమించలేం కదా!
మార్పు అనివార్యం
మనసు మంచితనం
గతం నుంచి పెన్నిధిగా
పదిలపరచుకుని-
ప్రవర్తించడం శిరోధార్యం
ఎందుకు కోల్పోవడం స్థైర్యం!
దిగులు కత్తి-
ఎందుకు కోయాలి మన ధైర్యం?
చిత్తశుద్ధి, నిజాయితీ
జీవనపోరాట కత్తివాదరలే
ఊహలనూ, భ్రమలనూ విదుల్చుకుని
ఉత్సాహంగా జీవించడమే
నిత్య ఉషోదయం.

ఎవరూ ఏమీ చెప్పరు.
వర్తమానం పరుగులు వంటబట్టాక-
గతాన్ని రసానుభూతంగా కాక
వదలని 'భూతం'గా భావిస్తారు వాళ్లు.
దాటి వచ్చేసాక కూడా
నాటి సాటిమనిషిని
కలికంలోకయినా తలవరు.
ప్రేమాస్పద జ్ఞాపకంగానయినా
పిలవరు.

గాయాలు కెలుక్కోవడం
అనుకుంటారుగానీ,
హృదయ గేయాలు
అనుభవధ్యేయాలై-
పునాదులై ఇళ్లు లేచాయనీ
చుట్టూ పూలుపూచాయనీ
శాంతి కాంతి, కాంతి శాంతి
జగమంతా జయించే
జాగృత చైతన్యం విస్తరించిందనీ
అంగీకృతులు కాలేరు వాళ్లు.

మూడొంతుల జీవితం గడిచినా
మూడు పదుల క్రిందటి
ముచ్చట్ల మురిపాల
మనోహర యవ్వన సమీరం
మనసు మూలల్లో
వీస్తూనే వుంటుంది కదూ!
తలలు నెరిసినా
తలపులు మెరుస్తూనే ఉంటాయి.
వయస్సు శరీరానికే గానీ
మనసుకు కాదు.
మధురోహల జ్ఞాపకాలకూ కాదు

ఉత్తరాలు రాసుకోవడం
ఉత్త'రాలుగాయి' లక్షణం కాదు కదా.
ఆనాటి క్షణాలూ,
బ్రతుకు పునాదుల్ని పాదుకొల్పిన
అక్షరాలూ,
ఇవాళ్టి తరానికి
మటుమాయమైపోవడం–
గళాలు తెగవిచ్చుకుని,
కలాలు మాత్రం ముడుచుకుని,
నోరు, చెవులు తప్ప
చూపులు, మనసులు నిశ్శబ్దమవడం
చిత్రంగానే తోస్తుంది!

కంప్యూటర్ కీబోర్డుపై వేళ్లు
తెరపై
బ్లాగులు బ్లాగులు


యాంత్రికతను కౌగలించుకున్నాక–
ఓ తెల్లకాగితం
ఓ ఇంకు పెన్నూ
కాసిన్ని అనుభూతులు
అక్షరాలై ఆకృతి దాల్చడం–
అంతా 'బార్బేరియస్'గానే వుండచ్చు
కొందరికి.

బోన్సాయ్ మర్రిచెట్లను
అభినందించే నేత్రాలకు
మనసున మల్లెల మాలలూగడం
పరిహాసాస్పదంగానే తోచవచ్చు.

వదిలేయ్!
ఎంత కొత్తదయినా
కృత్రిమత మనకొద్దు
యాంత్రికత మానవతకు
పర్యాయం కానీయద్దు
మనం మనంగానే జీవిద్దాం.
తృప్తి మన హృదయంలోంచి
జనించాలి
సమష్టి ప్రపంచంలో వుంటూనే–
నీకు నువ్వు నచ్చేలా బ్రతకడం
ముఖ్యం.
దానికి ఆలంబనమయ్యేదే 'సఖ్యం'.
ఉత్తరాలతోటలో పక్షులమై
పలకరిద్దాం.
ఆత్మీయ స్నేహంలో పులకరిద్దాం.
అక్షరాలా– అందంగా, ఆనందంగా
జీవిద్దాం.
***
***(25 సెప్టెంబర్ 2008)***

# ఆ'లయ'మేలా!?

సృష్టి స్థితులను వదలి
'లయం' వైపుకే
ఆలయాలు ఆస్కారం కావడం
ఆధునిక విషాదం.



కోరిన కోర్కెలు మొక్కులుగా
తీర్చుకోగోరే భక్తులకు
ఏకంగా మోక్షప్రాప్తే
మరణమై మీదపడడం
తల్లి అనుగ్రహం అని
ఎలా సరిపెట్టుకోవడం?

దేవుడిచ్చే సంగతేమోగానీ
తాను కొలువున్నాడంటున్న
దేవాలయాల్లో
భద్రత కరువవడం–
ఇటీవల విస్తరిస్తున్న
విషాద విపరిణామం.
దుష్టశిక్షణ,
శిష్ట రక్షణ
తొక్కిసలాటలోనే
తేలిపోతుందా తల్లీ చాముండీ!

హిమాచల్‌ప్రదేశ్–
నైనాదేవి ఆలయం,
బెజవాడ కనకదుర్గాలయం,
రాజస్తాన్–
చాముండేశ్వరి ఆలయం
ప్రాంతాలు, ప్రదేశాలు వేరంతే!
ప్రాణాలు కోల్పోయే–
తొక్కిసలాట ఘటనలే అన్నీ!
తప్పెవరిదయినా–
శిక్ష భక్తులకు.
మనుషుల మనసుల ఇరుకు సరే
ఆలయ ప్రవేశ మార్గాలు
ఇరుకు కావాలా?
భక్తి పేరుతో
తరలివచ్చినవారి ప్రాణాలనే
సరుకు గొనాలా?

దేహమే దేవాలయం అన్నందుకేనా
ఆలయం కూడా మనిషిలా
సాటి మనుషులను
ప్రమాదాల పాలు చేయడం?

కోయిల్ ఆళ్వార్‌కు
భక్తుల రక్తపాతాలతోనా
తిరుమంజనాలు?
ఊపిరులతోనా ఊంజల సేవలు?

దేవుళ్ల సామీప్య దర్శనాలు
గుడులలో కరువవుతూ-
చివరకు నేరుగా చేరుకునే
మృత్యుస్థావరాలుగా మారడం-
ఎంత విషాదం-
ఇది ఎవరి లీలా వినోదం?

భక్తుల రద్దీ-
ఆలయాల్లో
గణనీయంగా పెరుగుతున్న కొద్దీ-
సమీపం నుండి
సందర్శించుకునే స్థితి పోయి,
లఘు దర్శనాలు,
మహా లఘు దర్శనాలు,
మూల మూర్తులకు సీమితం చేసి-
దూరం నుండే-
దణ్ణంపెట్టుకుని బయటపడే
దౌర్భాగ్యం ఎలాగూ దాపురిస్తోంది.
సరికొత్తగా ఇలా
ప్రాణాలకే ఎసరు వస్తోంది.

ఆలయం పవిత్రమని కదా భావన!
అర్చనలు, పూజలు సరే,
దైవ సందర్శనమే
మనశ్శాంతి హేతువని కదా-
ఆలోచన.

మనిషిని- మనిషిగా,
మానవతను- దైవతంగా మలిచే
మహిమాన్విత స్థావరమని కదా-
కోవెల గురించిన తలపుల కలబోత.

ఇదేమిటి మరి?
అభద్రత ధ్వజస్తంభమై పాతుకుని,
గంటలు మృత్యు ఘంటికల్లా
నినదిస్తూ,
దీపారాధన-
ఆగిపోయే శ్వాసలా కొట్టుకుంటూ,
ఉగ్రవాద చర్చాస్థావరాలై
రక్తాభిషేకాలు కూడా జరుగుతూ,
తలలే కొబ్బరికాయలై పగులుతూ,
మనుషుల ప్రాణాలే
హారతి కర్పూరమై పోవడాలేమిటి?
తీర్థప్రసాదాలకు బదులు
భయాలు, చావులు
లభించే పరిస్థితులేమిటి?
ఆధునిక దేవాలయాలు
శిథిల దేహాలయాలుగా
ప్రాణిసంతతి
పాలబడుతూండడమేమిటి?

దేవుడికి
స్వర్ణాభరణాలు, వజ్రకిరీటాలు
వెండి పీఠాలు, మకర తోరణాలు,
ఆలయానికి మంటపాలు,
గాలిగోపురాలు నిర్మించడం బాగే!
కానీ భక్తులసౌకర్యాలు
పట్టించుకోకుండడం బాధే.

మతం ఏదయితేనేం–
మనిషి అభిమతం ఒక్కటే.
మందిరం, మసీదు, చర్చి
సందర్శనాస్థలం ఏదయితేనేం–
భగవత్ ప్రార్థనాభిలాష ఒక్కటే.

దారులు ఇరుకై
మనసులు కరుకై
పరమత విద్వేషం సరుకై
ప్రార్థనాలయాలపై పరస్పర
దాడులో వంక–
ఉగ్రవాద చర్యల
టార్గెట్‌లొక వంక–
గోడ కూలుళ్లు, బాంబు పేలుళ్లు–
విధ్వంస వినాశక
స్థావరాలౌతు న్నాయి గుళ్ళు.
తరచినకొద్దీ బహిర్గతమౌతోంది–
కుళ్ళు.
పరిస్థితులు గమనిస్తే
ఉద్వేగమై గగుర్పొడుస్తోంది వొళ్ళు!

'ఇంటికన్నా గుడి పదిలం'–
అని కదా
భావనా సంకలనం.
ఇప్పుడు జరుగుతున్న ఘటనలతో–
చెలరేగుతోంది కలకలం.
మతానికీ రాజకీయ రంగులొచ్చి
పెరుగుతోంది ఓ రకం పిచ్చి.

ఆలయ సందర్శనానికీ
ప్రాణ రక్షణ లేని భయభీతులు హెచ్చి
ఆ'లయ'మే సంప్రాప్తిస్తోంది మరిలా
గుడుల్లోనూ జనం చచ్చి.

దైవం మానుష రూపేణ
ఎప్పటికైనా కలిగేనా రక్షణం.
మనశ్శాంతితో మనగలగుతుందా
జనగణ మనం.

***

***(2 అక్టోబర్ 2008)***

# విజయదశ(మీ!?)

ఆయుధాలు
శవ సదృశాలు
అజ్ఞాతంలో చెట్టెక్కే వుంటాయి.
కొలువుకూటం ఏదయితేనేం
వీరులను గుర్తించడం కష్టం.

ఒక
బహిరంగమవవలసిన
రహస్యం కోసం శత్రువు ఆత్రుత.
వేగులవాండ్రు
విస్తరించి సంచరిస్తూంటారు.

ఉండుండి–
ఓ విశృంఖల విహారి,
మొన్నటిదాకా భయభ్రాంతులను చేసి
బోరవిరుచుకు తిరిగినవాడు,
భంగపడి బోల్తాపడ్డ వార్త.

అంతమొందించినవాడు
అనామకుడెలా అవుతాడు.
నివురుగప్పిన నిప్పు
నిటలాగ్నిజ్వలనమవదా!
అంతా సజావే
అనుకుంటున్న వేళ
అన్నింటినీ ప్రశ్నిస్తూ
శరసంధానమవుతుంది
ఉలిక్కిపడిన శత్రువు
ఊరువులు తడుముకుంటాడు.

రహస్య ఛేదనానికి
బయలుదేరిన దండు–
గుండు దెబ్బ తగిలినట్లు
కకావికలమవుతుంది.
కుచ్చులూడిన తలపాగాలు–
క్రుంగిపోతున్న అధికారాలు.



మేధావులు
ముసిముసి నవ్వులవుతారు.
శిష్యులెవరో ప్రయోజకులైనారని
గురువు గుండెమీద చేతితో
గర్విస్తాడు.
కూటమిలో వుంటూనే
ఓటమి వ్యూహరచనవుతుంది.

అంటిపెట్టుకున్న విశ్వాసాలు
అలాగే వుంటాయనుకోలేం.
రాయబారి
తలదిక్కుకెవరో,
పాదాక్రాంతమెవరో,
పడకసీనులో
పారదర్శకమవుతుంది.

ఒంటరిపోరుకు
ఒడిగట్ట గలిగేదెవరో,
తోడువచ్చే
సైన్యకూటముల కోసం
పొత్తులు హత్తుకునేదెవరో,
తెలిసినట్టే వుంటుంది.

ప్రతిజ్ఞలకేం
ప్రతి ఒక్కరూ చేస్తారు.
కొట్టడానికి కాకపోతే-
తొడలు వున్నదెందుకు.
వీరాలాపాలు వీలుకానిదెవరికి?
ఉత్తరుడూ ప్రగల్భ కుమారుడే!

నిజమే-
నిన్నటిదాకా నర్తనశాలవాడే.
ఆడిపాడడమే అందరెరుగుదురు
అంతా సరదాగానే కనబడింది
ఇవాళ రథమెక్కేసరికి
'శమీ శమయతే పాపం' అని
దాచిపెట్టుకున్న రక్తనిధి నుండి
దింపిన విల్లందుకునేసరికి-
రేగిన సుడిగాలి
ఒకటే గజగజ!

ఇంకా ఇప్పటికీ కొందరికి
అపనమ్మకమే-
హస్త పాదముద్రల నర్తకుడు
బృహన్నలేగానీ,
బృహదీశ్వరుడు కాజాలడని.

కానీ-
వచ్చినవాడు ఫల్గుణుడు
అవశ్యముగెల్తుమనంగరాదు అని
ఒకచో ఉదయించిన వివేకం
అహంకృత శిబిరాల్లో
ఇంకిన అపహాస్యమైకం.

శత్రువుకు గురిచూడడం సరే!
అంతశ్శత్రువుల గురించి
ఆలోచించాలి కదా!
శల్య సారథ్యాలెక్కువ.
శరసంధానవేళ-
భూమిలోకి రథం కృంగే
శప్తదైన్య పరిస్థితులు.
బిరబిరా ఎందరో
శిబిరాలు నిర్మించడం సులువే.
శిబి చక్రవర్తులయినా
దానకర్ణులయితే-
దాడులు అనివార్యం.

కర్ణుడీల్గె ఆర్గురిచేతన్ అన్నట్లు
ఆపద పార్శ్వాలు
అధికమవుతూనే వుంటాయి.
అధిగమించాల్సిన కుట్రలు-
అన్నివేళలా పేనుకుంటూనే
వుంటాయి.

దక్షిణమో
ఉత్తరమో
దిక్కు ఏదయితేనేం-
దేశమంతటా ఇప్పుడు
గ్రహణ కాలమే.
తరలించుకుపోయే
వ్యూహాతపనల
తరళ తారళ్యజాలమే.

నీకూ నీవారు లేరు
నాకూ నా వారులేరు
కలిసిపోదాం పదరా అని-
పొత్తుల గానం కుత్తుకబంటి.
నడక మొదట్లోనే-
పతాకం ఎగరేస్తున్న కుంటి.
రగులుతున్న కులాల కుంపటి.

కడపటి వార్తలందే వేళకి
యుద్ధం అనివార్యం అని తెలిసింది.

శత్రువెవరో మిత్రులెవరో
అధికార మదాంధులెవరో
అవకాశవాదులెవరో
ప్రజాపక్షమెవరో
శాంతిస్థాపకులెవరో
ఒడలు మరిచేదెవరో
జడలు విరబోసుకునేదెవరో
చక్రం తిప్పేదెవరో
భారతం నడిపేదెవరో
ఎవరో... ఎవరో... ఎవరో...
దసరా సరదా
పప్పుబెల్లాలూ
వట్టి విల్లంబులూ కాదు.
విజయదశమి నిజపోరాట పటిమ.
భక్తికి శక్తిమాటేమోగానీ- శౌర్యం
ఇప్పుడు శక్తికి భక్తి అనివార్యం.

***

***(9 అక్టోబర్ 2008)***

# చంద్ర యా(త)నం!?

ఎన్నాళ్ల కల!
ఇల నుండి ఎగసి
రోదసిలోంచి పరుగులిడి
మామను చేరాలని



బంధుత్వాలు కలుపుకునేది
భారతీయమే కదా!
ఏళ్లుగా పూళ్లుగా పసివారికి
గోరుముద్దలు తినిపిస్తూ
అమ్మ పాడిన పాట-
చందమామరావే జాబిల్లి రావే...

అందుకోవాలని ఎంత ఆరాటం!
వెన్నెల జాలు కురిసినప్పుడల్లా-
సముద్రమై అలలెత్తిన ఎద.
ఆ పిండి వెన్నెలలు-
ఎన్నెన్ని వలపులు పండి,
దాంపత్య మధురిమలు నిండి,
రసదృష్టితో
సృష్టిని కొనసాగించాయో కదా!

రాదని తెలిసీ
చేరువవ్వాలన్న కాంక్ష.
మారాం చేసిన శ్రీరాముడికి
అద్దంలోపట్టి
అందివచ్చిన ఆనందాన్నిచ్చిన
అనుభూతి కథలు.
చంద్రునితో ముడిపడిన
మానవ హృదయ సుధలు,

జానపదుల నుండి
జ్ఞానపీఠుల వరకూ
జాబిల్లిపై అల్లుకున్న పాటలు.
చలన చిత్ర సంచలన విజయాల్లో
ఆ దృశ్య శ్రవణ ఆనంద క్షణాలు..

పిల్లల నుండి పెద్దల దాకా
చందమామ పత్రికగా
కథలు, కబుర్లతో పెనవేసుకున్న
సంస్కార చరిత్ర.

నేటికి కదా!
మనకి మనం మామను చేరుతోంది.
ఎన్ని యుగాల నిరీక్షణో ఫలిస్తున్న
ప్రయాణంలో మన మొదటి మెట్టు.
తెలుసుకుందామనే కదా...
ఆ జాబిల్లి గుట్టు.
శాస్త్రసాంకేతికాభివృద్ధితో
దొరికింది పట్టు.
భూకక్ష్య అవతల
మన తొలి ప్రయోగం
చంద్రయాన్ ఒకటి–
అమెరికా రష్యాలతో పోటీ.
లూనార్ క్లబ్‌లో సభ్యత్వ భేటీ.

ప్రస్తుతానికి
మానవరహిత ప్రయోగమే.
అయితేనేం–
ఇది ముందడుగు
మన తొలి అడుగు.
త్రివర్ణ పతాకం
చంద్రమండలంపై ప్రతిష్ఠించే
చారిత్రక విజయ విహారం.

చందమామ చెంతచేరి
అందంగా వంద అడుగుల
సామీప్యం నుంచి
ఏకాదశ పరికరాలతో
"నీలో ఏముందో ఏమో
మనసునిన్నే కోరింది..."
అంటూ
ఎత్తుపల్లాల అన్వేషణ
చంద్రునిలోని నిజాలనూ,
ఖనిజాలనూ గుర్తించే గవేషణ.

రష్యా, అమెరికా
యూరప్, జపాన్, చైనాల తర్వాత
ఆరవ దేశంగా చంద్రయానం
చేస్తున్న–
చందమామకు మనం,
మనకు చందమామ– ఆరోప్రాణం!
అందుకే ఈ ప్రయాణం.

మూడువందల అరవైకోట్ల ఖర్చు!
డబ్బు కాదుగా పట్టుకుపోయేది.
చంద్రునితో ముడిపడ్డ
రసానుభూతి యానం–
సెన్స్‌నూ సైన్స్‌నూ కలగలుపుకున్న
అద్భుత గమనం!
సాటి మనిషిని పట్టించుకోకున్నా
చంద్రుని చేరాలన్నా!
సెకనుకి
ఎనిమిది పాయింట్ తొమ్మిది
కిలోమీటర్ల వేగంతో–
మూడు లక్షల ఎనభై నాలుగువేల
కిలోమీటర్ల ప్రయాణం.
మొదటి అంచెలోనే
విజయవంతంగా విడివడిన
ఉపగ్రహం.
అక్టోబర్ ఇరవై రెండు
భారతీయ చరిత్రలో
మనకు హస్తగతమయిన
సైన్స్ పరిమళాల సంభరితమైన

ఓ పూల చెండు.
ఆటాడుకుందాం రండు!
నిన్న మొదలెట్టిన ప్రయాణం–
అయిదు రోజుల్లో
గమ్యాన్ని చేర్చి,
ఆనందంగా మొదలవుతుంది
చంద్రభ్రమణం,
చంద్రుని వేల వేల దృశ్యాలను
సొంతం చేసుకునే
కెమెరా ఫొటోల ముద్రణం.
రెండిళ్లవారి కబుర్లలా
రెండేళ్లపాటు పదకొండు పరికరాలు
చంద్రుని చేస్తాయిపలకరింపులు.

కొండలు, గుట్టలు, లోయలు,
ఖనిజ నిక్షేపాలు, అణుధార్మికాలు
ఒకటేమిటి?–
చంద్రుని ఉనికినీ, మనికినీ
పి.ఎస్.ఎల్.వి.
ప్రయోగం సక్సెస్‌గా
లక్ష్యం చేరిన విజయంతో
మనకు కరతలామలకం చేస్తుంది.
ఆనంద తరంగాలను
ఉప్పొంగిస్తుంది.

కలలు కనడమే కాదు–
సాకారం చేసుకునే
సాధన మనది.

శాస్త్ర సాంకేతికాభివృద్ధిలో
ఎంత ఎత్తులకు ఎదిగినా,
అహంకరించక
ఇంకా అందుకోలేని
ఒక అతీతశక్తికి వినమ్రమయ్యే
సంప్రదాయ సంవిధానం వుంది.
ఎన్ని నిరసనలతో
ఎవరు ఎలా గళమెత్తినా–
రసనపై– నామ మంత్ర జపంతో
ఇంకా ఒక దేవుడు.

దేవుడు దేవుడే!
అంతా ఒక దేవులాట దేవుడే మరి!
ప్రాణ రహస్యం పట్టుకున్నా–
ఆత్మశక్తిని ఆవిష్కరించుకున్నా–
మనల్ని మనం తెలుసుకునే
యాత్రలో
మార్గాలు ఎన్నయినా
మానవుడు మహనీయుడే!
చంద్రయానాలు
విజయవంతం చేసుకున్నా
జీవనయానంలో దయనీయుడే!
అయినా– కావాలి
యాతనాధిగమనంతో
నిత్యోదయ భానుడే!

***

***(23 అక్టోబర్ 2008)***

# గెలుపు మలుపులో...

అమ్మమ్మ చచ్చిపోయింది
మనుమడి దిగ్విజయాన్ని కాంక్షించి
మెయిల్ ద్వారా ఓటేసి
ఎనభై ఆరేళ్ల జీవితాన్ని దాటేసి
మృత్యుశాంతిలోకి
శాశ్వతంగా వెళ్లిపోయింది.

ఓ భామా!
ఒబామా గెలుస్తాడనే ధీమా.
తెల్లసౌధం నల్లనయ్య మ్రోలనే.
'దునియా హమ్ జీతేంగే'
అమ్మమ్మ 'దువ్వామ్'
ఆశీర్వాదం ఉండద్దూ!

ఎన్నడూలేనంత ఉత్కంఠ-
అమెరికా అధ్యక్ష పీఠం
ఎవరి వశమవుతుందని,
హిల్లరీ క్లింటన్‌కే జెల్లకొట్టి
డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా
ఆఫ్రో అమెరికన్ ఒబామా
తొలి జెండా నాడే ఎగరేసాడు!
రిపబ్లికన్ అభ్యర్థి
జాన్ మెక్‌కేన్‌కు
గొప్ప ప్రత్యర్థిగా నిలిచాడు.

ప్రపంచపు బాధ
అమెరికాది అయ్యిందో లేదోగానీ-
అమెరికా బాధ
ప్రపంచానిదయ్యింది.

తుంటిమీద కొడితే
మూతిపళ్లు రాలుతాయో లేదోగానీ,
అమెరికా ఆర్థికమాంద్యం-
అనేక దేశాలను
అతలాకుతలం చేసింది.
స్టాక్‌మార్కెట్ ఉత్థానపతనాల
ఆరోప్రాణం...



కాదు కాదు... పంచప్రాణాలు
అమెరికా తొర్రలోని చిలకలోనే
ఉన్నాయి
ఎవరెన్ని నొక్కులు నొక్కినా
అదే సన్నాయి.

ఏ రాయి అయితేనేం–
అధికారం ఎవరిదయితేనేం–
మారాల్సింది,
మార్పు రావాల్సింది
ఆధిపత్య ధోరణికి
అమెరికా ఏకపక్ష యుద్ధోన్మాదాన్ని
ప్రచారాస్త్రాలలో
అమెరికా ఎన్నికల పార్టీ ఏదీ
ఎత్తనే ఎత్తలేదు.
ఎందుకంటే అదెలాగూ మెత్తని పులి.

ఇరాక్ ప్రజలపై
అధికార రిపబ్లికన్ మారణహోమాన్ని
డెమొక్రటిక్ కూడా
క్రిటికల్‌గా ఎండగట్టనేలేదు.
అక్కడ మౌనాన్ని
శిరోధార్యం చేసింది.
అవును మరి
దేశభక్తి దేశభక్తే!
సద్దాంహుస్సేన్‌ను
మట్టి కరిపించి
భద్రంగా వున్నామని–
అమెరికాన్ సగటు పౌరుడి విశ్వాసం
‘ఏగేసి’
సంరక్షింపబడుతూనే వుంది.

శ్వేతసౌధ అధిష్ఠానం
ఎవరిదయినా–
మనకు ఒరిగేదేమనే కదా ప్రశ్న!
ఒబామా అనుకూలుడో,
ప్రతికూలుడో అదికదా సందేహం?

ఒబామా దగ్గర
ఆంజనేయుడి బొమ్మవుందని
ఆయన విజయానికి
ఇక్కడ హోమం చేసిన వాళ్లున్నారు.
ఔట్‌సోర్సింగ్ నిలిపివేసి
ఒబామా
భారతీయుల డాలర్ల కలలకు
గండికొట్టేస్తాడని
భయపడుతున్న వాళ్లున్నారు.

హెచ్ వన్ బీ వీసాలను
తగ్గించాలని
తలపోసాడని ఒబామా
‘ఇలా అయితే ఎలా మామా’ అని
ఇంజనీరింగ్ కుర్రాళ్లు
ఇంగితంతో ఇక్కట్లు ఊహించిన
ఊహాచిత్రాలు
ఉనికిలో మనికిలో యథార్థాలై
ఉరకలెత్తిస్తాయని
భయపడడమే వృథా!
అమెరికా ఆర్థిక వ్యవస్థే కాదు,
సామాజిక జీవనసరళి–
ఇవాళ
భారతదేశంతో
ముడిపడి వుంది సదా!

మన మేధస్సు వద్దనుకుని
మనగల సత్తా–
వారి విదేశాంగ నీతికే
విఘాతం కాగలదన్న
విచికిత్స వారు పడక తప్పదు.

ఎంత కాదనుకున్నా
కొంత కలివిడి నడక తప్పదు.
అణు ఒప్పందం
అనుకూలంగా మార్చిన అమెరికా
అటామిక్ రియాక్టర్లకు
న్యూక్ టెక్నాలజీకి
మార్కెట్ విలువ కల్పించుకోడానికే
ఆ పని చేసిందని ఎరుగమా!

వాణిజ్యరంగంలో
భారతీయంతో సానుకూలత–
మన ఉద్ధరింపునకు కాదు,
వారి మంచికే అని వారికీ తెలుసు.
'వార్' పేరుతో
తమ సైనికుల ప్రాణాల అలుసు–
అధిగమించాల్సిన బాధ్యతా తెలుసు.
రాజీలేని పోరాటమంటూనే
అమెరికా యుద్ధ సైనికుల రక్షణ
ప్రధాన బాధ్యత అంటే–
ప్రశ్నకు సమాధానం చెప్పడమే
అమెరికన్ ఓటర్ చేసే పని.

ఒక్కటి మాత్రం నిజం!
శ్వేతసౌధం ఆలోచనల్లో
గణనీయమైన మార్పు వచ్చింది.

చచ్చిపోయింది–
ఒబామా అమ్మమ్మే కాదు,
ప్రపంచమంతా
'అమ్మమ్మా' అని ముక్కున
వేలేసుకున్న–
అమెరికన్ జాత్యహంకారం!
అదీ ఈమారు–
అమెరికన్ ఎన్నికల ప్రధాన సారం.
ఒబామాదే
అసలుసిసలు
విజయవీర సమరం.
ఇక తెరుచుకుంటుందిలే
ప్రపంచ పరిణామాలలో ఆశగా
ఓ సరికొత్త ద్వారం.

***

***(6 నవంబర్ 2008)***

# భిక్షాం దేహి భ(గ)వద్గీత

అడుక్కోనిది ఎవరు
'భవతి భిక్షాందేహి'
స్వరంలో మార్పు
పదజాలంలో మార్పు



మనిషి మనిషికీ అభ్యర్థన
మారెప్పా! మారునప్పా!
అప్పా! అయ్యా! అమ్మా! తల్లీ!
బాబూ! సార్! మేడమ్!
సంబోధన ఏదయితేనేం–
ప్లీజ్ ప్లీజ్ ప్లీజ్...

అడుక్కోవడం అడుక్కోవడమే.
తప్పనిసరై అడుక్కోవడమే.
అడుక్కునేవాడికి
అడిగిందే ఇస్తారన్న నమ్మకం
వమ్ముకాదని గ్యారంటీ ఏదీ?
ఇవ్వకపోయినా
అడగక తప్పదు.
'అయినను పోయిరావలె హస్తినకు'
భారమైనా రాయబారాలు తప్పవు.

భగవద్గీతయినా–
అడుక్కున్నవాడికి
అడుక్కుపోకుండా,
పోరాట పటిమకు ఇచ్చిందే.
అయిదూళ్లిమ్మని కదూ
పాండవుల రాయబారం.
తమ వాటా తమకు రానివ్వమనే
ధర్మరాజు అడిగింది.
అన్నగారి మాటను
తమ్ముళ్లందరూ తలదాల్చారు.
పాంచాలి సైతం
పరాభవదగ్ధ అయినా–
లోన యుద్ధం కోరుతూనే
అయిదూళ్ల ప్రతిపాదనకు
అయిష్టంగానే ఒడంబడింది.

అంతా అడుక్కున్నవారే!
తమకు రావలసింది అడుక్కున్నా–

ఇచ్చేవాడికి
పుచ్చుకునేవాడు లోకువ చందాన
సూదిమొనమోపిన స్థలమైనా
సుయోధనుడు అంగీకరించలేదు.
తెగేసి చెప్పాడు కనుకే
రారాజు అయ్యాడు.
అదయినా నయం కదూ!
కదనానికి కదలడానికి.

ఇదేం చోద్యం?
ఇక్కడంతా అనుకూలమేనంటారు.
అయిదూళ్ల స్థాయిలో ఓ రాష్ట్రం.
అదీ అడుగుతోంది...
అన్నదమ్ముల మధ్యే ఈ
అడుక్కోవడాలేమిటసలు?
అభివృద్ధిని అడ్డుకుంటూ
అడుగడుగునా అవమానిస్తూ,
విషతుల్య వంచనలతో
అడవి పాల్జేస్తూ,
అంధపాలన సాగుతున్నందుకేగా
ఆంధ్ర నుండి విడివడాలని
ఆరాటం మొదలయ్యింది.
ఒక ధృతరాష్ట్ర కౌగిలి రాజకీయం.
ఒక పరాభవ సభాపర్వం.
అందుకేగా రగులుతోంది.
అది నాటి భారతం కనుక-
అయిదూళ్ల వ్యవహారం.
ఇది ఆధునిక భారతం...
రెట్టింపైన ఆత్మగౌరవ భారం.
పది జిల్లాలూ
ఎదరగిలినవే.

తెలంగాణం దుశ్శాసన హస్తగతం
ద్రౌపది వలువలూడ్చినట్లు
తెలంగాణం మధ్య లంగా
లాగేసేంత పరాభవ దగ్ధ మానసం.

ఇదేమీ సామ్రాజ్యదాహం కాదు.
తొడగొట్టింది దుశ్శాసనులైతే-
అంకపీఠానికి
తెలంగాణను ఆహ్వానించిన
వంచనే అయితే-
కొమరం భీములే పుట్టుకొస్తారు.
ముద్దులకృష్ణుడూ ఇక్కడ
చెల్లిచీరను కాచేవాడిగా కాక,
చెలుల చీరలు దోచేవాడైతే-
చెల్లుబాటు కాలేదు.

విశ్వసించే కదా
రథసారథ్యాలను అప్పగించేది
శల్యులుగా మారినవారితో
సదాప్రమాదమే!

అడుక్కున్నవాడు
అర్జునుడు కూడాను.
అయితేనేం సవ్యసాచి!
కదన కుతూహలుడే.
అనవసర రక్తచరిత్ర-
అతగాడికీ ఇష్టంలేదు.
పైగా
పోరాడాల్సింది-
సహోదర బంధుగణం మీదనని
ఖేదుడౌతూనే వున్నాడు

యుద్ధం చేయను విడిచిపెట్టమని
ఇన్నాళ్లూ అడుక్కున్నాడు
అడుక్కునేవాడికి
భగవద్గీత ఇచ్చినందుకే కదా
చివరకు ధర్మం గెలిచింది.
నీరుకారిపోకుండా
పోరాట పటిమ
నూరిపోసినట్లయింది.

చక్రం తిప్పేవాడు
చక్రం పట్టనని తెగేసి చెప్పినా
విజయుడు ఆత్మబలిమితో
రణరంగ వీరవిహారం చేసింది.

వ్యూహాలకేం
ఎన్నయినా పన్నుతారు.
అభిమన్య కుమారులు
పద్మవ్యూహాల్లో చిక్కి-
అమరులవుతూంటారు
కౌరవ పతనానికి
గౌరవ భీష్ములూ ఏమీ చేయలేరు.
దుర్యోధనుడు
మడుగులో దాగక తప్పదు.
అహంకారంతో మీసం మెలేసి
తొడగొడితే తొడలు విరగకా తప్పదు.

అన్నదమ్ముల పోరు
అసలు సిసలు రాజకీయం తాలూకు
మహాభారత యుద్ధమే అయితే
అంతా విష్ణుమాయే అవుతుంది.
కర్ణుడు వామపక్షమే అయితే
ఆరుగురెవరో పడగొట్టేది-
అతనికి మాత్రం తెలియదా?

కృష్ణుడు కేంద్రమయితే
నడిపేదీ, నడిపించేదీ
ఎంతతానయినా-
యుద్ధం చేయాల్సింది
అయిదూళ్ల ప్రతీక రాష్ట్రంగా
అడుక్కున్న పాండవులే!
తప్పక భగవద్గీతే శరణ్యం.
అదే ఉద్యమస్ఫూర్తి రణం
తేలనీ మరి తెలంగాణం!

***

***(27 నవంబర్ 2008)***

# హ్యాపీ న్యూ ఇయర్!

కాలం
అవిచ్ఛిన్నం
గతం కొసను
ఈ ఆగతం తొలిధారతో
ముడివేయడమే
చేసే పని.
ఏటికేడాది ఓ కామాయేగానీ
కాలం ఒక మహావాక్యం.
పుటలు పుటలుగా
తెరుచుకుంటూనే ఉంటుంది.

ఒక నక్షత్రం
ఒక ఎడారి
ఒక సముద్రం
ఒక నేల
అన్నీ ఇంకించుకున్న మనిషి
నిశిని నుసిచేసి
ఉదయాన్ని ప్రజ్వలింపచేసి
ఆదాటున దాటివచ్చేసి
ఇక్కడ
అంతా కొత్త

ఒక కంగారు
ఒక బంగారు
ఒక ఆందోళన
ఒక హిందోళన
స్వరాలు భాస్వరాలై మండినా
సుమశరాలై సంధించినా
రాగం తెగదు.
యోగం తూగదు
అంతా ప్రాపంచికమే
అర్థంలోనే పరమార్థం




ఎవడు చెప్పాడు
అంతా మారిపోతుందని?
ఎంత ఆశ!
నిన్నటి దాకా
విచ్చుకోని మొగ్గ
చిట్లిన నీటి బుగ్గ
సిగ్గా ఎగ్గా-
ఎట్లా అవుతుంది రసదుగ్ధ.
కౌగిలించే ముగ్ధ.

నిజమే
ఒకటే ఆరాటం
పోరాటంలోనే కోలాటం.
అదేకదా కాంక్షల వాటం
తెరుచుకుంటుందని ఓ కొత్త కవాటం
పరస్పరాకాంక్షల
భవిష్యత్ చిత్రపటం.

కరచాలనాలు
దరహాస వందనాలు
బొకేల రూపెత్తిన పూలవనాలు
పరుగులిడే జనగణమనాలు
పుల్లారెడ్డి స్వీట్లు
మందహాస మందస డ్రై ఫ్రూట్లు
ఇయర్ ప్లానర్ షీట్లు
క్యాలెండర్‌లు
డైరీలు
గ్రీటింగు కార్డులు
ఆశ చిగురిస్తూనే ఉంటుంది.
జీవితం ప్రవహిస్తూనే ఉంటుంది
విధ్వంసం నుండయినా,
వినాశనం నుండయినా
విత్తనం మొలకెత్తడం మానదు
పెత్తనం చిత్తాన్ని చిత్తుచేయలేదు.
ఎంత ఆడుతున్నా
అమెరికా ఆర్థికమాంద్యం
దాండియా–
గుడ్‌మార్నింగ్ ఇండియా
కదం బఢాతె ఛలో
పొలో పొలో పొలో
అంతా గొర్రెల ఫాలోయింగే.

ఇపుడు వలస ఓ లాలస
ప్రతి యువ హృదయమూ
విదేశీ గమన మానస
మాతృభాషంటే నస
మోజుతో అనుక్షణం ఆంగ్ల శ్వాస
డాలర్లపై ధ్యాస
వేదికలపై విమర్శ
వేతనాలతో పరామర్శ
చేతివేళ్లకంతటికీ ప్లాస్టిక్ స్పర్శ.

మేటాస్‌తో సత్యమేకాదు
టాస్ వేసిన
జూద పాచిక వ్యవహారంతో–
మానవ విలువల సత్యాలన్నింటికీ
అతలాకుతల వ్యవహారం
వెళ్లకండి కోలుకుంటాం అన్నా–
కొడుకులు కూతుళ్లు విదేశాలకు
పెద్దలు వృద్ధాశ్రమాలకు
నిన్నమొన్నటి దాకా లేని
గ్రహణాలు–
సూర్యచంద్రులకు నిత్యవ్రణాల్లా
మన కుటుంబ పరగణాలు
ఎవరు ఎంచుతున్నారు
ఆత్మీయతల పరిగణనాలు?

ఆకాశం కూలదు
భూమి చీల్చుకుపోదు
కూలేది భరోసాలే
చీల్చుకునేది ఎదల దిలాసాలే
ఎప్పుడూ ఒక ఏడుపు
అదీ ఉండేదే

ఎప్పుడూ ఒక విరుపు–
అది పండేదే
విత్తంలో లేదు ఏదీ
నీ చిత్తంలో వుంది
కూడికలైనా, తీసివేతలైనా
గుణకారాలైనా
భాగాహారాలైనా
మనిషి మొత్తంలో వుంది.

అన్నమాటే మళ్లీ మళ్లీ–
మతం చెప్పినా
గతి తార్కిక భౌతికవాదం చెప్పినా
నిన్ను నువ్వు తెలుసుకో!!
నీ దారిన మసలుకో
భావాలకైనా
ప్రభావాలకైనా
చోటిచ్చేది నీవే
మాటిచ్చేది నీవే
దాటొచ్చేదీ నీవే.

తామరాకున నీటిబొట్టు
సుఖసంతోషాల పట్టున కూడా
వేదనావాదాలతో దిగగొట్టు
దాటివచ్చేసావని ఓ గట్టు
అహంకరించి–
మూలాల పట్ల వహించకు బెట్టు.

గత వత్సర అనుభవాలు
గతులనింక సవరించును
నవవత్సర ఆశాకాంతులు
నవజీవన మందించును
దిగాలుగా, మృగాలుగా కాదు
ఉషారుగా మనుషులం
మనుషులంగా బ్రతుకుదాం.
మానవతను బ్రతికిద్దాం!
హ్యాపీ న్యూ ఇయర్!!

***

*(1 జనవరి 2009)*

# తెల్లచీకటి చీల్చే నల్లసూరీడు

నలుపంటే ఇక సువర్ణం
స్నేహ బంధ త్రివర్ణం
ఒక అతలాకుతలం నుండి–
మొగ్గతొడిగిన శీతలం.



అబ్రహం లింకన్
మార్టిన్ లూథర్‌కింగ్
నెల్సన్ మండేలా
ఉదాత్త ఉత్తాల ఆఖ్యపరంపరలో....
అధునాతన నామం–
ఒబామా.

తెల్లదొరల నుండి
నల్లదొరల పాలనకు పట్టాయి–
భారత్‌లో రెండువందల ఏండ్లు
గడిచిపోయాయి పూండ్లు

సోవియట్ పతనానంతరం
ఏకైక అగ్రరాజ్యం అమెరికా
అగ్రసనాధిపత్యానికి–
తొలిసారి చరిత్ర తిరగరాసిన
మహోజ్జ్వల పట్టాభిషేకం
ఒబామా.

నల్లసూర్యుడుదయించాడు
ఇక తెల్లచీకట్లు
అంతరించాలి
ఔను!
చీకటంటే నలుపనుకున్నాం ఇన్నాళ్లూ
సత్యం బయటపడ్డాక–
బుష్ మీద బూటు విసిరిన
విశ్వజనీన సందర్భం
స్పష్టంగానే వ్యక్తమయింది.

డాలర్ కిరణాల
ఆర్థికమాంద్యమే
ఆవరించిన శ్వేత తమస్సు
చమురు గుండె సెగలు రగిలి
ఇరాక్‌లో అమెరికన్
సైన్యపు బూట్ల కవాతు
తాలిబన్ల దాడితో భీతిల్లిన
అఫ్ఘన్‌లో శాంతిస్థాపన
నిలద్రొక్కుకునేనా?
అశేష జనవాహిని
హర్షధ్వానాల మధ్య

తొలి ఆఫ్రికన్ అమెరికన్
అధ్యక్షునిగా ఒబామా ప్రమాణం!
నవశకానికి నాంది
జరిగినందుకు ప్రణామం!

రాత్రికి రాత్రి
వ్యవస్థలో మార్పు వచ్చేస్తుందని
కలలేమీ కనలేము సరే-
సామ్రాజ్యవాద దురహంకారం నుండి
అమెరికాను
వినమ్రం చేసి
ప్రజాస్వామ్యతకు శ్రీకారం
పొడచూపగలదా-
లేక అవుతుందా-
తీర్థం దారి
తీర్థానిదే
ప్రసాదానిది ప్రసాదం దారే!

భ్రమలేమీ పడద్దు
శ్రమలేమీ మరువద్దు
ముస్లిం దేశాలకు స్నేహహస్తం చాచి
బిన్‌లాడెన్
హృదయాన్ని దోచుకోగలడా-
ఒబామా!

శత్రువైరుధ్యం సమసి
మిత్ర సారథ్యం వెలసి
శాంతి సుమాలు విరిసి
ప్రపంచమంతా కలసి
ప్రగతి అడుగువేస్తుందా!
భూగోళం గొడుగు నిలుస్తుందా!

నవసంకల్ప సూర్యుడే- ఒబామా.
అతుకుల సంస్కృతి
అమెరికా బలహీనత కాక బలమేనని
అమెరికా సమాజపు
పదకొండు లక్షలపైగా
హిందువులనొక శక్తిగా గుర్తించడం-
భారత ప్రాబల్య నిదర్శనం.
ఒబామా దీర్ఘదర్శనం

తన బాల్యాన్ని
ఇండోనేషియా ముస్లిం మూలాల్లో
గడిపినవాడు నేడు
అనుసరించబోయే వైఖరి గూర్చి
ఆసక్తితో వున్న
వ్యతిరేక దేశాలున్నాయి
అనుకూల వైఖరి పేరిట
అననుకూల ఆచరణలతో
ఆగ్రహించిన దేశాలున్నాయి
ఒక సంక్షోభ తరుణంలో
బాధ్యత నెత్తినెత్తుకున్న వాడికి
హర్షధ్వానాల పూలెన్ని వున్నా
ముందు దారిలో
గుచ్చుకోబోయే అన్ని ముళ్లున్నాయి

ఉగ్రవాద వ్యతిరేక యుద్ధాన్ని
సమర్థించాడు.
అంతర్జాతీయ ఉగ్రవాద శక్తులను
హెచ్చరించాడు
తమ జీవన విధానానికి
అమెరికన్లు ఎవరికీ క్షమాపణలు
చెప్పనవసరంలేదని ఎలుగెత్తి
పలికాడు.

యుద్ధోన్మాది ముద్రతో
బుష్ నిష్క్రమించాడు
నల్లసూర్యుడుగా
విదిలించుకున్న నిద్రతో
ఒబామా సాక్షాత్కరించాడు.

అగ్రవాదాన్ని త్యజించి
ఉగ్రవాదాన్ని అణచి
అందరినీ కలుపుకుపోయే
కొత్త మార్పుకు కాణాచి అని
ఒబామా అనిపించుకుంటాడో-
శ్వేతసౌధానికి
పాతకథలే పోతపోస్తాడో
కాలమే సమాధానమిస్తుంది
ఇప్పటికిది గొప్ప మార్పు
అమెరికా నేడు
నల్లసూర్యుడుదయించిన తూర్పు.

***

*(22 జనవరి 2009)*

# సమ్ డాగ్ కలియనీరు

మనం వేరు
సిగ్గా ఎగ్గా– చిమిడిపోవడమే
కుట్ర ఎవరిదయినా ఇమిడిపోవడమే
వ్యతిరేకాత్మకతా వీక్షణం
వాస్తవ ప్రతిబింబమనే
ఆనంద లక్షణం
మన దరిద్రాన్ని గ్లోరిఫై చేసినా
మన సంపన్నతను ఈసడించినా
మననేకదా మహోన్నతీకరించారని
మన ఆత్మాభిమానాల తాకట్టుతో
ఆనందపు బురదలో పొర్లుతాం
కన్నీటి పన్నీటి చిలకరింపులైనా
సౌగంధిక శ్వాసలతో
గంతులు వేస్తాం

దేనిదారి దానిదే
ఎన్‌కౌంటర్ జరిగినా
ఉన్మాద యువకుల అంతరంగాల్లో
అణువంతయినా
భయస్పృహ వుండదు
అదీ ఓ ఘనతే
అద్భుత చలనచిత్ర సంరంభమే
మీడియా మసాలా అద్భుత
దృశ్యశ్రవణ స్పర్శానురాగమే
ఆగని మృగాళ్ల వీరంగ గాథలన్నీ
నెగిటివ్ కీర్తిప్రతిష్ఠల
మన జయప్రభలే
గొప్ప సంచలన కాంతిలావాలు
హీరోల్లా పరిగెత్తే ఆటోవాలాలు

నిజమే గొప్ప సంగీతం
ఎ.ఆర్.రెహ్మాన్‌కు
ఆస్కార్ ఆశలకు అద్భుత ఆస్కారం
పాశ్చాత్యులను పరవశింపచేసేందుకు
శాడిస్టు బుర్రతో తీసిన చిత్రాన్ని
ఫైవ్‌స్టార్‌తో అలంకరించి
అద్భుత చిత్రరాజంగా
అహో ఓహోలు కురిపించేది మనమే



స్లమ్‌డాగ్ మిలియనీర్
విదేశీ ఆనందానికి
మేధావితనం పేరిట చిత్రించిన
భారతదేశ నగ్న చిత్రం
అరిందమ్‌చౌదరి భావనలోని
ఆరిందాతనాన్ని ఆలోచించేదెవరు?

శాంతారాంలోని ఆర్తికానీ
సలాంబాంబే వాస్తవికతకానీ
సిటీ ఆఫ్ జాయ్ నిజాయితీకానీ
అణువంతయినా లేక

వీధి చివర్ల చెత్తనంతా
అందమైన ప్యాకింగ్‌లో చేర్చి
ఎదుగుతున్న భారతాన్ని
ఎద ఓర్వలేక
ఎకసెక్కంచేసేందుకే తెరకెక్కించినా
ఎదకు హత్తుకుంటున్న మనం.

ఔను! నిజంగా మనం వేరు
గొప్ప సహనశీలురం కదూ
గొప్ప మానవతా వాదులం కదూ
అవతలివారి స్వేచ్ఛ కోసం
ఎదుటివారి స్వాతంత్ర్యం కోసం
స్వచ్ఛందంగా బందీలుగా,
బానిసలుగా
రూపొందేందుకు సిద్ధమయ్యే
ఉదారవాదులం కదూ
ఉమ్మేసినా తుడుచుకుపోయి
ముఖాన చిర్నవ్వులు చిందించే
గొప్ప పోటుగాళ్లం కదూ
మురికివాడలు
బహిరంగ పాయిఖానాలు
పసిపాపలపై అత్యాచారాలు
ప్రేమ పేరిట హింసాత్మక దాడులు
చీకటి జగత్తు
వ్యభిచారం మత్తు
బాలకార్మిక వ్యవస్థ
వ్యాపారాత్మక మౌతున్న
భిక్షాటన అవస్థ
రవాణా అయ్యే ఎయిడ్స్ లారీలు
అంబులెన్స్‌కు దారి ఇవ్వని
ట్రాఫిక్ జామ్‌లు
కాల్‌సెంటర్ల కథనాలు
మోసాలు దోపిడీల సత్య కథనాలు
ఇవే మనం చూసి ఆనందించే
గణతంత్ర వేడుకల్లోని
సంచార శకటాలు

ఎందరు వీక్షించారు
గుండెమీద చెయ్యేసుకు చెప్పండి
రిపబ్లిక్ డే పెరేడ్‌ను
రాజధాని రోడ్డు మీద
అన్నమయ్య వేంకటేశ్వర శకటం
కానీ
రాష్ట్ర పెరేడ్ గ్రౌండ్‌లో
ప్రాచీన భాషా మహోజ్జ్వలత
శకట విన్యాసంగానీ
చూసింది ఎందరు?
పులకించింది ఎందరు?

మనకు అవేవీ ఆనవు
ఎంత పేదలమయినా
అభివృద్ధి పథంలో
ఆర్థికంగానే కాదు
ఆధ్యాత్మికంగానూ ఎదుగుతున్న
మహోన్నత భారతం మనది
పాశ్చాత్యీకరణ ప్రభావాన్ని
వదిలించుకుని విదిలించుకుంటే
ప్రపంచాన్ని నడిపించే సత్తా మనది.
ఆమాట అంటేనే
ప్రభుత్వానికి బాకా అనుకునే
ఒక విచిత్ర మనస్తత్వం మనది

ఆర్థిక మాంద్యాలతో
యుద్ధకాంక్షలతో
అభివృద్ధి చెందిన దేశాలు
అతలాకుతలమైపోతున్నా
అమెరికా సంస్కృతినే పొదుపుకుని
అంతరంగంలో కీర్తిస్తూ
మనదేశాన్ని 'స్లమ్‌డాగ్' అన్నా
చంకలు ఎగరేసే చందం మనది

మన దేశ ఉనికినే
అపహాస్యం చేస్తున్నా
అందుకే విదేశీ అవార్డులు
వచ్చి పడుతున్నా
ఆస్కార్ అవార్డ్ పొందే స్థాయిలో
మెరిసిపోతున్నామని
మురిసిపోతున్నాం తప్ప
మన బిగ్ బి పాలిటి
మంచి ఆలోచనాలక్షణమైనా లేక
బాలీవుడ్ ఇంతకన్నా
మంచి సినిమాలే తీసిందన్న
మాట విస్మరించి
అద్భుత కళాప్రతిభ అంటూ
నిజంగానే చొంగ కారుస్తున్నాం

స్లమ్‌డాగ్ మిలియనీర్
మన అందాలను కాక
వికృత నగ్న చిత్రాన్ని గీసి
పాశ్చాత్యుల శాడిజాన్ని తృప్తిపరిచే
ఒక సంకల్ప సిద్ధ
మనకు తెలియని అన్పించని కుట్ర
ఆస్కార్ నామినేషన్
పులిమీద పుట్ర
ఆలోచించదలచుకోకపోతే
ఎలాగూ మనం వేరు కదా
దుప్పటి కప్పుకు పడుకుని
కలగందాం
సిగ్గులేకుండా ఇలాగే ఉందాం.

***

***(29 జనవరి 2009)***

# పాప నవ్వుకు ఆస్కారం

మొన్నటిదాకా తొర్రి నవ్వు
ఎగతాళి ఎగసి మూసేసుకున్న
పెదవులు
అయినా పైన కనబడే చిరుకంత
మొహంపై కనుదోయిలో
కన్నీటి ముంత.



గర్భిణిగా షిమ్లాదేవి
గ్రహణ సంచారం చేసిందనా–
పాపమా, శాపమా–
అంధవిశ్వాసమా–
ఏదయితేనేం?
వెర్రిజనాలు 'మొర్రి' అనేగా అన్నారు
హేతువేదయతేనేం?
నవ్వుకూ, నవ్వువల్లా,
వెలివేయబడిన
మెలితిరిగే వెతల కథ
అవ్యక్త వ్యథ.

చిన్నపిల్ల కదా!
చితికిపోదా మనసు
తొమ్మిదేళ్ల వయసు
తొర్రిపెదవిలో తొండదూరిందని
గేలింతలు
అందరు పిల్లల్లా నవ్వుతూ–
తుళ్లింతలతో, కొట్టలేని కేరింతలు
అప్పుడొచ్చాడు
మెగాన్‌మిలన్
మెచ్చదగిన దర్శకుడు
వాస్తవ జీవితాన్ని
ఆ గ్రామీణ బాలిక జీవన ఘటనాన్ని
డాక్యుమెంట్ చేసినవాడు.

చిత్రీకరణ క్రమంలోనేకదా–
చిన్నారికి చికిత్స అందిందీనూ!
నలభై అయిదు నిముషాల్లో
నాణ్యమైన నవ్వును సృజించే
వైద్య చికిత్సకై–
రోజులు, నెలలు కాదు,
తొమ్మిదేళ్లు ఎదురుచూసిన బ్రతుకే.
బంగారు పాపాయేగా తల్లికి.

ఇవాళ
అత్యున్నత బహుమతి పొందింది
పాపాయి నవ్వింది
వెలివేయబడినట్లున్న బాలిక
వేనోళ్ల కీర్తించబడింది
ప్రపంచం యావత్తూ
ప్రతిష్ఠాత్మక ప్రశంసలందించగా
పరవశించి పకపకలాడింది

స్మైల్ పింకీ స్మైల్!!
మీర్జాపూర్ రాంపూర్
దోబోహి గ్రామం
ఉత్తరప్రదేశ్‌కే కాదు
ఉల్లాసభరిత వేడుకలో
ఉద్విగ్న ఉత్సాహ కెరటాలు రేకెత్తించి
ప్రపంచానికే ప్రశంసనీయమైంది.

తన కుమార్తె జీవితంపై తీసిన
డాక్యుమెంటరీ చిత్రానికి
అంతర్జాతీయంగా పేరుప్రఖ్యాతులు
రావడం ఆస్కార్ అవార్డుకు
ఆస్కారం కావడం
నమ్మలేని సత్యంగానే తోస్తోంది–
పింకీ తల్లి షిమ్లాదేవికి.
ఆమె తృప్తి ఆస్కార్ అవార్డుకు కాదు–
అంతకుమించిన కుమార్తె
బ్రతుకులోని మార్పుకు
వైద్య చికిత్సతో
తొలగిన గ్రహణం మొర్రికి
ఇన్నాళ్లూ గ్రామస్థులు చూసిన
వైఖరిలో
నేటినుంచీ అంతర్ధానమైన వెర్రికి.

స్మైల్! పింకీ... స్మైల్!!
కలిసిన సంఘసేవకుడి
చొరవకు స్మైల్!
అందమైన నవ్వుకు
అందిన చికిత్స కోసం స్మైల్!
గుండెలో గుడుసుళ్లు తిరిగే
వేదనను అణచుకుని
వేసారక–
వాస్తవగాథ తెరకెక్కేందుకు
కెమెరాముందు సహజసిద్ధంగా
సంచరించినందుకు
పదాలతో పలకరించినందుకు
మొక్కవోని స్థిరచిత్తంతో
ఫ్రేములు ఫ్రేములుగా
కదలాడినందుకు
ఊహాతీతంగా
నీ అస్తిత్వాన్ని ఆవిష్కరించినందుకు
స్మైల్ పింకీ స్మైల్!!
నిజమే
నీ కథను వ్యాపారత్మకంగానే
మలచినా
మానవీయ కోణాన్నే
మహోన్నతం చేసినందుకు–
సృజనకారుని భావబలిమికి,
అప్రాప్తమనోహర కలిమికి–
స్మైల్ పింకీ స్మైల్!!

దైవోపహత జన్మమనీ
పూర్వజన్మ పాపమనీ
ఆ దేవుని శాపమనీ
గ్రహణం మొర్రి అనీ

వైద్య చికిత్సకు
వెలివేయబడకుండా
ఇకనైనా లక్షలాది 'పింకీల'
సలక్షణ జీవితాల్లో-
సకాల వైద్యానికి ఇది
సాదర ప్రేరణం కావాలి.

రెండువేల గడపల పల్లె అయినా
రెండొందల అంతస్థు
భవనాల పట్నమైనా
చిన్నారి హృదయాల
చిరంతన చింతలు తొలగాలి

అర్థంలేని వంతలు మాని
అర్థవంతమైన ఆచరణలు పూని
వైద్య చికిత్సకు స్పందించి
వేల నవ్వులు సహజాతంగా
కురిపించగల
చేయూతలందించాలి.
ఆరోగ్యశ్రీ విప్పారాలి

"బంగారు పాపాయి
బహుమతులు పొందాలి.
పాపాయి చదవాలి
మామంచి చదువు
పలు సీమలకు పోయి తెలివిగల
పాపాయి
కళలన్ని చూపించి ఘనకీర్తి
తేవాలి..."
అన్నపాటే నిజమైంది నేడిక!
'స్మైల్ పింకీ' డాక్యుమెంటరీకి
ఆస్కార్‌తో-
భారతీయతే పులకించిన వేదిక.

***

***(25 ఫిబ్రవరి 2009)***

# మాకు కాస్త నమ్మకమివ్వండి


ఒక పుణికిపుచ్చుకున్న పోలికే
నిజమే! రక్తమే చిక్కనిది
కన్నీళ్లు తుడుస్తామనే హామీల హోరు
విసురుతున్న వాగ్దాన స్వప్న కాలం

రీళ్లకు రీళ్లుగా కళ్ళప్పగించి–
బ్రతుకులో లేని రంగుల్నీ పొంగుల్నీ
వెండితెర బందీలమై
వినోదాన్నే వాస్తవమనే
ఆ కాసేపు భ్రమలో
బ్రతుకు ఆనందాల్ని పొందినట్లుగా
భ్రమసి ఆదరించినందుకే కదా–

ఒక సాహసాన్నీ,
ప్రేమ సాన్నిహిత్యాన్నీ
అందుకై పోరాటాన్నీ
శత్రువు నెదిరించే సవాలునూ
ఫ్లాష్‌బ్యాకూ, సిక్సుప్యాకూ
విలన్లను చితకబాది హీరో గెలుపు...
అంతా తల్లీనమై, ఆపాదించుకుని
జీవితం సినిమా అయితే
ఎంత బాగుంటుందో
ననిపించినందుకేగా–

నిజంగా చేసింది తానే అయినట్లు
చేతకానిది చేతనైనట్లు చూపి
చెంగున గెంతినవాడు
సందేశహరుడవుతున్నాడు

వెండితెర హీరో
వీధి నాయకుడై ప్రబోధిస్తున్నాడు
మా బ్రతుకుల గురించి
మహోపన్యాసాలిస్తున్నాడు
తనే తలక్రిందయి నేత అవుతున్నాడు



నిజమే!
అర్హతలు, అధికారాలు
ప్రశ్నార్థకాలు కాక,
పగటి వేషగాళ్లే–
జన సమీకరణలయ్యాక
సమ్మోహనాస్త్రాలే సకల
సారధ్యమయ్యాక

రాజకీయమూ ఒక వినోదమే
ప్రచారమూ ఓ రంగుల చిత్రమే
జనానికి టిక్కెట్టు ఖర్చులేని
దృశ్య శ్రవణం
టిక్కెట్టు దొరికిన అభ్యర్థికి వంతగా
ఓ అనుగ్రహ భాషణం.

కుటుంబాలు కుటుంబాలే!
కలతలున్నా, నలతలున్నా
కనిపించని గురివింద కతలున్నా
లోలోన ఎన్ని
అవమానాల గుడుసుళ్లున్నా
కక్షలున్నా, కార్పణ్యాలున్నా
వివాహేతర విశదీకరణల
వాస్తవిక చిత్రణలున్నా
ఒక సెలిబ్రిటీ కదా! అంతా మాఫీ
ఎంత అవినీతి అయినా–
గుటుక్కున త్రాగేయగల మంచి కాఫీ!

తొడగొట్టిమీసాలు మెలేస్తున్నారు
ఎక్కడైనా ఏమైనా చేస్తారు
జనం ప్రోగు అవుతారు.
ఎక్కడ ఆటవున్నా
ఆనందించగల ప్రదర్శన వున్నా
డప్పు మ్రోగిన చోటికి
టపాసులు పేలిన చోటికి
లౌడ్‌స్పీకర్లో పాట ప్రయాణించిన
చోటికి
అలంకరించిన వ్యానో
ధూళిరేపుతూ దిగిన హెలికాప్టర్నో
చూసేందుకు ఎగబడతారు.

వీధుల్లో వినోదానికి
వేలాదిమంది వేంచేసి చూస్తారు
వింతాలేదు, విశేషమూ లేదు.

దృశ్యాలు బాగుంటాయి
సంభాషణలు బాగుంటాయి
మరీ ముఖ్యంగా
తనను కాక ఎదుటివారిని
ఎగబడి తిట్టడం
ఎంతో రమణీయంగా ఉంటుంది
ప్రాసలు హాసాలొలికిస్తాయి
రవ్వంత బూతులు కవ్వింతలతో
కరతాళ ధ్వనులౌతాయి.

అన్ని నిష్ఠురసత్యాలే!
అంతా స్లమ్‌డాగ్ సెల్యులాయిడ్ సీన్లే!
రథం మీద వాడికి
బోలెడు కరుణ. బోలెడు జాలి
సామాజిక న్యాయం కోసం
సానుభూతి

అంతా బాగుంది
వాగ్దానాలు బాగున్నాయి
హామీలు బాగున్నాయి
రేపిపెట్టిన ఉచితాలు ఊరిస్తున్నాయి
ఔచిత్యాలెవరెరుగుదురుగానీ–
అబ్బాయిలో, బాబాయిలో, తమ్ముళ్లో
తనయులో, తండ్రులో,
తళతళల తరుణీలలామలో
ప్రదర్శనలు రంగు హంగులతో
వున్నాయి
మాటల పొంగులతో వున్నాయి.

అందరూ అన్నీ అంటున్నారు
అందర్నీ అంతా వింటున్నారు
బాగుంది! భలే భలేగా వుంది!!
నేతలారా!
నేతల సినీ దూతలారా!
ప్రచారార్భటి మోతలారా!
మీ రెండు రూపాయల
కిలో బియ్యాలూ,
వందకే వంటింటి సరుకులూ,
ఇంటింటికీ నెలసరి డబ్బు
పంపిణీలూ,
నట్టింట కలర్ టీవీలూ
మాచెవి దగ్గర సెల్‌ఫోన్‌లూ,
పదివేలకే ల్యాప్‌ట్యాప్‌లూ
ఉచిత విద్యలూ, విద్యుత్తులూ
అన్నీ సరేనయ్యా!

ఇవన్నీ కాదయ్యా–
మాకు ముందు విశ్వాసం ఇవ్వండి.
మీకు కార్లున్నాయి, బంగళాలున్నాయి
డబ్బుంది, దర్పం వుంది.
అధికారం కోసమేగా
మా అమూల్యమైన
ఓటడుగుతున్నారు
మీకు ఎన్ని వున్నా
ఇవాళ మా దగ్గర ఓటువుంది
ఇప్పుడు మేమే ఉన్నవాళ్లం!
అన్నీ ఉన్నవాళ్లం!!
మీ గెలుపు గుర్రపు కళ్లెమయినా,
మీ దింపుడుకళ్లమయినా
మా ఓటుతోనే ఉంది.
టక్కుటమారాల
గారడీ కనికట్టుల
ఇంద్రజాల ప్రదర్శనలు వద్దు.
పాములాటలొద్దు
సినిమాలొద్దు.
మాలోని వారనీ,
మా వంటివారనీ,
మాకోసం మాలానే
మావెంటనంటి వెలుగువైపు
తలెత్తుకు బ్రతికేలా నడిపిస్తారనీ,
మాకు నమ్మకమివ్వండి చాలు!
ఓటిపోని ఓటు కోసం
మాకు కాస్త నమ్మకమివ్వండి చాలు!
మాకు కాస్త నమ్మకమవండి.

***

***(19 మార్చి 2009)***

# జన ప్రాణ హరణ జలం

తామ్రపర్ణి నదీ జలాన్ని జ్వలించి
రాగితో
నమ్మాళ్వార్ విగ్రహం చేశాడట
మధుర కవి.
నీరు భగవద్రూపం కాగలదని
రూపించిన విశ్వాసం-
తిరుగురుక్కూర్.




ఖడ్గధారను జలధార అధిగమించి
అమృత సంజీవని కాగలదని కదా
అంపశయ్యమీద భీష్ముడికి
పాతాళగంగను పుట్టించి
దాహార్తి తీర్చిన సవ్యసాచిత్వం కదా

నీరే ప్రాణాధారం
అన్న మాట-
నీరే ప్రాణహరణంగా మారుతుందని
ఊహించనైనా ఊహించగలమా!

భోలక్‌పూర్-
ఒక జలకల్లోల విషాదమే కాదు
ప్రకృతి వనరును
పట్టి పల్లార్చిన కలుషిత రాజకీయ
నిరాసక్త నిరాదరణ నిస్సిగ్గు వ్యవస్థకు
నిలువెత్తు నిదర్శనం.
భగవద్రూప నిర్మాణ శక్తికిగాక
జనప్రాణ హరణ పర్యవసానానికి
గరళానిల దర్శనం
బొట్లు బొట్లుగా
కుళాయిల నీరు విషాన్ని ఒలికి
గొంతు దాహాన్ని తీర్చే బదులు
గరళ విరళమై-
బస్తీవాసిని సుస్తీ పాల్జేసి
కడలి కన్నీటి ఘోషను
పోటెత్తించడం.

నగరం నడిబొడ్డునే
ఎక్కడో మన్యం మారుమూలల
విషమ నీటి పరిస్థితి
విరాడ్రూపం దాల్చిన దుస్థితి
ఉసురుపోసుకున్న నీరు.
ఈ పాపం ఎవ్వరిదని-
ఎవరిని ప్రశ్నించడం?

వాటర్ 'వర్క్స్' అనుకున్నాంగానీ
'ఇట్ వోంట్ వర్క్'!
పనిచేయని ప్రభుత్వానికి
ప్రబల సాక్ష్యం ప్రత్యక్షం.
నిర్లక్ష్యానికి బాహాటంగా–
తెరుచుకున్న గవాక్షం.

అధికారాన్ని కలలుగంటూ
విదేశీ విహారాల్లో మునిగి కొందరు
ఆశనిరాశల మధ్యనే
ధీమా జలకాలాడుతున్న ఇంకొందరు
లెక్కలు, తర్జనభర్జనలు,
ముందస్తు అంచనాలు
అందరి దృష్టి అధికారం మీదనే
ఓటేసిన ప్రజను
ఓ అనుమానపు చూపుతో తప్ప
ఫలితం ఏమయినా–
సేవతో సంక్షేమంతో సాగిపోదామనే
జనహిత తత్పరత లేక
ఆదర్శ నేతృత్వ ఆకాంక్షతో జనం
హక్కు వినియోగించుకున్నందుకేనా
విశ్వాసంలోకి తీసుకుని–
కృతజ్ఞతావందనాలన్నదెవరు?
వారికి కావలసింది కేవలం 'పవరు.'

చాపకింద నీరులా
ప్రజాతీర్పు ఏమార్పు విస్తరిస్తుందో
తెలియదుకానీ,
గొంతులో దిగి
దాహం తీర్చి ప్రాణాధారం
కావల్సిన నీరు

ఈ గ్రీష్మంలోనే–
ఎన్నికల వాతావరణంతో
రాజకీయాల్లా ఇంత కలుషితమై
కంఠం దిగక,
వాంతులు, విరేచనాలతో–
వ్యవస్థలానే శరీరాన్ని అవస్థల పాల్జేసి
ఆసుపత్రిలో చేరుస్తుందని
అనుకోగలిగామా అసలు!
ఏ నేతయినా ఏమన్నాడు–
చిట్లించి తన 'నొసలు'.

పీల్చేగాలి,
త్రాగేనీరే కలుషితమైతే–
సహజ ప్రకృతి వనరునే
కలుషిత యంత్రాంగం
గరళమయం కావిస్తే–
ఆ నేరానికి శిక్షేమిటి?
ఆపన్నులకు దయాభిక్షేమిటి?

చలివేంద్రలు వెలిసి–
బాటసారికి
చెట్టు నీడ, చల్లని నీరు దొరికి
వేసవి ఊరట గొలిపే వీలేదీ?
ఏసీలోని– ఏ సీనియర్ నేతైనా
ఆలోచించే సంక్షేమకాలేవీ?
మునుపయితే ఇంత నిమ్మబద్దా
మజ్జిగ చుక్కా కూడా ఉచితంగా
అందించే కమనీయ కాలం
ఎప్పుడో గతించింది ఆ పుణ్యకాలం
'తేహినో దివసా గతాః'

ఇది నీళ్లు అమ్ముకునే కాలం
మన ఊరి చెరువు నీరే–
మినరల్ వాటర్ బాటిల్‌గా
మనమే కొనుక్కునే కలికాలం.

చెడిపోయిన బోర్లు
ఎండిపోతున్న బావులు
మంచినీటి కోసం
మైళ్ల మైళ్ల ప్రయాణాలు
అరవైఏళ్ల స్వతంత్ర
గ్రామీణ భారతంలో
ఆకలికి కాదు– దాహానికే
అసువులు బాస్తున్న
వ్యధార్థ జీవిత యథార్థ దృశ్యాలే!!

నిరుడు కురిసిన హిమసమూహాలు
ఎలాగూ లేవు.
అంతటా ఎగసిన జ్వాలాతోరణాలే!
ఏ జిల్లాలోనూ–
నల్లాలన్నీ ఉల్లాసంగా
జలధారలతో కురుస్తున్నాయని
మురిసిపోలేని కాలం
తోళ్లు నానిన చావుడప్పు చప్పుళ్లే
మంచినీటిలో డ్రైనేజి నీరు కలిసే
రాజకీయ పొత్తుల రాక్షస
అమానవీయ వ్యవస్థలో–
ప్రసరించే పాలనకు
ప్రతీకాత్మకం కాక
భోలక్‌పూర్ చెబుతున్నదేమిటి మరి!
ఎలా సంరక్షించుకుంటాం
మన జలసిరి
బిందువు బిందువునుండే జనించాలి
ఓటెక్కి, పోటెక్కే జనం గురి.

***

***(7 మే 2009)***

# చెయ్యి ముడిస్తే పిడికిలి

శవాల గురించీ
శవాల మీద పేలాలు
ఏరుకోవడం గురించీ
వాళ్లు
ఒకరినొకరు
నిందించుకుంటూంటారు
ఓటమి తరువాతనేనా
కూటమి బీటలు వారింది?

అసలు కలయికే
అర్థంకానిదీ, అర్థంలేనిదీ కాలేదా
ఒకరిని కాదని
ఇద్దరి నిర్ణయాలు
ముంచింది మూడోవాడినా!

సిద్ధాంతాల రాద్ధాంతాలు సరే
అసలు భావసారూప్యం ఏదీ
ఎందుకు కలిసినట్టు
కలిసినట్టు ఎందుకు మెలిగినట్టు
ఎలా ములిగినట్టు
అసలేదీ పట్టు
లోన దాగిన దేమిటి గుట్టు

ప్రజల పక్షాన నిలిచే
వామపక్షాలన్నమాట
ప్రజలకింత దూరమెందుకవుతున్నట్లు
రాజకీయాధికారమే
సర్వస్వం కాకపోవచ్చు–

కానీ
నేతృత్వ దరిద్రతలోకి
నెట్టబడడమేమిటి
తమ స్వరానికి ప్రాతినిధ్యం
కాగలదన్న
కనీస విశ్వాసం కోల్పోయి కాదా–



పార్టీ పక్షాన
ప్రజాప్రాతినిధ్యమే
కరువయ్యే కష్టకాలం
దాపురించటం.

ఎక్కడో లోపం ఉంది
ఓటు పడకపోవడం సరే–
చోటు వుందా ఇంకా

జనం గుండెల్లో
గత కాలపు కీర్తి బరువులతో
భవిష్యత్తు ప్రయాణం
కుదరదు.
ఎర్రజెండ ఎన్నియలు
వెర్రి అండ చిన్నెలుగా
వెలిసిపోతే
కొండంత అండలాంటి
సంఘం కోట
బీటలు వారి పగుళ్లేస్తుంది.

ఎన్ని పోరాటాలు
ఎన్ని ఉద్యమాలు
ఎంత ఉద్వేగం
ఎంత ఉద్రేకం
ఎంత మేధావిత్వం
ఎంత ప్రజా మమేకత్వం
ఏమైపోయినట్లు అదంతా
కొత్త రక్తం
ప్రవహించలేదా?
ఎముకలు కుళ్ళిన
వయస్సు మళ్ళిన
సోమరులేనా ఇంకా సారథులు
సిద్ధాంతాలకూ ఆచరణకూ మధ్య
కూలిపోయాయా వారధులు

మార్క్సిజమే
సమాజ రుగ్మతల కన్నింటికీ
మహా ఔషధమయితే
చేపమందు విశ్వాసంలా
జనవిజ్ఞానపు టెడద
జావకారిపోవడమేమిటి
క్రమక్రమాగత
చైతన్య ధనుష్ప్రాణులైనట్లు
ప్రజలు
తమకోసం తీరుకెక్కిన
సిద్ధాంతాలను
గౌరవించకపోవడమేమిటి
మూలాధారనాడి గొప్పదే
కానీ
మూలశంక పొడచూపిందెక్కడో
విస్తరించవలసిన
విశ్వాసాలు విచలితమై
విగళితమై
పదునెక్కవలసిన పాట
మొద్దుబారిపోయింది
స్వార్థాల పిడిమాత్రం
పిడికిలిలో మిగిలి
పదును అంచుకత్తి
చేజారిపోయింది

భూమి కోసం, భుక్తి కోసం
భువన భవనపు బావుటాలైలేచి
పోరాట యజ్ఞాలకు
సమిధలైన సంఘజనం చేసిన
త్యాగాలు
స్వార్థ నాయకుల
అధికారపు ఆశల లక్ష్యాల
అసమర్థ నిర్ణయాలతో
అసహజ పొత్తులతో
అతుకుల బొంత కూటమితో
వ్యర్థమైపోయాయి.

పన్నీటిని
బూడిదలో కుమ్మరించి
ఫీనిక్స్ పక్షిలా
పునర్జన్మని కలగనడం
హాస్యాస్పదంగా తోస్తోంది ప్రజకు
పార్టీలు చేరువవుతోంది మాత్రం–
కేవలం రుజకు.

మించిపోయిందేమీ లేదు!
ముంచిపోయిన దానిమీంచి
వెల్లువలో
తలవంచి నిలిచిన పోచలానైనా
తలెత్తుకు మళ్లీ నిలవచ్చు
వ్యర్థాలాపాలూ,
వదరుబోతుతనాలూ విసర్జించి,
పిడికిలిని ముష్టి అడుక్కోవడానికి కాక
బిగించిన శక్తిగా–
ప్రజాభిప్రాయంలో
అభివ్యక్తీకరించగలిగినప్పుడు
ఆచరణలో ఇకనైనా
అనువదించినప్పుడు
ఎరుపు మెరుపు నిలుస్తుంది
చేతి చరుపు పిడికిలై బిగుస్తుంది.

***

*(28 మే 2009)*

# అంతా'గుర్తే'నా

ఆడలేక మద్దెల ఓడన్నవాడు వోడు?
నిజమే! మద్దెలదే దోషం
మద్దెల నేతదేమి పాపం పాపం?

ఒక గుర్తు
మర్మమంతా అందులోనే నేమో!
జయాపజయాలు–
సామర్థ్యా సామర్థ్యాల మీద కాదు
అంతా గుర్తొచ్చిన దానిమీదే.



వాహనాలన్నీ ఘోరంగా
దెబ్బతిన్నాయ్.
అన్నిటికీ ప్రమాదాలే
సైకిలు గుద్దేసింది
కారు తుక్కుతుక్కయింది
రైలింజన్ పట్టాలు తప్పి
బోర్లాపడింది.

నిఘా వేస్తానన్న విజిల్‌లో
ధ్వనిచేసే రాయి ఒక్కటే బయటపడి–
సత్తా మూగపోయింది.

తప్పుకదూ!
వాహనాల గుర్తులదే తప్పంతా కదూ!
రైలింజన్ వల్లే
గమ్యం చేరకుండా–
ప్లాట్‌ఫారం టిక్కెట్లతో ఎక్కేసి,
పట్టుబడి పద్దెనిమిది మైళ్ల దూరంలో
దిగబడిపోవాల్సి వచ్చింది
చిరంజీవి కదా–
ఆఫ్ టిక్కెట్టయినా
హాంఫట్ అయ్యిందే!
ఎక్కింది రైలు కాదు ఇంజను
అదీ సంగతి.

కారు సంగతి అడక్కు!
ప్రత్యేకత పేరుతో మొదలైనప్పట్నుంచీ
అంతా రాంగ్ డ్రైవింగే
కారుకన్న ముందు
కొండల నడుమ సూర్యుడుండేవాడు
ఉదయ సూర్యుడు కాస్తా
చెన్నుమీరి వెన్ను విరిచిన వారి
చెంగలింపులతో
అస్తమయ సూర్యుడుగా
గుర్తు గుర్తించబడి
వ్యవహారం గుడుగుడు గుంచమైంది.

కారు గుర్తొచ్చాక
అసలు ఉద్యమ కారులమంటూ
డ్రైవర్లు పెరిగారు
గోడల మీద గంటల పద్ధతిపై
నెంబర్లతో
డ్రైవర్ సర్వీసులు సాక్షాత్కరిస్తున్నట్లు
తల్లి తెలంగాణా, నవ తెలంగాణా,
గద్దర్ తెలంగాణా
తొలుత ఎన్నికలముందే
తండోపతండ సంరంభం
మహాకూటమి కన్నా ముందే
తల్లి తెలంగాణ విలీనం పుణ్యమే
కనీసం ఢిల్లీ హనీమూన్ జంట!
"కారులో షికారు కెళ్లే
పాలబుగ్గల పసిడీదానా
బుగ్గమీదా గులాబి రంగు
ఎలా వచ్చెనో చెప్పగలవా!"
పాటకు సమాధానం విలీనమే.
అసెంబ్లీ విషాద రాగాల మధ్య
రెండు సీట్ల పార్లమెంట్
వాయులీనమే.

ఇప్పుడు- డ్రైవరును
దిగిపొమ్మంటున్నారు
ప్రత్యేక రాష్ట్రం గమ్యం చేరాల్సిన
కారు
మమ్మల్ని నడపనిమ్మంటున్నారు
డ్రైవింగ్ ఫోర్స్ చాలట్లేదు.
గతుకులు, కుదుపులు
తాగి నడిపే డ్రైవరు
వల్లకాదు వద్దు పొమ్మంటున్నారు.

స్టీరింగ్ ముందు నుండి
చోదకత్వం విరమించుకుని
సర్వీసు బదలాయిస్తే తప్ప
గమ్యం చేరలేమంటున్నారు

మేధావులున్నారు నిజమే!
కారు వెనుకసీట్లో కూర్చుని
పేపరు చదువుకుంటూ
డ్రైవర్ వాహనం నడుపుతుంటే
జోగేవారు కొందరైతే
మధ్యమధ్యలో వేగం పెంచమనో,
తగ్గించమనో
మలుపు జాగ్రత్తగా చూసుకొమ్మనో,
సడన్‌బ్రేక్ వేయవద్దనో,
సలహాలు గుప్పిస్తారు తప్పితే-
వాహనం నడిపే డ్రైవరెవరైనా
వారికి పట్టదు.
ప్రయాణం సాగుతోంది చాలని
ప్రశాంతంగా జారగిలబడతారు
సొంత కారుగా భావించినా
స్టీరింగ్ తాము చేపట్టరు.
డ్రైవింగ్ రానివారు కొందరు-
లైసెన్సుకేం ఎలాగో సంపాదిస్తారు.

ఇప్పటికీ కారు
ఎన్నిసార్లు షెడ్డుకు వెళ్లిందో
ఎందరు డ్రైవర్లు మారారో
నిజాం నాటి నుంచి
నేటి నిజం దొరగారి వరకూ.
ఇంతకీ కారు ప్రయాణం
గమ్యం చేరుస్తుందో లేదో తెలీదు.

అదే గమ్యం నే చేరుస్తానని
ఓ రైలింజన్ వచ్చింది
తమాషాగా రైలు డబ్బాలూ లేవు
డబ్బాల్లో మనుషులూ లేరు

వట్టి ఇంజన్ ప్రయాణం
గమ్యం ఎవరిని చేర్చేటట్లు?
ఒక్కసారి విజిల్ వేసి కదిలినా
అక్కడా డ్రైవరొక్కడే.
ఇంజన్ నడపమని ఎక్కించిన
శిక్షకుడే జారిపడ్డాడు.

సైకిల్ కొంచెం నయం
సామాన్యుడి వాహనం కదా!
కారు, రైలంత ఆపుకోలేని వేగం లేదు
ఎటొచ్చీ బ్రేక్‌లు ఫెయిలయ్యీ,
మునుపటంత గాలి
చక్రాల్లో తగ్గిపోయీ
పంక్చర్ టైర్లతోనే–
ప్రతిపక్షమై కూచుంది.
సైకిలైనా, కారయినా,
రైలింజనయినా
కమలం పట్టేదైనా, విజిల్ ఊదేదైనా
చివరకు చెయ్యి మాత్రమే కాబట్టి
చెయ్యదమేదైనా చెయ్యే గెలిచిందిట
గుర్తుండే గుర్తుగా చెయ్యే
నిలిచిందట.

***

***(18 జూన్ 2009)***

# శతజయంతి శంపాలత

ఆకాంక్షల విహాయసంలో
కాంక్షల పక్షాలు విచ్చి విహరించడం
సాహస లక్షణం.
దేగ చూపులు తప్పించుకుని
డాలు ధరించి ఖడ్గ చాలనం చేయడం
ధైర్య లక్షణం.

ముడుచుకుపొమ్మంటూ
నడవ దాటనివ్వని
నవ్వులు పెదవి దాటనివ్వని
నరుల చూపుకు నల్లరాయి
బ్రద్దలయ్యే నాళ్ళల్లో-
నోళ్ళు నొక్కుకుంటున్న
ఊళ్ళ మధ్య నుంచి, లేళ్ళగెంతులతో-
సంచరించడం సామాన్యమేమీ కాదు.

ఆడపిల్లయినా ఆమె అదృష్టం
ఆధునిక సంస్కార దృష్టి గల
కుటుంబంలో
రాజమహేంద్ర వరపు
గోదావరి కెరటమై
ఎగసిన పసికూన కావడం.
కాకినాడ కాజాల తీపిదనపు
తల్లిదండ్రుల గారాబంతో
కొంటెతనం, కళాభిమానం
పెనవేసుకుపోవడం.
మడిబట్టలు మైలపరుస్తాననే
పరిహాసపు కేరింతలతో పెరిగిన బాల

చిన్నతనం నుండే చిగురించిన
ధైర్యహేల.
సంక్రాంతి ముగ్గుల కళాప్రావీణ్యతే
కాంగ్రెస్ ఆఫీసు ముంగిట తొలినాడే
దేశభక్తి రథాన్ని చిత్రించిన
పన్నెండేళ్ళయినా నిండని
పాటలగంధి



ఇంట్లోనే బడిపెట్టిన
బాలోపాధ్యాయిని
హార్మోనియం, వీణ-మీటిన మెట్లు
విరాళాలు పోగేసి
విదేశీ వస్త్రాలు తగలేసి
దేశభక్తి, ఉద్యమస్ఫూర్తి- ఎక్కిన మెట్లు

'హిందీ మేరిబిందీ'
ఖాదీ ప్రదర్శనల్లో వాలెంటీరై ఉంది
రెండణాల టిక్కెట్టు కొనలేదని
జవహర్‌నే ఆపేసిన ధైర్య జడిమ
గాంధీ ఉపన్యాసాలకు
తెలుగు చెప్పిన పూలతొడిమ.
ఆమె పెట్టిన పాఠశాల
స్వాతంత్ర్యోద్యమ దీప్తికి కంఠమాల
కాకినాడ స్త్రీల సభలో
గాంధీ మహాత్ముడిని పలికించిన
ప్రేరకశక్తి
ఆంధ్రా పర్యటనలో ఆనాటినుంచీ
గాంధీకి అనువాదకురాలైన ధీశక్తి.

మద్రాసులో ఉప్పుసత్యాగ్రహాన్ని
నిప్పులా రగిల్చిన నెలత
లార్డ్ కన్నింగ్ హామ్
స్వయంగా వచ్చినా
అశ్వదళం చుట్టూ నిల్చినా
చలించని సాహసనారి
వాలంటీర్లచే తానే నాయకురాలై
మ్రోగింపచేసింది ఉద్యమ భేరి.

రాయవెల్లూరు జైలులో బందీయైనా
గర్భిణి అయిన ఓ ఖైదీకి
సీమంతం చేయించిన సరదా మనిషి
'పాము పాము' అని
జైలు అధికారులను
చిలిపిగా బెంబేలెత్తించిన
కొంటెమనిషి

తనను కాదని భర్త సుబ్బారావు
పునర్వివాహం చేసుకున్నా-
కాదనని అసహాయ ఋషి.
నలభై రెండున అతని మరణంతో
తెల్లచీరలే కట్టిన శైలూషి.

గోరాగారి దగ్గర పాఠాలు చదివి
బెనారస్ మెట్రిక్ పాసై
ఆపై ఇంటర్ పూర్తిచేసి
ఆంధ్రా యూనివర్సిటీలో బి.ఏ.లో
ఆనర్సు చేసి పాసయ్యింది
లా చదవడానికి మద్రాసు చేరింది

అప్పుడే మొదలు
ఆంధ్ర మహిళాసభకు అంకురార్పణం
మీర్జాపురం, బొబ్బిలి రాణులే
కాసులిచ్చి
భవన నిర్మాణం పూర్తి చేయించారు
1945కు అంతా సంసిద్ధం.
స్త్రీ పురుష సమానత్వానికై లాయర్‌గా
నాటినుంచే ఆమె యుద్ధం.

భారత రాజ్యాంగ నిర్మాణ సభల్లో
పాల్గొని
ఢిల్లీలోనూ తన సత్తా చూపింది
రాయలసీమ కఱవు నివారణకు
రాష్ట్రమంతా పర్యటించి, సహకరించి
నెహ్రూగారికి రిపోర్టు సమర్పించింది.

నిజాయితీ, పనితీరు, శ్రద్ధ
ఆమెకు పెట్టిన పేర్లు

చైనాకు తరలివెళ్లిన బృందంలో నిలచి
అక్కడ మన జాతీయ గీతం పాడిన
కమ్మని కంఠంగల గాయకురాలు
ఆఖరి ప్లానింగ్ కమిషన్ మెంబర్‌గా
చెప్పుకోదగిన గొప్ప నాయకురాలు.

ఫైనాన్స్ మినిస్టర్ దేశ్‌ముఖ్‌లో
అప్పుడే విచ్చుకుంది ప్రేమ పుష్పం
ఈమెగారి ప్రతిభా పాటవాలతో
పరవశించింది ఆయన హృదయం
నెహ్రూగారి సాక్షి సంతకంతో
ఆమెతో దేశ్‌ముఖ్ ఒక్కటయ్యారు.
కృపలానీ దంపతులూ సంతకించి
సంతోషస్వాంతనులను చేశారు
ఇద్దరు విజ్ఞానమూర్తుల కలయిక–
ఆదర్శ దాంపత్య బంధమైంది.
సాంఘిక సంక్షేమశాఖ
అధ్యక్షురాలిగా,
జాతీయ మహిళా విద్యా సమాఖ్య
సారధిగా,
స్త్రీలకు విద్యాసౌకర్యాలు
ఉద్యోగ శిక్షణావకాశాలు
ముమ్మరం చేసింది.
రెండవ కామన్వెల్త్
ఎద్యుకేషన్ కాన్ఫరెన్సు
ప్రపంచ ఆహార సంస్థ సమావేశం
ఆమె ప్రాతినిధ్యంతో తేజరిల్లాయి.

టెహరాన్ అంతర్జాతీయ
నిరక్షరాస్య నిర్మూలనా సమావేశానికి
పాకిస్థాన్ యుద్ధ కారణంగా
వెళ్లలేకపోయినా
ఆంధ్ర మహిళా సభకు ఆమె వల్లనే
ఆ పని అప్పగించబడింది
సాక్షరతా కార్యక్రమానికి
శ్రీకారం చుట్టబడి
హైదరాబాద్ ఆంధ్ర మహిళా సభ
ఆవరణలోనే
సాక్షరతా భవన్ నెలకొంది.

ఇందిరాగాంధీతోబాటు
ఆంధ్ర విశ్వవిద్యాలయం
గౌరవ డాక్టరేట్ నివ్వడం
భారత ప్రభుత్వం
నెహ్రూ లిటరరీ అవార్డును
పద్మవిభూషణ్‌ను ఇవ్వడం–
ఆమె చేసిన కృషికి
సముచిత గౌరవాలు.
తెలుగునేలకు జీవితాన్ని ఆపై
అంకితం చేసి–
డెబ్బై ఒక్క ఏళ్లకు డస్సిపోయి
ఎగసిపోయిన ప్రాణహంస ఆమె.
ఆమెయే
దుర్గాబాయ దేశముఖ్.
ఆంధ్ర మహిళా సభ పునాదిగా
స్త్రీ చైతన్యం శిరసులెత్తించిన వనిత.
నేటి ఈ మహిళాభ్యుదయం
ఆమె ఘనత.
ఆ శతజయంతి మూర్తికి
జేజేలంటోంది జనత.

***

*(2 జూలై 2009)*

# ఈ చర్చల 'ప్రతిధ్వనులు' ఏ ఘంటారావాలో?!

ఊహలు వేరు
ఊడలు పాతుకున్న విశ్వాసాలు వేరు
ఔననుకుంటున్నది కాదనడమే
ఒక సవాలు
కనువిచ్చే కార్యాచరణకు పూనడం
తరగలెత్తిన చైతన్యోద్యమాలు



అంతా తెలుసుననుకోవడం భ్రాంతి
తెలియచెప్పబూనడం క్రాంతి
బుల్ బుల్ పిట్ట లేవయినా
బోల్తా కొట్టడమే ఒక్కోసారి విభ్రాంతి

ఎవరి దారి వారిది
ఎన్ని చర్చల ప్రతిధ్వనులు
ఘంటారావాలై మ్రోగినా
ఆలయద్వారాలు మూసే వుంటాయి
సంప్రోక్షణలు సమసిపోవు
నమ్ముకున్న గర్భిణి
దుర్భిణి వేసి గాలించినా రోడ్డెక్కదు
అత్యుత్సాహ అల్పాహారాలు
ఆరగించినా
అణువంతయినా భేదం రాదు

ఫలితాలు సద్యః గోచరాలు కావు
ఆలస్యం అమృతం విషం
ఇప్పటి అమృతం ఎప్పటికో విషం
చేజార్చుకోవడమెందుకు
ఈ నిముషం
వీక్షణానంద నేత్ర చషకం
తొణికిసలాడకుండా
వుండడమెందుకు?
ఊరంతా ఒక దారయితే
రాజకీయం ఉలిపికట్టెలది మరోదారి
శతాబ్దపు అపురూప ఘట్టాలకన్నా
బోనాల మహంకాళి ఘటాలకన్నా
వారి వారి వైఖరులే వారికి మిన్న

ఎవరో వుంటారు కేసీఆర్‌లు
ఆషాఢం షాడోలో
గెలిపించిన నియోజకవర్గానికి
మోము చూపనివారు
ఢిల్లీలో ఏ విజయశాంతి లిల్లీతో
పార్లమెంట్ విహారం
చేస్తున్నారో తెలీదు

రాములమ్మ బోనం ఎత్తనేలేదు
ఏ పానం ఎలాగుందో
ఎవరెరుగుదురు?

ఇప్పుడింతకీ ఇక్కడ
గ్రేటర్ హై ధరా బాధలు
హై ధరా బాదుడులు
రాజధానిలో మ్రోగుతున్నాయి
ఎన్నికల రాండోళ్లు
దొంగలూ దొంగలూ
పంచుకుంటారు ఊళ్లు
ప్రజలకెవరూ చేయరు మేళ్లు
సడలిపోతూనే వుంటాయి
సామాన్యుడి కీళ్ళు
కరుస్తూనే వుంటాయి కొత్తవైనా జోళ్లు
కసబ్ కూరిన తుపాకీ తూటా గుళ్లు
హిందూత్వ అద్వానీ రథాల గుళ్లు
అమెరికా ఆర్థిక మాంద్యాల
చేబదుళ్లు
పాకిస్థాన్ సలపరిస్తున్న పుళ్ళు
కాదువట్టి అంత్యప్రాసల కుళ్ళు

ఇవి ఇప్పుడు కావు మామూలు
వరిమళ్ళు
విలువ పెరిగిన కందిమళ్ళు
నేరం అంగీకరించారని
అంగీకరించడానికి
అంగీకారం కుదరని అంగీకారాలు
సుస్థిరతని పడగొట్టేందుకు
ప్రతిపక్షాలు ఏకమయ్యే సుస్థిరతని
పడగొట్టే దిశానిర్దేశాలు

బలహీనపడే శ్రేణిని
బంగాళాఖాతపు ద్రోణిని
పనిగట్టుకుని బలోపేతం
చేయడమెందుకని?
వాతావరణ సూచన
ఏతావాతా ఛప్పనారు చిల్లరమల్లరల
జోరే జోరీగ రొద చేసే ఆత్మవంచన

లోక్‌సత్తా సత్తాహరించి
ప్రజారాజ్యం పూజ్యం అనిపించి
వామపక్షాల దోమలను తరిమిపించి
తెలుగుదేశం గ్రేటర్ గేట్లు
తెరిపించాలని ఒకటే ఆరాటం
కాంగ్రెస్‌పైనే అందరి పోరాటం

ఊరుమనది ఉనికి మనది
వాడమనది వార్డు మనది
ఊదరగొట్టే ఊర్పు తీరిది
ఓర్పునో, నిట్టూర్పునో తెలియని
ఏమవుతుందో ఎరుగని
ఓటరు తీర్పు మనది

సంప్రదాయ పార్టీల సంప్రదాయమే
అసమ్మతి తిరుగుబాట్లు
ఏకవ్యక్తి నియంతృత్వమనే తిట్లు
అంతః కలహాలతో పట్టుకునే జట్లు
జయప్రకాశంగా
నారాయణ నారాయణ ఎక్కుతున్నదీ
అదే మెట్లు

సూర్యుడు గుర్తొచ్చిందో లేదో
సూర్యగ్రహణం వచ్చింది

చంద్రబాబు కారణంగానే
క్షీణిస్తున్న గ్రహణ సూర్యుడికి
విడుపుకన్నా
టిడిపి పట్టు దొరికితే
బాగుండునని ఆశ
పట్టుకుంటే ఇంకో పదివేలు
ఓట్లుగా చేజార్చుకుంటామేమోనని
వదిలేద్దామనుకుంటున్న
తెలుగు ధ్యాస.
గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలకు
గ్రేటర్ ప్రచారాలుండవు కాబోలు
సినీతారల సందోహాలు
తొడగొట్టడాలు,
మీసాల మెలివేతలు
ఉండవు కాబోలు!
రాజధాని రాండోళ్లకు
'రా' సరుకు ఒక్కటే కాబోలు!

ఇంతకీ రాజధాని పతాక
విజయకేతనంగా
హస్త గతమయ్యేనా?

గాదెలోని కందిపప్పు
గాదెకింద బద్దలుగా చెదరి
గాదిలో పందికొక్కులేచేరి
సాలార్‌జంగ్ మ్యూజియంలో
నిజాం ఆభరణాల కుందనం చెంత
నిజంగా కందిపప్పు అందనంత
అలంకార సామగ్రిగా
ప్రదర్శితమైనప్పుడు
హై ధరా బాధల సామాన్యుని
చేదుకునే చెయ్యిచ్చేదెవరు?
చేదుకొనే చెయ్యదహేతువెవరు?

అంతా గిరగిరాం
గిరగిరాం గిరగిరాం
ఇదంతా కంగాళీ అవకతవకల
సాగదీత ఛానెల్స్‌ల దొర్లిపోయే
సమాచారం
చూస్తూనే వుండండి
ఛస్తూనే ఉన్నా ముందుకు పదండి.

***

***(23 జూలై 2009)***

# కాలం చేస్తున్న కవి(త్వం)

కీర్తిశేషులు ఫలించిన వృక్షాలు
నీడనిచ్చినా వారే
దారి జాడలిచ్చినా వారే.
ఫలించిన వృక్షమునకే రాతిదెబ్బలు.

తరుగుదలలేని తరువులు
మోడయినా, మ్రాన్పడినా
చివురులు తొడిగేది
ఒక్క కొత్త ఆకు వేసినా
ఆ ఆనందమే వేరు.

వేళ్లు కూడా ఊనని
విత్తుల గురించి
గుత్తుల గుత్తుల పొత్తాలా?
కుట్టనయినా ఇంకా కుట్టని
కవి కమీజులకు
ప్రశంసల బొత్తాలా?...

నిజమే కాముకత్వం కీర్తిదైనప్పుడు
బ్రతికుండగానే
ప్రచారార్భటి కీర్తిశేషులు.
పేరు పురస్కారాలయితేనేం
పేరుకునేది, పేరు 'కొనేది'
సిఫార్సు 'ఫార్స్'ల సమకాలీనమే!

సాహిత్య పేజీలు
ఇంకా స్మశానాలేనా అని వాదం.
విభూతి దొరికేదక్కడే.
మహాప్రస్థానించిన వారు,
త్వమేవాహులు,
లంగరెత్తేసినా గురుజాడలు,
జీవయాత్రా వశిష్ఠ అసమర్థులు,
సడలిన కీళ్ల కీలుబొమ్మలు,



కాలిబూడిదై దివికేగిన కల్పవృక్షాలూ,
ఎడారైపోయి తడి ఆరి పొడిబారిన
మైదానాలు
ఇంకా
వీటి గురించేనా
ఇంకా వారిగురించేనా
వ్యాసోపవాదాలు?

గొడవ చాలించిపోయి
తిమిర సమరాలైన వాళ్లని
కన్నుమూసి పెన్నుమూసిన వారిని

పాతిపెట్టేసిన వాటిని తవ్వి
ఫోరెన్సిక్ పరీక్షలకు పంపినట్లు
ఇప్పుడు దివంగత కవుల, రచయితల
కుల రక్తాల డి.ఎన్.ఎ. పరీక్షలు!
పునర్మూల్యాంకనలు!!?

నిజమే!
సమాధి ముందు ఓ దీపం వెలిగించి
దండం పెట్టుకోవడం సబబే.
నిన్నూ, నీ స్మృతినీ మరిచిపోలేదని,
నీ జ్ఞాపకాల తోటలో తిరుగుతూ
నీ కలం కాంతులను
కన్నుల్లో, గుండెల్లో నింపుకున్నామని
నీరాజనాలివ్వడం నెనరే.

ఎంతకాలం
గతకాలపు కీర్తి కిరీటాలు?
తాతలు తాగిన నేతుల
మూతుల అఘ్రాణింపులు?
ఇవాళ కొత్తగా ఒరిగేదేముందని?
ఇంకిపోయిన చెలమ
జీవధారగా ఎలా పనికొస్తుందని
నాలుగు దిక్కుల నుండీ
నానావిధ ప్రశ్నలు... సంధింపులు,
సంప్రదింపులు.

గతంలో బ్రతకడం,
భవిష్యత్తు ఊహల్లో
గడపడం మాని
వర్తమానంలో విహరిద్దామంటే
పల్లెత్తి ఎవరినీ ఏమనరాదు కదా!

భజనలు చేసినా
కుల విశేషణ వ్యవహారాన్ని
ఉటంకించినా
ఉపద్రవమే నాయె!
తనను తాను తను
కులదీపకునిగా ఆ పేరును
చివర తగిలించుకున్నా సరే,
గట్టిగా నువ్వు పైకి ఉచ్చరించావో
అట్రాసిటీ అయిపోతుంది.
ఎగస్ట్రా తిట్టయిపోతుంది
తీవ్రత పెరిగిన కొద్దీ
తీరుతీరుల సంచలనమవుతుంది
వార్తా ఛానెళ్ల నిరంతరం ఉడికే
వేడి వంటకమవుతుంది.
"ఏ గతి రచియించిరేని
సమకాలము వారలు మెచ్చరే కదా!"
అన్నది పాత బాధ.
మెచ్చి మేకతోలు... క్షమించాలి
సన్మాన శాలువలు కప్పే
సాంస్కృతిక రొద
రణగొణ ధ్వనుల ప్రశంసల సొద
అభినందనల సభ
నలుదిక్కులా విస్తరిస్తూనే వుంది కదా!
కానీ
దానికీ ఓ కళ వుండాలి.
కళకళలాడడానికి
కదిలేదీ, కదిలించేదీ నీవద్ద
వేరొకటేదో ఉండాలి.

రాయని భాస్కరుడివైనా
పట్టుపరిశ్రమలో వెలుగొందగలగాలి.

నీకో మందవుండాలి
సహజమతులు ఏమనుకుంటున్నా
మందపాటి చర్మం వుండాలి
దాని నిగారింపులుకు
నువ్వు ఫెయిర్ అండ్ లవ్లీ
అనిపించుకోవాలి
'ఫైర్' అయ్యావో ఫేల్ అయ్యావనే!

గుర్తింపుకు తాపత్రయం లేనప్పుడు
గుర్తింపు లేదంటూ
గుర్తించబడినవారి వర్తింపు గురించి
వట్టి వాగాడంబర ప్రవర్తింపు
ఎందుకు?

అక్షర ధనం చాలదు.
పుస్తకాలచ్ఛొత్తించడానికి,
ఆవిష్కరణ సభలనడానికీ
ఆపై పత్రికల, మీడియాల ప్రచార
కాంతులకీ
అక్షరాలా ధనం వుండాలి.

డబ్బుతో అన్నీ కొనలేవు సరే!
కానీ నీకు కావలసిన కొన్నీ
దున్నీ దున్నీ
కొనియాడించుకోగలవులే!...

సరేకానీయ్! ఇంతకీ
శ్మశానంలోనూ మామిడిచెట్లు
మొలవవచ్చు
ఎడారిలోనూ పూలు పూయచ్చు.
ఇంత కశ్మల కల్మష
పర్యావరణంలోనూ
నిజాయితీ, చిత్తశుద్ధి పుటం పెట్టిన
సువర్ణానుభవమొకటి
జనించనూ వచ్చు.
అచ్చమైన కవితకై
కవికాలం చేయనూవచ్చు.

***

***(3 సెప్టెంబర్ 2009)***

# దవ్వులు దువ్వే నువ్వు

"అడుగుజాడ గురజాడది
అది భావికి బాట" అంటూ
అనుసరించిన శ్రీశ్రీకే
పునర్మూల్యాంకనంలో
పుర్ర చెయ్యి చూపాక



'నరుల చెమటను తడిసిమూలం
ధనం పంటలు పండవలెనోయ్'
అన్న గురజాడ
మాట ఎవడిక్కావాలి?

చెమట మూలాలతో
కష్టార్జితాల కాలం కాదిది.
పనిచేసే సంస్కృతి కన్నా
పనిచేస్తున్నది
దంచితే భుజాలెగరేసే
డబాయింపు పెత్తనాలే!
నాటుకుంటున్నది ప్రతిభలేని
కల్తీ విత్తనాలే!
ఏసీలోనే ప్రపంచాన్ని చూసి
ఏరువాక గురించి మాట్లాడటం.
ప్రతిభను పక్కకు పెట్టి
అడుసును అందలాలెక్కించడం.
మట్టి పరీమళంకన్నా
మెడకెక్కించుకునే మాలలు
భజన మూర్తుల హేలలు.
కొత్త యుగం లీలలు!
దేశం మట్టిగానే ఇష్టం వారికి
మనిషి ఎంత
మట్టికొట్టుకుపోయినా సరే
మట్టిని బంగారంగా మలిచే
కృషీవలురు నశించినా,
ఖుషీలూ, జల్సాలూ
తమవి తమకుంటే చాలు!

రాసిందేదో రాసి
గురజాడలూ, శ్రీశ్రీలూ
చచ్చిపోయారు.
వాళ్లు రాయని వాటి గురించీ,
రాసిన వాటిలో
వాళ్లు రాసిన నాటి గురించి కాక
నేడు ప్రతిబింబించడం లేదనే
అనవసర 'కాక'గురించీ,
కొట్టుకు ఛస్తున్నారు
మనలోనే మనవాళ్లు.

భవిష్యద్రష్టలు వాళ్లయితే
అవిమృశ్యకారులం మనం
అయితేనేం!
ఇప్పుడు కాలం మనది కదా!
ఎవరినైనా ఏమైనా అంటాం!
బురదలో మనం పొర్లుతూ,
వారి కళంకాల గురించి వర్లుతాం!
నువ్వెరిగిన
ప్రచారార్భటులు,
నీకున్న వందిమాగధులు,
నువ్వు మరిగిన కళాసంస్థలు,
నువు కొనుక్కున్న
సాంస్కృతిక విలేఖరులూ,
పాపం వారికి ఏరీ?
పత్రికలూ, ఛానెళ్లూ ఇవీ, అవీ
పాపం వారికేవీ?

అయినా వారికి కీర్తివచ్చేసింది
ఈనాటికీ నిలబడే–
సృజన సాహిత్యం తెచ్చేసింది.
ఇవాళ
చెరిపేసే రబ్బరు దృష్టి తమది!
తెలుగు భాష, తెలుగు సాహిత్యం
వెగటై,
సామ్రాజ్యవాద సంస్కృతీ చదరంగపు
శకటై
పల్లెల్లో పొలాలు వదిలి,
ఫేస్‌బుక్‌లో ఫార్మ్‌విల్లీ
పంటలు కంటికింపై,
క్రీడలు సాగుతున్న కాలాన
గ్లోబలీకరణ మాయాజాలాన
అంతరంగాలు ఆవిరై
అంగాంగాల పరితృప్త అంతర్జాలాలు
మూలాలుగా మారుతున్న కాలాన
పరమ పద సోపాన పటంలో
నిచ్చెన లెక్కుతున్నానన్న
నిగడదన్నిన గర్వంతో
పర్వముత్సహిస్తున్నదే కానీ,
అజగరాల నోట
అదృశ్య కబళ మవుతున్నానన్న
స్పృహ ఏదీ నీకు? ఏమైంది నీకు?

పరుగు పరుగు...
ఒకటే పరుగు!
నీకు నువ్వే అందనంత పరుగు.
'పెరిగి విరిగితి
విరిగి పెరిగితి
కష్టసుఖముల పారమెరిగితి'
అన్న వివేకం కూడా
విచ్చుకోలేనంత–
ఎత్తులకు ఎదగాలన్న
జిత్తులతో పరుగు
మత్తులకై, గమ్మత్తులకై
గుమ్మెత్తుతున్న పరుగు.
దుమ్మురేపుతున్న పరుగు.

గుమ్మం తగుల్కొని పడకుండా
కాంక్రీట్ దిమ్మల
కార్పొరేట్ అపార్ట్‌మెంట్‌ల
వ్యాపార సరుకు డిపార్ట్‌మెంట్‌ల
జలజలలూ
డిష్ ఫిష్‌ల గలగలలూ
వలవలలూ తప్ప

పిజ్జా బర్గర్ల నుజ్జునుజ్జు
గుజ్జు ఆకలి ఆత్రాలు తప్ప
సన్నన్నమూ గగనమే!
జొన్నసంగటీ గహనమే!

భూములు–
అమ్ముకోడానికే కానీ,
నమ్ముకోడానికి కాదు.
చదువులు సరికొత్త
సాఫ్ట్‌వేర్ బానిసత్వం తప్ప.
డాలర్ల జాలర్ల బ్లాగర్ల
ఛీర్‌గర్ల్ చిదిమిన పాల్గారు,
కాదు కాదు...
చివికిన, చితికిన రక్తమోడు
వంచక ప్రేమల
యాసిడ్ల, కత్తిపోట్ల, సూసైడ్ల
మరుభూముల
సైట్‌సీయింగ్‌లే తప్ప

కలర్ టీవీలే తప్ప
కబుర్లాడు డ్రాయింగ్ రూమ్‌లే లేవు.
అనురాగ రసఝరీ యోగాల
బెడ్‌రూమ్‌లే లేవు.
యంత్ర భూతముల కోరలుతోమే–
నా రైతు హలమూ లేదు
నాటి కవుల కలమూ లేదు

మూలాలు మరిచిపోయి
మాలలేసుకుని ఊరేగుతున్నావు.
భాషా, సాహిత్యమూ, ఆచారమూ,
సంస్కారమూ
అన్నీ సముద్రంలో కలిపేసి
దాహం దాహం అని
బ్రతుకునావ నెట్టేస్తున్నావు.

***

*(24 సెప్టెంబర్ 2009)*

# 'వరద' హస్తం కావాలి

ముంచెత్తుతున్నది ఒక్కటే
కళ్లనూ, చెవులనూ
ఏకం చేస్తూ
ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో
క్యూసెక్కులు కూసెక్కులుగా
తెగిన గండ్లు, కరకట్టలు
కోసుకుపోయిన రహదారులు
ముంపు ముంపు – ఒకటే ముంపు

శ్రీశైలం మల్లన్న నెత్తిన
గంగ దూకి అక్కడే చుట్టుకుంది.
అభయహస్త మంత్రాలయం
రక్షణ కేకల
అసహాయ ఆక్రందనల
పాహిపాహి అని ఎత్తిన
'వరద' హస్తమయ్యింది.
జలక్రోధానికి జనం విలవిల
తుంగభద్రా, కృష్ణల
గలగలలు పేట్రేగి
విలయ విజృంభణం
కకావికలమవుతున్న
మనోప్రాంగణం

కొట్టుకుపోతున్నవెన్నో
గుడిసెలు పశువులు
మునిగిపోతున్నవెన్నో
ఇళ్లు గుళ్లు
విస్తరిస్తున్నవన్నీ దిగుళ్లు

ఒక వంక
వరద ముంచెత్తుతూంటే
జలదిగ్బంధనంలో
జనం పోటెత్తుతూ
సురక్షిత ప్రాంతాలకై
పరుగులు తీస్తూంటే
ప్రాణాలు మునిగి తేలుతున్న వేళ
ఛానెళ్లలో
చర్చల్లో మునిగి తేలుస్తూంటారు



రసపట్టులో తర్కం కూడదని
వినోదానికీ విఘ్నులనగా
విషాదంలో చేతలుడిగి
మాటలు ముంచెత్తడమూ
మనిషితనంలోకి
మహోపద్రవమే
వరదతోబాటు
రాజకీయ బురద పేరుకోవడం
అసందర్భ పరిణామం

కర్తవ్యతా విముఖులై
ఓ పార్శ్వపు మంత్రిగణం
మంత్రాలయం ముంపువేళ
సచివాలయం
సహకారానికి దూరులై
ఏరు దాటాక తెప్ప తగలేసినట్లు
అధికారాలు చేజిక్కించుకునీ
బాధ్యతలను చేజార్చి వేయడం
బాధ్యుడిగా
ధర్మవిహితంగా వున్నవాడినే
ఆపద్ధర్మమని ఉదాసీనతలో
రాంరాం అన్నట్లుగా
గోడమీద పిల్లిలా
తాము గీసుకున్న సురేఖలు దాటి
తరలి రాకపోవడం
ప్రజాసేవ ప్రమాణాలను
ఒట్టుతీసి గట్టున పెట్టడమే కదా

అంతా
అలల అల్లకల్లోలం
పల్లమెరిగిన ఉధృతపు నీరు
ప్రకృతి అసమతుల్యత నిజాన్ని
దేవుడికే విడిచిపెట్టినట్లు
ఊళ్లమీద పడిన ఉక్రోషం
అధికారం కాదుకదా
పూలశయ్య.
పాపం రోశయ్య
సహాయ నిరాకరణల
ఆపాదిత అనుచరణంతో
'రోషయ్య' కాజాలి కూడా

జాలి ఘటనల జాలంలో
ఏరియల్ వ్యూకు
ఏవియేషన్ ఎమ్.ఇ
ఆలస్యగతులనూ భరించి
తన కర్తవ్యపు
రియల్ వ్యూలో
స్పైన్‌ఫ్లూ బాధిత
విషమ పరిస్తితుల్లోనూ
వయస్సు నధిగమించి
వయస్సు ఉపద్రవాలకు
సమాయత్తం కావడం
సోనియాయే కాదు
జగన్ మానియా గాళ్లయినా
అభినందించాల్సిందే
ఏమేరక యినా

నీటి అలల ఉగ్రరూపం
నేటి అధికారాల ఉగ్రతారోపాలను
ఉపశమింప చేయడం
ఉన్నంతలో ఉపశమనమే
ఇప్పుడు
జగనన్న శాస్త్రాలు ముడిచి
అన్నవస్త్రాలతో
జనాన్ని ఆదుకోవడం ముఖ్యం
ఆపన్న హస్తమై
బాధితులను
అక్కున చేర్చి ఆసరాకావడం
ముఖ్యం

ఏ వైతరణిలో దాటడానికి
ఇప్పుడు వితరణ శీలం చాలు

అల్పపీడన ద్రోణి
అధికారగణ శ్రేణి
ఒక్కలా ఉపద్రవాలకు హేతువుకాక
వరద బాధితులను
అన్నివిధాలా ఆదుకునే
సేతువవ్వాలి
నీటిమడులు
కన్నీటి జడులు తగ్గి
కుదుటపడిన జన జీవనం
సాక్షాత్కరించాలి

ఆపదను ఆసరాగా చేసుకుని
వరద 'రాజు'లు
తయారవ్వకుండా
వుండున్న చోటే మందు రాయాలి
వరద సహాయమూ వక్రం కాకుండా
నిజాయితీ కరకట్టలు నిర్మించి
కాయాలి.

***

*(8 అక్టోబర్ 2009)*

# శ్రీమద్ 'మారాయ'ణం

శ్రీమద్ 'మారాయ'ణం
లక్ష్మణరేఖ లేవీ లేవు
ఎప్పుడో చెరిపేశాం.
మాయా రావణుడు ఎందుకు?
మోహించే సీతలున్నప్పుడు
కాంచనమృగం
మనోకాననంలోనే
కామనయైనప్పుడు,
అసమర్థ రాముడిని వదలి,
నిజరూపం వెంటే  నడచివెడతారు.



శూర్పణఖ చుప్పనాతి తనమే
ముక్కు చెవులెగరేసుకుంటూ
సుందర వదనారవింద అందాల
అర్రులై, వెర్రులై,
రాజపుత్రులయినా
రాసిక్యం వెలిగిస్తారు.
ఇప్పుడు రామాయణం కాదు
అంతా 'మారాయణం',
అన్నీ మారిపోతున్నాయి!
ఎవరి పని వారిది అనేమీలేదు.
వృత్తాల పరిధులు,
వృత్తుల పరిధులు
అన్నీ ఎప్పుడో అధిగమించి
వచ్చేశారు.
వీడు ఇదే చేయాలనడం
శాసించి విధించడానికి వీలేదీ లేదు.
రాజ్యాంగం అంగాంగం
అద్భుత ప్రజాస్వామ్యం
సీతను అనుమానించే
రజక రాజకీయానికే ఆహ్వానం.
ధర్మబద్ధులం కదా!
రాముడే అడవులపాలవుతాడు.
సీత లంకంత భవనంలో
లౌకుశాలుగా ఉంటుంది.
ఎందుకు చెంపలేసుకోవడం
వక్రత భక్తిలో కాదు,
ముందు బుద్ధిలోనే వుంది కదా!
ఒకడు పొగడబడితే
పొటమరించే సందేహమందేహులం.
ఏ గొప్పతనాలూ, స్వకీయాలు
కాకపోతే
ఇసుమంతయినా ఇష్టపడం.
తార్కికతకేం! వున్నదే అది కదా!
తలలు మార్చే తలపోతల తటిల్లతలు
మా నాయకమ్మన్య రంగమే కదా!
అంతా 'ఫ్రీ'జోన్!!

గుడిలో వుండడు.
పెట్టుబడిలో వీలుంటే
పట్నం నడిబజారులో
పాదరక్షల దుకాణంలో
కస్టమర్ కన్యకామణి పాదపద్మాల
చరణ చారణసేవలో
విప్రుడు వాణిజ్య పరుడైవుంటాడు.

దళిత గోవిందం పేరునే అక్కర్లేదు
దేవాదాయశాఖ
కార్యనిర్వహణాధికారి స్థానంలో
చదువుకుని, చెప్పులు
కుట్టుకునేవారూ
చక్రం తిప్పచ్చు!
పదవీ అధికారాల బట్టే
పాదాభివందనాలు కానీ,
ధన సంపత్తుల బట్టే గౌరవ
మర్యాదలు కానీ,
ఇవాళ రాజకీయం కోసం,
రాజ్యాంగం ఇచ్చిన రిజర్వేషన్ల కోసం
తప్పితే
ఎవరేమిటో ఎవరికీ అక్కర్లేదు.

ఒదిగి వుండడంలోంచి
ఎదిగి వచ్చేశాక,
ఎద ఎదనూ విశాలం చేసుకున్నాక,
కులవాచక పదాలు తీసేస్తూనే
కాగల గంధర్వ కార్యాలకోసం
మాత్రమే.
కులాన్నే బిరుదుగా దాలుస్తుండడం
ఫ్యాషనే
ఎవరు ఏ పని అయినా చేయచ్చు.
అసలు
పనిచేసే సంస్కృతి అంటూ నిలిస్తే.
మతం ఒక మత్తుమందు అనేవాళ్లు
తీసుకునే 'డ్రగ్ వేరే వుండచ్చు'.
కానీ గంజాయి 'జాయ్'కు
అలవాటుపడ్డాక
అది దొరికేచోటు
వారివారి అభిమతం బట్టేగానీ,
అవరోధమనుకుంటున్న
మతం బట్టి కాదు!

తాను బాగుపడకపోయినా పర్లేదు
అవతలివాడు సుఖపడకుంటే చాలు.
ఎదుటివాడు ఏడుస్తూండగా
తాను ఎదిగివస్తే అదే మేలు.
బాధే సౌఖ్యమనే భావన తప్పక
రానిస్తాం.
ఆ బాధ అవతలివాడిదైనప్పుడు
తప్పక మేం సంతోషిస్తాం!
సహాయక చర్యలు మాకూ ఇష్టం.
ఆ చర్యలో మాకు అందే సహాయం
చూసుకోగల్గుతున్నప్పుడు

ఏ పని అయినా
ఎందుకవుతుంది కష్టం?
మాకేమిటి?
అదే ప్రశ్న! అదే ఆశ!
ఆ ప్రశ్నించడం నేర్పిన
హేతువులోంచి
ఎదగడమే మా శ్వాస

హేతువంటే
మేం దాటదలుచుకున్న
సముద్రం మీద
నిర్మించుకున్న సేతువు.

కోతులూ, ఉడతలూ కోరి చేరదీసి
పుష్పకం ఎక్కి పయనిస్తాం.
ప్రతిభలూ, సామర్థ్యాలూ
పాత చింత కబుర్లు

ఇప్పుడంతా ఒకటే న్యాయం!
తనూ, తన తనం, తన గొప్పతనం,
అదీ ధ్యేయం!
అవసరం కోసం కులం
అధికారానికై సంకులం
అన్నింటా ప్రత్యేకతల కోసం
ఎంత శాఖోపశాఖలుగా
ముక్కలవడానికైనా
విడివిడి జండాలు కలివిడిగా
ఎగరేసేందుకయినా సిద్ధం

సాగదీయడమే సామర్థ్యమయ్యేక
నిపుణతలూ, దక్షతలూ,
ప్రతిభలూ, నిర్లిప్తమయ్యాక
గుహుడయినా
రాముడిని ఏం చేస్తాడు

ఇవాళ రాముడే
గుహుడిని పడవెక్కించి
సవినయంగా దాటిస్తాడు.

వృత్తులు వేరయినా పనితనం ఒక్కటే.
పనితనం చూపనితనం
విస్తరించకుండా
దుమ్మురేపితే చాలదా!
ప్రపంచీకరణ దుమ్ము చూపితే
చాలదా!

***

*(22 అక్టోబర్ 2009)*

# ప్రమోద జనకులు

శ్రమ సూర్యుడు
సేదతీరిన కనురెప్పల దుప్పటి
కార్పొరేట్ కార్యక్షేత్రంలోనూ
కనబడని స్వేదం
తనివితీరా తుడుచుకున్న
నిశ్చింత సుమిర గంధకుటి.

గుండెనిండుగా
గుండెల మీదా
ఎంత సుఖప్రమోదం!
ఒక సృష్టికి సృష్టి చేసిన
కర్తవ్య నిర్వర్తనానందం.

నందన
ఆనంద స్యందన.
అమ్మాయి పిల్ల తెమ్మెరై
ఉల్లాన్నే కాదు
కల్లోల జగతినీ ప్రేమైకమూర్తిగా
పరిరక్షించడానికి పరిఢవిల్లే
ప్రకృతి పసితల్లి.
చిట్టిచేతుల చిన్నారి తల్లి.

నాన్న గుండెమీద ఎంత సుఖం!
గుండెల్లోని తృప్తి నాన్నకు
ప్రతిఫలించే ముఖం!
ఔను పాపే కనుపాప.
ధ్యానాన్ని వలవేసి తెచ్చిచ్చే
ఆద్యవతార చేప.

ఎంత సంక్షుభిత ప్రపంచం
బయట కదనుతొక్కనీ
మీడియా గోడుల దాడుల
గొడవ గొడవల గొణుగుడులు
గొంతెత్తి అరవనీ

పాపని పొదువుకున్న గుండే
పావన మానస చరితం.
రంగురంగుల సీతాకోక చిలుక
నీ బ్రతుకు తోటలో
విహరించడాన్ని మించిన
సౌందర్యం ఇంకెక్కడుంది?



గౌన్లు, పరికిణీలు, పావడాలేకాదు
మిడ్డీలు, ప్యాంట్లు, షర్ట్‌లు
దుస్తులేవి ధరింపచేసినా
పోగుపోసిన లాలిత్యానికి,
సౌమనస్య సౌకుమార్యానికి,
హృదయం నెలవుకాకుండాపోదు.
అమ్మాయి అబ్బాయికి
ఏ దారుఢ్యంలోనూ తీసిపోదు.

పాపను పొదువుకున్న
జనక హృదయం
జజ్జనక జ్జనారేల
జానపద సహజానంద తరంగిత
నృత్యాంతరంగం
మౌనంగా ఆ నిదురించే గుండెల్లో
ఎంత అలౌకిక ఆధ్యాత్మిక
ఆరామ విహారాలతో చెంగలిస్తోందో
మనశ్శాంతి కురంగం.
ఎవ్వరూ చేయకండి భంగం!

గ్రేటర్ హైదరాబాద్
హై ధరల బాదుడులెన్ని వున్నా
ట్రాఫిక్ జామ్‌ల
జూమ్‌లెన్స్ మెగా దగాలెన్నివున్నా
నగరం ఎన్ని ఘోరాల నేరాల
నగారాలు మ్రోగిస్తున్నా
ఎంత రాజధాని రాజకీయ రాంఢోళ్ల
గిరగిరాంలు
గింగిరీలు తిరుగుతున్నా

రాత్రింబగళ్ల
నిరంతర శ్రమాగ్నులు
ఎంత ప్రజ్వరిల్లుతున్నా
అశాంతి చిత్తానికైనా
ప్రశాంతి సమీరం,
కరుణ వనాశ్రిత
హృదయ శేముషిత్వం
పవిత్ర ప్రసాదం,
లౌకికతలకు చలించని ధీర
రేపటి భవిష్యత్ సుందర సుమిర.

ఏ వంశాన్ని
అభ్యుదయానంద పరవశాన్ని చేసే
ప్రవిమల వంశాంకురమో
తండ్రి గుండెల మీద పసిపాప!

తండ్రీ కూతురూ
గుండె గుండె గానం వింటూ
లోని శబ్దధారలో
జలకాలాడుతున్న అద్భుత దృశ్యం
ఎంత సామాజిక సందేశ
అప్రకటిత పారవశ్యం!

కంటే కూతుర్నే కను.
సృష్టికై సృష్టించిన
ఆనందాభ్యుదయానుభూతిని కను.
ఎద లోతుల దాగిన
స్మరణ ధ్యాన గీతాలను విను
ఎడతెగని శాంతిని పరివ్యాప్తం చేసే
కాంతా సమ్మిత తయోపదేశయుజేల
కావ్య ప్రయోజనాన్ని కను!

పాపే మా ప్రాణం!
ప్రకృతి ప్రశాంత గానం!
ప్రగతి చింతనా ధ్యానం!
వసంతం రాధాయిల
వరాల మను మరాళ
నీరక్షీర వివేకోదయంలా
ఆత్మశక్తిని
ఉద్దీపింపచేసే ఆదిశక్తి అమ్మాయే
సకల చరాచర జీవరాశీ
ఈ విషయం నమ్మాయే!

పాప నడిచే ఇల్లే
పావన సుత ఆలయం.
అదే ప్రేమ భాగ్య నిలయం.
ఆడపిల్ల ఎప్పటికీ
గుండెల మీది కుంపటి కాదు
గుండెల్లోని గంధకుటి.

నిశ్చింతను, నిర్భయాన్నీ
తన్మయతనూ, తాదాత్మ్యతనూ
స్మరణనూ, ధ్యానాన్నీ, అభ్యాసాన్నీ
అన్నిటినీ ప్రోదిచేసి
అనుభవ ప్రపంచాన్ని
అనుభూతి ఉద్యానవనం చేసే
ఉల్లాసోద్వేగపు ఊయల.

పాపలను కన్న
తండ్రులు ధన్యులు.
కరచాలనం చేయదగిన
కీర్తిమూర్ధన్యులు.

ప్రకృతిని ప్రశాంతం చేసి
విశ్వశాంతిని విస్తరింపచేసి
విజయకేతనం ఎగురవేసిన
ప్రమోదానంద స్ఫూర్తులు
ఆడపిల్ల తండ్రులందరికీ
నమస్కృతులు.

***

***(19 నవంబర్ 2009)***

# ఈ చరిత్ర ఏ సిరాతో...?

యాభైఏళ్ల క్రితంకాలమా ఇది?
ఏకత్రాటి నడకలూ
ఏనాడో గతించాయి.
ఎవరి త్రాడు వారిదే.
ముడులు వేయడంలో
అంతా సిద్ధహస్తులే.
సమస్యలను విప్పడంకన్నా
సృష్టించి పెంచి పోషించడంలోనే
ప్రజ్ఞ.
సున్నితత్వాల కాలమా ఇది



అంతా రఫ్ అండ్ టఫ్!
రక్తపాతాలూ, కత్తిపోట్లూ, హత్యలూ,
ఆత్మాహుతులూ,
బాంబు విస్ఫోటనలూ
అలవోక వ్యవహారాలుగా
మారిన కాలాన
పొట్టి శ్రీరామునిలా
ఆత్మ త్యాగాలకు సిద్ధపడడమూ
నేడు అవివేకం తప్ప ఇంకేమీ కాదు.

ఆనాటి సంచలనాలు ఇవాళ
నిత్య వార్తాంశాలు మనకు.
ఉన్నత విద్యకు విదేశం వెళ్లాలన్నా
ఏదయినా ఉద్యోగంలో చేరాలన్నా
ఒక్క పోలీసు కేసు ఏదైనా
నమోదైవుంటే ఎంత ఆఘాతమో
విద్యార్థులకు తెలుసా పాపం?
కీలుబొమ్మలను చేసి
రాజకీయ పావులను చేసి
వాళ్ల భవిష్యత్తుతో ఆటాడుకోవడం
ఆశయం ఏదయినా
ఇది అమానుషమే కాదా!
పాత వ్యూహాలిప్పుడు పనికిరావు.
ఉగ్రవాదం అగ్రవాదమైనా
సంక్షుభిత సందర్భాలను తప్ప
విజయోత్సవం సృజింపబడి
వెండిపళ్లెంలో వస్తుందనుకోలేం!

మార్పును
మంచికోసం ఔదలదాల్చడంలోని
విజ్ఞత
సమస్యలను వివేకంతో
పరిష్కరించుకునే సమయజ్ఞత
అదీ కావలసింది!
దురంత పద్మవ్యూహాలతో కాదు
అవసరమనే అనివార్య అనురాగ
మానసిక సంస్కారం ఉద్దీపింపచేసి
సాధించుకోగలగాలి దేనినైనా.
రెండు నేత్రాలయినా చూపు ఒకటే.

రెండుగా విడి,
కలిసి వుండడానికి వినమ్రంగా
రెండు చేతుల నమస్కారం గుర్తు.
పిడికిళ్లు బిగిసినా
కేంద్రం బిగుసుకుంటుందేగానీ
హృదయ పరివర్తన ఆశించగలమా?
ఆలోచించవలసిన చోట
ఆవేశాలే అవరోధాలవుతాయి
సాధించవలసిన చోట
సాధింపులతో సానుకూలతలు
చెడతాయి.

అందరి అభీష్టమూ ఒకటే అయితే
వేర్వేరు జండాలెందుకు.
మంచిని సాధించుకునే మార్గమూ
మంచిది కాగలగడం
సత్యాగ్రహ గాంధీజీ అన్నదే!
ఇప్పుడది 'గాంధీగిరి' అయివున్నదే!

సంస్కృతపదం లేకుండా ఆంధ్రుడు
ఆంధ్రపదం లేకుండా
తెలంగాణ్యుడూ మాట్లాడలేడు.
భాష పేరిట వైరుధ్యాలు, వైషమ్యాలు
విచ్చుకోవడం కంటే
భావ వినిమయ సాధనం భాషను
పరిపుష్టం చేసుకోవడానికి
అన్ని ప్రాంతాల పలుకులూ
ఆదాన ప్రదానాలవ్వాలి
కె.సి.ఆర్ అంటేనే
కష్టసాధ్యం రాష్ట్రం
అని గద్దరించేవారు లేరా?
ఆందోళనలతో కాకుండానే
విజయశాంతితో రాష్ట్ర సాధన
సాధ్యమా?

మట్టిసారం ముఖ్యం.
నదులు ప్రవహించిన మాత్రాన
రాతినేలల్లో వరిపంటలు పండవు.
పుట్టతేనె, కుంకుళ్లు దొరికే
మన్యప్రాంతాలకూ,
పొగాకు నేలలకూ వ్యత్యాసం లేదా?

హిందీ మాట్లాడేవారికి
నాలుగు రాష్ట్రాలుండగా లేనిది
మనకు రెండుంటే దోషమేమీ కాదు.
పరమ ప్రయోజనాలు
నెరవేరేట్లే అయితే
ప్రేమాభిమానాలు నిలుపుకుంటూ
వేరుపడటం మంచిదే!
కాదూ! కె.సి.ఆర్ కొత్త రాష్ట్రానికి
ముఖ్యమంత్రి కావడమే
సమస్యలన్నింటికీ పరిష్కారం
అయ్యేట్లయితే
నిజంగానే ఎంత బాగుంటుంది!
పోనీ కేంద్రంలో
సోనియా బంగారు తల్లి
ఈ రాష్ట్ర ముఖ్యమంత్రులుగా
ఓ ముప్ఫై ఏళ్లు వరుసగా
తెలంగాణావారినే
నియమిస్తూ పోతేనైనా కలిసుంటారా

మనఃసంకల్పాలు మానవీయకల్పాలై
మహనీయ పథంలో మలుచుకోవాలి.
వేర్పాటు ఏర్పాటులోనే
జనాభ్యుదయం వుంటే
జరిగి తీరాల్సిన
కొత్త చరిత్ర అదే కావాలి.
***

***(3 డిసెంబర్ 2009)***

# హక్కుల 'దినం'

తల తిరిగిన రచయిత్రి
ఊహాగానం ఆగిపోయి
పుష్కరం.
కట్టమంచి మంచి కట్టకట్టి
నూటముప్ఫై ఏళ్ల జయంతి నెట్టి
నూట పధ్నాలుగు వర్ధంతుల
నోబెల్ కాజ్ అనగా కారణాలను
రణక్షేత్రాలలో ముట్టి
ఇవాళ
ఎన్నెన్ని ఘటనలో స్మృతిలో పట్టి
మానవ హక్కుల గురించి
మాటాడుకుందామా?



లెబర్వాన్‌గా రమారమి
రామరామా? ఏవీ హక్కులు?
మా 'నవ' హక్కులే అన్నీ!

హక్కుల సుందరి హుక్కులు విప్పి
బూతు చిత్రాల నాయకునిగా
అమెరికాలో జెండా
పాతుతానంటాడు
షారుఖ్‌ఖాన్.
సిల్వెస్టర్ స్టాలోన్‌లా
సిల్వర్ స్క్రీన్ మీద
వెండిచెంచాల సంపత్కుమారులకే
వెకిలి ఊహలు వెక్కసంగా వచ్చి
సరదా పరదాలనడం సమర్థింపై
మా 'నవ' హక్కేనా?

కిరోసినో, పెట్రోలో పోసుకుని
తగలెట్టుకో చూడడం
విద్యుత్ స్తంభాల తీగెలపై
విగత జీవిగా వ్రేలాడడం
పురుగుల మందు తాగి
పితృవనానికి తిరుగుబాట పట్టడం
అంతా హక్కులేనా?...

ఎలుకలున్నాయని ఇంట్లో
ఇంటికి నిప్పెట్టుకోవడమూ
హక్కేనా!
అభివృద్ధి మంత్రాలన్నీ
కంటితుడుపులతో హుళక్కేనా!

సందేహమందేహుల దేహం
బక్కచిక్కేనా!

బ్రతకడం హక్కుగానీ
చావడం కాదు.
బ్రతుకు చచ్చే చావవుతున్నా సరే
చావుని చావ చితగ్గొట్టి,
చచ్చేదాకా బ్రతకాలే గానీ,
కేవలావేశాలు అనర్థదాయకాలు.
కర్తవ్య పాలనలే విధాయకాలు.

తలచుకుంటే
వరదానానికి ఈషణ్మాత్రకాలం.
కాదంటారా?
నాకేమీ అధికారం లేదనే
హక్కుల పేరిటనే మాయాజాలం.
నేరం ఒక హక్కు.
హింస ఒక హక్కు.
చీల్చడం హక్కు
కూల్చడం హక్కు
అది రాజకీయపు హక్కు
సామాన్యుడికి అది అర్థంకాని
అయోమయం ఉక్కు
పోలీసు లాఠీదెబ్బ పడి
అరెస్టయి అనవసర కేసుల పాలయితే
అది భవిష్యత్తంతా
పట్టి కుదుపుతుంది.
ఇవాళ కీ ఇచ్చిన బొమ్మయితే
దిమ్మ తిరిగే తిమిరం
బంగరు భవితవ్యాన
హక్కు భుక్తమవుతుంది!

సారూ!
ఎవరి పని వారు చేయకపోవడం
మా'నవ' హక్కేనా?
రాజకీయం చేయాల్సిన పనికి
విద్యారంగం నడుం బిగించడం
హక్కేనా?

శివుడి ఆజ్ఞలేనిదే చీమైనా కుట్టదా
శివుడికి మాత్రం ఏమీ పట్టదా.
నిజాం నగరంలో ఇమామేమంటాడో
చంద్రశేఖరా పాహిమామ్!
టార్నిడో టార్పిడో!


***

***(10 డిసెంబర్ 2009)***

# పదికాలాలు పదిలంగా ఉండాలి

వెళ్లక తప్పని వేళ
నువ్వెడతానంటే మేం వద్దంటామా!
ఎవరు మటుకు ఏమంటాం!
సాదరంగా వీడ్కోలు పలుకుతాం.

కష్టమో, సుఖమో
ఇన్నాళ్లూ కలిసి భరించాం కనుకనే
ఒక మమకారం.
నువ్వు వెళ్లిపోవడమే ఖాయమైతే
నువ్వు మిగిల్చిన చేదును మింగి
రాబోయే అమృతానికై
బ్రతుకు సముద్ర 'మథన పడతాం'




ఎంత క్షోభపెట్టావ్!
ఎంత చిచ్చు రగిల్చావ్!
రాజకీయ సమీకరణలు మార్చావ్!
ఎందరు సమర్థులను దూరం చేశావ్!
కన్నీటి వరదల్లో ముంచావ్!
క్రోధాగ్నుల్లో మాడ్చావ్!

అయినా అన్నీ భరించాం కదా
మాలోకి, మా కోసం వచ్చావని
'మాలోకం'గా నిన్ను విశ్వసించాం.
వెళ్లు! వెళ్లు!!
వెడలిపోయే వేళ కదా
వెక్కసమైపోయావులే ఎలాగూ
ఇక దయచెయ్!

ఒక్కటి గుర్తుంచుకో!
చివరాఖరుగా మాత్రమే
నువ్వు వెళ్ళిపోగలవు.
మా ముందువేవీ నువ్వు
పట్టుకెళ్లలేవు.
తొమ్మిదిపోతే
పది వస్తుంది.
నువ్వు మాముందే వుండివుంటే
విలువ ఎంతటిదో.
కానీ అదెప్పటికో.
వచ్చేది ఏదయినా మా వెంటే.
అదీ ముందుకు వెడితే
కాలం మరీ వెనక పడుతుంది.
రెండువేలు మా దగ్గరే వున్నాయి.
ఏది వచ్చిపోయినా
అది అదనమే.
కానీ ఆ అదునులోనే
బ్రతుకు పదును

బ్రతుకంటే
రాకపోకల రస్తా అని తెలుసు

ఉన్నంతవరకే ఉనికి అయినా
ఊపిరి పోయేటప్పుడు
ఏదీ వెంటరాదు
మిగిల్చిన జ్ఞాపకం తప్ప.

ఆరాటాలు పోరాటాలు
అనవసర ఆవేశాలు
వైయక్తిక ప్రయోజనాలూ
అవే సర్వస్వం అనుకుంటే
బ్రతుకు భవిష్యత్తు అనుకుంటే
అలాగేకానీ
కలిసి విడిపోతామో
విడిచి కలసిపోతామో
కాలంకేళి కదా!
రెండువేల తొమ్మిదీ
అదిగో వస్తోంది నిన్ను నెట్టేస్తూ పది
నువ్వుండిపోవాలని మాకేం లేదు
నువ్వు ఒరగబెట్టిందేమిటనేమీ
ప్రశ్నించడం లేదు
గొప్పకు ప్రశంసించడమూ లేదు
వచ్చావు, వున్నావు, వెడుతున్నావు
అంతే!

తెల్లసౌధంలో
నల్ల సూర్యుడిని నిలిపింది నువ్వే
పాతికేళ్ల ఎల్.టి.టి.ఇ.ని
ఓటమి పాలుచేసింది నువ్వే
ఆర్థిక సంక్షోభాన్ని
అంతర్జాతీయం చేసింది నువ్వే

ఆంధ్రప్రదేశ్‌లో
పునర్వైభవ దీప్తి తెస్తాడని ఆశపెట్టిన
వైఎస్సార్‌ని పొట్టనబెట్టుకుని
ప్రాంతీయ ఉద్యమానికి
ప్రాణప్రతిష్ఠ చేసింది నువ్వే
మైఖేల్ జాక్సన్‌నీ
పట్టమ్మాళ్‌నీ, కమలాదాస్‌నీ
దివంగతులను చేసి
స్వైన్‌ఫ్లూ బారిన ఎందరినో పడేసి
వరదలు, రాజకీయ బురదలు
పరివ్యాప్తం చేసింది నువ్వే.

వెళ్లు వెళ్లు! చాలు పేర్చిన కుళ్లు
చేసిన మంచికి అది ఎంతటిదైనా
కృతజ్ఞులం
ఇచ్చిన వేదనలకు, సమస్యలకు
సలాములే!
ఎందుకంటే అదేగా రగిల్చింది మాకు
ఎదుర్కొనే శక్తి

శుభ్రం చేసుకోవాల్సిన దెంతో వుంది
చెత్తాచెదారాలను ఊడ్చి పారేసుకుని
వాకిలిని ప్రక్షాళనం చేసుకుని
తీర్చిదిద్దుకుని
రంగవల్లులద్దుకోవాల్సి వుంది

వస్తానంటున్న పదిని
పదిలంగా రానివ్వు
నువ్వు మర్యాదగా తప్పుకుని
రెండువేల పదికి దారివ్వు


చీకటి పడుతోంది
అందులో కరిగి పోతూ పోతూ
చంద్రగ్రహణం తెస్తున్నావనీ తెలుసు
వస్తూ వస్తూన్న
పదికే అది ఆరంభమనీ తెలుసు

అయినా గ్రహణం విడుస్తుంది
సరికొత్త సంవత్సరం ప్రకాశిస్తుంది
ఈ చీకట్లు ఛేదించుకుని
నవోదయం ప్రభవిస్తుంది

మా ఆశ, మా ధ్యాస
పదిలో పదిలంగా పదికాలాలు
తలచుకునేలా
ప్రతిఫలిస్తూ ఫలిస్తుంది
స్వాగతించే నవవర్షం
హర్షమై నిలుస్తుంది.

***

***(31 డిసెంబర్ 2009)***



*Kavikaalam*
*(Poetry)*
*Sudhama*

సమకాలీన సంఘటనలపై మామూలు మాటల్లో, పత్రికా పరిభాషలో వ్యాఖ్యానించడం వేరు. కవితాత్మకంగా స్పందించడం అందుకు భిన్నం. ఇది సుధామకు వైవిధ్యమైన రచనానుభవం. పాఠకునికి విలక్షణమైన పఠనానుభవం. ఈ కాలమ్ నిర్వహణ అంత సులువు కాదు. ఒక సంఘటనను, సందర్భాన్ని ఎంచుకోవడం అత్యంత కీలకమైనపని. దానిపై తన స్పందనను కవితాత్మకంగా వ్యక్తం చేయడం కాలమిస్టు సృజనకు పరీక్ష. కాలమిస్టు కవి కాకపోయినట్టయితే ఈ కాలమ్ రాణించి వుండకపోయేది. స్వతహాగా కవి కావడం వలన, నిరంతరం కవిత్వాన్ని అధ్యయనం చేస్తూ, రాస్తూ వుండడం వల్ల సుధామకు ఈ కాలమ్ నిర్వహణ సాధ్యమైంది. తన లక్ష్యాన్ని సాధించడంలో కవిగా, కాలమిస్టుగా సుధామ సఫలీకృతులయ్యారు.

PALAPITTA
BOOKS